# తెలుఁగుదళవాయి

## చారిత్రక నవల

రచయిత

**నండూరి రామకృష్ణమాచార్య**

ప్ర కా శ కు లు

**రామా అండ్ కో.,**

ఏలూరు

# తొలినుడి

"తెలుఁగుదళవాయి" చారిత్రకమైన యాఖ్యాయిక. వీరరసాత్మకమైన యీకథకు నాయకుఁడు చంద్రగిరి నేలిన శ్రీవేంకటపతిరాయల కాలమునాటి యాచమనాయఁడు తెలుఁగుదళవాయి. తెనుఁగు పిల్లలకుఁ జరిత్రలోఁ దెలుఁగు వీరులు సాధించిన యత్యద్భుత ఘనకార్యములను బ్రాచీన వైభవ ప్రభావములను స్మరణకుఁ దెచ్చు సంకల్పమే యీ రచనకుఁ బ్రాతిపదిక.

ఇందలి యితివృత్తము కల్పితగాథ కాదు. ముఖ్యపాత్రములన్నియుఁ జరిత్ర లోనివే. "సత్యము కల్పనా కథకంటె నద్భుతతర" మని యాంగ్లమునఁ గల సుభాషితమునకు యాచమనాయకునికథ యుజ్వల నిదర్శనము. దక్షిణభారత చరిత్రను బరిశీలించిన శ్రద్ధాళువులైన పఠితల మనఃఫలకమున యాచమనాయకునిపాత్రము నిలుకడఁగనిన మెఱపుతీగె వెలుఁగుతోఁ బ్రకాశించినిల్చియుండును. యాచమనాయకుని గాథకు సమకాలీన పాశ్చాత్య యాత్రికులు తమ రచనల యందు విశేష ప్రాముఖ్య మొసంగుట యీ యితివృత్త గౌరవమున కుత్తమతార్కాణము.

ఉన్నత పాఠశాలలోఁ బఠించు విద్యార్థుల కుపయుక్తమగునట్లు సులభశయ్యలో నూతన ప్రణాళిక ననుసరించి యీ "తెలుఁగు దళవాయి" రచించితిని. ఇతర జిజ్ఞాసువులకుఁ గూడ నీగాథ యాకర్ష ణీయము గావచ్చును.

ఈ గ్రంథమును బ్రకటించిన విఖ్యాత పుస్తక ప్రకాశకులు రామా అండుకోవారికి నా ధన్యవాదములు.

కవితాప్రభాస : అనంతపురము :

నండూరి రామకృష్ణమాచార్య.

---

# తెలుఁగుదళవాయి

## ప్రథమాశ్వాసము

~~~~~

వేగుజుక్క పొడిచినది. తూర్పుకనుమలపై ముసి ముసి చీఁకటుల చెదరిపోసాగినవి. చంద్రగిరికోట మొగసాలలో గంటలు మ్రోగినవి. చెట్లగుంపులలోనుండి పక్షుల కలకలము బయలుదేరినది. పాదచారులై చంద్రగిరి రాజవీథులలో యాత్రికులు తిరుమలకు బయలుదేరిరి. బాటసారులు గుంపులు గుంపులుగ మేలుకొలుపు పాటలు పాడుకొనుచు నేడుకొండలసామిని స్తుతించుచు బయనించుచుండిరి. కొందఱు శకటముల నధిరోహించి కొండలక్రింద బాటనుబట్టి పోవుచుండిరి. కమ్మని కల తేలిపోవునటులఁ జిఱు చీఁకటులు చెదరి తూరుపు తెల తెల వారినది.

తెల్లవారిన సూర్యగ్రహణము. పర్వదినమగుటచే నానాఁడు, తిరుపతి వేంకటేశ్వరుని సందర్శించుటకు భక్తులు తండోపతండములుగ నరుదెంచుచుండిరి. ఉదయభానుని కోమల కిరణములలో మిలమిలలాడుచున్న కొండలపై భక్తబృందములు చీమల బారులవలె గోవిందలు కొట్టుకొనుచు నుప్పొంగి పోవుచుండిరి.
~~~~~

తిరుపతికొండలపై నాదృశ్యము దర్శనీయము. తీర్చిన యూర్ధ్వపుండ్రరేఖలు, తులసీదళమాలికలు, తాళములు వేయుచు మృదంగ నినాదముల మేళవించి కీర్తనలు పాడు భక్తబృందములు నెచ్చటఁ జూచినఁ బ్రత్యక్షమగుచుండెను. ముండిత శిరస్కులు కొలనులో స్నానము చేయుచుండిరి. కొలనుగట్టుపైనొక ముసలియేనుఁగు కలదు. ఆవృద్ధమత్తేభము యొక్క ముఖమున తిరుమణి శ్రీచూర్ణరేఖలు దవ్వుదవ్వున నున్న యాత్రికులఁగూడ నాకర్షించుచుండెను. అంకుశమును జేతఁబట్టి మావటీఁడా యేనుగు నిటునటు నడుపు చుండెను. ముండితశిరస్కులైన భక్తులు కొలనులో స్నానముచేసి గట్టునెక్కి శిరస్సుపై నొకనాణెమునుంచి నిమీలిత నేత్రులై ధ్యానపరులై నిలుచుచుండిరి. ఆయేనుగు భక్తుల శిరస్సుపై నున్న యాచిన్న నాణెమును దొండముతో గ్రహించి మావటీని కందించుచుండెను. కొందఱు వింతగా నీదృశ్యమును దిలకించుచుండిరి. ఒకభక్తుఁడు సంభ్రమముతో "బాగుగనున్నది ఈ యేనుగు నున్నని గుండును వెలగపండనుకొని తొండముతోఁ ద్రుంచుకొని మ్రింగుట లేదు. మచ్చిక చేసికొనిన నడవి మృగముల కెంత సుకుమారత యబ్బునో" యని తన మిత్రుని నవ్వించెను.

స్నానము చేయుచున్న యాత్రికులలోఁ గలకలము బయలుదేరినది. కొలను సమీపమున నొక భక్తబృంద మ

పించెను. తూర్యనినాదములు మ్రోసినవి. శంఖములు మ్రోగినవి. “అడుగో! అతఁడే యాచమనాయకుఁడు!!” అను పలుకులు జనసమూహమున వినిపించినవి.

యాచమనాయకుఁడు తన పరివారముతోఁ నే తెంచి స్నానముచేసి యూర్ధ్వపుండ్రములు తులసీదళపుష్పమాలికలు ధరించి దేవాలయమునకుఁ బ్రదక్షిణ మొనరింపసాగిపోయెను. కొలనునొద్ద స్నాన మొనరించుచున్న యాత్రికులలోఁగొందఱు వినయగంభీరమూర్తియగు యాచమనాయని దర్శనభాగ్య మబ్బెనని సంతోషించిరి. యాచమనాయకుఁడు ధర్మపరుఁడని దాతయని మహావీరుఁడని లోకములోఁ బేరుకెక్కెను. అతనిని జూచినంత నే యాలోచింపకయే యతని వెంటఁదిరుగ మొదలు పెట్టినవారు కొందఱుండిరి. మఱికొందఱు సుప్రసిద్ధుఁడైన నాయకుని వెంట వెడలిన స్వామిసందర్శనము సుకరమని తలఁచిరి. కతిపయపరివారముతో వేంకటేశ్వరుని సేవింపఁ దలఁపోసివచ్చిన యాచమనాయకుని వెంట నవ్యాజముగ ప్రజాసమూహము మూగుచుండెను.

తాళ్ళపాకవారి కీర్తనలను గానముచేయుచున్న యొక భక్తసమూహమున యాచమనాయకుఁడు గడ్డముక్రిందఁ దన చేతికట్టునిడి నిలువఁబడియుండెను. భక్తులు పరవశత్వమున జెంది పాడుచుండిరి. తాళములు వేయువారు, మద్దెలవేయువారు, తాంబురా మీటువారు, క్రమక్రమముగ వేగమును

హెచ్చించిరి. ఒక భక్తుఁడు మైమరచి "ఏడుకొండలవాఁడా! వడ్డికాసులదేవా!" యని యేమేమొ స్తుతించుచు నేలపై కొఱగి వోయెను. భజన యాగిపోయినది. మూర్ఛపోయిన భక్తునికి శీతలోపచారములు సల్పువారు కొందఱు. అతనికి సాష్టాంగ ప్రణామ మాచరించువారు మఱికొందఱు. కొంత సేపటికా భక్తుఁడు తేరుకొనెను. ఇంతలో సూర్యగ్రహణము పూర్తియైనదనియు, పట్టువిడిసినదనియు మసిపూసిన గాజుముక్కలలోనుండి చూచుచున్న జనులు వచించిరి. ఆలయములోని వైష్ణవార్చకుఁ డొకఁడే తెంచి విడుపుస్నానము చేయుఁడని యాత్రికులను హెచ్చరించెను.

యాచమనాయకుఁడు పరివారముతోఁ గొలనులోఁదిగి స్నానమాచరించి బ్రాహ్మణులకు దక్షిణలిచ్చెను. గర్భాలయమును జేరి స్వామివారికి నంగరంగ భోగములకు బంగారు నాణెముల సమర్పించెను. మంత్రపుష్పము నర్చకుఁడు పఠించు సమయమున గద్గదస్వరముతో "యాచమనాయకుఁడు తన యేలికయగు శ్రీవేంకటపతి రాయలవారి యాయురారోగ్య సంపదలకై స్వామివారికి విశేషించి సమర్పించు బంగారు నాణెములు మఱికొన్ని" యని చదివించెను. ఆ పలుకులను విన్న భక్తులలో గుసగుసలు వ్యాపించినవి. యాచమనాయకుఁడు భక్తులతోపాటు తీర్థప్రసాదముల నందుకొని స్వామి గర్భాలయమునుండి నిష్క్రమించెను.

అచ్చటఁ జేరిన జనసమూహములలో నున్న యొక యాత్రికుఁడు "యాచమనాయకుఁడెవరు? అతనితో నిట్లిందఱు మూగుచున్నా రేమి ?" యని మరియొకరి నడిగెను. వెంటనే యతఁడు "యాచమనాయ ని పేరెఱుఁగనివారు మాసీమలో లేరు. మీరెవ"రని తిరిగి ప్రశ్నించెను. "మేము పర దేశులము- తెలియదు. దయచేసి తెలుప ప్రార్థన." యని విన్నవించెను.

"యాచమనాయకుఁడు గడితేరినవీరుఁడు పేరెన్నిక గన్న దళవాయి. భక్తుఁడు. దాత. ఇంతకంటె వర్ణించి చెప్పుటకు నేను కవినిగాను. ఇప్పుడు కవులులేరు. ఆ కాలము పోయినది. ఆవిద్యానగరముతో సర్వముపోయినది. ఇప్పుడేమున్నది. చంద్రగిరిరాయలు వేంకటపతిమహారాజు. ఆ మహారాజు పేరునకు రాజు. శ్రీవారిని రాణి బాయమ్మగారు పరిపాలించుచున్నారు. దినదినము క్షీణించుచున్న రాజ్యమును రాణిగారి తండ్రిజగ్గరాయఁడు, రాజుగారి బావమఱదియోబలరాయఁడు పరిపాలించుచున్నారు. ఎవరో యాచమనాయకునివంటి పూర్వకాలపుమనుష్యులు మాత్రము రాజుగారి నంటిపెట్టుకొని యున్నారు. వినలేదా రాజుగారి పేరుమీఁద నాయఁడు సువర్ణ పుష్పములు చదివించినప్పుడు విన్నవారి కాశ్చర్యము కలిగినది. ఇంకను రాయలవారిని స్మరించుకొనుచున్న నమ్మినబంట్లున్నారన్న యాశ్చర్యమేకదా! రేపటిమాట చెప్పలేముగాని నేటివరకు యాచమనాయకుఁడు రాయలకు నమ్మినబంటు-

చంద్రగిరి యాస్థానమున యాచమనాయకుఁడొక్కఁడే ప్రాచీన విజయనగర మహాసామ్రాజ్య ప్రభావమును దలపునకుఁ దెచ్చు దళవాయి అయిన నే”మని చెప్పి గొణగుకొనుచు నతఁడు తరలిపోయెను.

యాచమనాయకుఁడు గృహోన్ముఖుఁడై తరలిపోవుచు శ్రీకృష్ణ దేవరాయలశిలావిగ్రహముకడ నాగెను. అచ్చటఁ జేరిన జనసమూహము కృష్ణరాయల ననేకవిధముల స్తుతింప సాగెను. యాచమనాయకుఁడు మౌనముద్ర ధరించెను. ఒకనాఁడు విశ్వవిశ్వంభరావలయమున నంతటిసామ్రాజ్యములేదు. విద్యానగరమువంటి మహానగరములేదు. నేఁడది పగిలిపోయిన రాళ్ళకుప్పలు. అచ్చట చేరినవారిలో నెందఱో విద్యానగర సామ్రాజ్యవైభవమును బ్రత్యక్షముగఁ జూచిన వారుండిరి. కృష్ణరాయల విగ్రహమును జూడగనే వారిలో ననిర్వచనీయమైన విషాదము రేకెత్తినది. “శ్రీకృష్ణ దేవరాయ లధిష్ఠించిన సింహాసనమున కెట్టి గతిపట్టినది. నాఁడు రాజధాని విద్యానగరమును బ్రజలను శ్రీకృష్ణరాయలు సంరక్షించెను. కృష్ణరాయలను శ్రీతిరుపతి వేంకటేశ్వరులు సంరక్షించెను. నేటిరాజధాని చంద్రగిరిని, శ్రీ వేంకటపతి రాయలను బ్రజలనుగూడ శ్రీయేడుకొండలవాఁడే రక్షింప వలసియున్న”దని, యాచమ నాయకుని పరివారములో నెవ్వాఁడో పలికెను. యాచమ నాయకుని కన్నులలో నీరుగ్రమ్మినది. నడుమునఁగట్టినగండ

భేరుండపుటంచుల యుత్తరీయమును విప్పి యాతఁడు కన్నీరు తుడుచుకొనుచుఁ దరలిపోయెను.

శ్రీకృష్ణ దేవరాయల శిలావిగ్రహము చుట్టును ప్రజలు చేరి నానా విషయముల మాటలాడు కొనుచుండిరి. అందఱు పూర్వవైభవమును నాటిదైన్యమునుబోల్చిఖిన్నపడుచుండిరి. మహారాజు శ్రీవేంకటపతి రాయలు చంద్రగిరినుండి కదల లేఁడు? రాజ్యమున సామంతులు నాయకులు స్వతంత్రులగు చుండిరి. గడిసీమలలో నరాజకము ప్రబలిపోయినది. శత్రు రాజు లా ప్రజలను గొల్లగొట్టుచుండిరి. రాయ లసలు తెలివి గలవాఁడని చాకచక్యముతో నేలుబడి సాగింపగలవాఁడని ప్రసిద్ధి. కాని యతఁడు చిన్న రాణిచేతిలో కీలుబొమ్మ. ఇప్పుడు ముసలివాఁడని చెప్పవచ్చును.

చిన్న రాణి బాయమ్మయనిన వేంకటపతి రాయలకు మిక్కిలిప్రీతి. ఆమె తెలివిగలది. సౌందర్యవతి. రాయలచెల్లెలు వెంట నొకనాఁడామె చంద్రగిరి యంతఃపురమునకు వచ్చినది. రాయల చెల్లెలుభర్త యోబలరాయఁడు. ముసలి వేంకటపతి రాయలీమెనుజూచి ద్వితీయయావనమంకురింపరాణిగఁబరిగ్రహించెను. నాఁటినుండి రాణీ బాయమ్మదేవిగారే రాజ్యమేలు కొనుచుండెను. రాయలు ముసలి తనములోఁ దిరిగి వలపు పూవు తూఁగుటుయ్యాలలోఁగమ్మని కలలు గనుచుఁ గాలము గడుపు కొనుచుండెను.

జగ్గరాయలకు నిరువదివేల కాల్బలము కలదు. అతఁడు యుద్ధసమయమున రాయలకు దోడ్పడెను. ఆఱులక్షల బంగరు నాణెములేఁటేఁట నతని బొక్కసము జేరును. తిమ్మానాయకుఁడు పండ్రెండువేల కాల్బలమునకు నధినేత. రాణిగారి యనుగ్రహమునకుఁ బాత్రుఁడయ్యెను. జగ్గరాయలకుమిత్రుఁడు. మాచరాయఁడాఱువేల కాల్బలమున కధిపతి. ఇతఁడును జగ్గరాయలకు మిత్రుఁడే. రాయలవారి చెల్లెలి భర్త యీ కూటమునకుఁ జెందినవాఁడే. ఈ నాయకచతుష్టయము రాణి యండ జూచుకొని రాయల సామ్రాజ్యము నేలుకొను చుండిరి.

శ్రీ వేంకటపతిరాయలవారియన్నగారు కీర్తిశేషుఁడైన రామ రాయలు. రామరాయల పుత్రుడు శ్రీరంగరాయలు పినతండ్రికడ నుండెను. వేంకటపతి రాయలవారికి సంతానము లేదు. రాజవంశమున రాయలవారి యనంతరము సింహాసనమునకు వారసుఁడు శ్రీరంగరాయలు. శ్రీరంగ రాయలనిన శ్రీవేంకటపతి రాయలవారికి మిక్కిలి యభిమానము. శ్రీరంగ రాయలను సామంతులు, దొరలు, కొందఱు చిక్కరాయలని వ్యవహరించుట గూడగలరు. యువరాజునకు రాయల యాస్థానమున చిక్కరాయలని వ్యవహారము.

యాచమనాయకుఁడు చంద్రగిరియాస్థాన రాజకీయము లందు తాటస్థ్యము వహించి తన దారిఁ దాను బోవువాఁడు.

రాయలు చిన్న రాణికివశుఁడై యుండుట, జగ్గరాయలు, తిమ్మానాయఁడు మున్నగువారు రాయలపేరుమీఁదఁ బ్రభుత్వము నెఱపుట సామంతులతోఁ గొందఱకుఁ గిట్టకుండెను. విద్యానగరము పాడువడుట చంద్రగిరికి రాయల యాస్థానమువలన వచ్చుట జరిగిన తర్వాతఁ బ్రజలకెట్టి సన్నివేశమైనను వెఱపు గొలుపుటలేదు. అంతయు "కాలమహిమ" "యీశ్వర చిద్విలాస"మను వేదాంతము ప్రజలలో వ్యాపించినది.

ఒకనాఁడు యాచమనాయకుఁడు తన యింటిముంగలి యందు నిటు నటుఁదిరుగుచుండెను. చాకలివాఁడు బట్టలనుతికి తెచ్చెను. చాకలి,యీసారియాలస్యమైన దేమిబట్టలు తెచ్చుట కని నాయకుఁడు వానినడిగెను. చాకలివాఁడు తన్ను యాచమనాయకుఁడు స్వయముగ నడిగినందుల కుబ్బొంగిపోయి 'చాకలి దానికి నలతగానున్న'దని బదులు చెప్పెను. యాచమనాయకుఁడు 'నలతగానున్నదాలేదా, రేపివ్వవచ్చుననిచెప్పినదా?' యని నవ్వుచు నడిగెను. చాకలివాఁడు, "దొరా! రాయల వారు రాణివారికి లొంగిన లొంగవచ్చునుగాని చాకలివాఁడెవఁడు చాకలిదానికి లొంగఁడు. ఏదైననడ్డు చెప్పిన బట్ట లుతుకుటమాని భార్యనుతకవలసినదే. ఎన్ని సారులు మా చాకలిదాని వీపుమీఁద చాకి రేవు పెట్టినానో! మాచాకలిదాని వీపు చాకి రేవుబండకంటె మొద్దుబారిపోయిన"దని యాచాకలి వాఁడు గర్వముగాఁ బలికెను. యాచమనాయకుఁడు "నీపౌరు షము నాకిదివఱకే తెలిసినది. చాకలిదాని నేమియన"వద్దని నవ్వుచుఁబలికెను. ప్రక్కనున్న యున్నతాసనములపై నాసీ

నులై యున్న దండనాథులు కొందఱు “నాయఁడుగారూ! మీచాకలి మంచి యుద్దండుఁడే యీ చాకలికున్న యాత్మ గౌరవము, రాయల వారికున్నచో రాజ్యమున కీ గతిపట్టి యుండదుగదా” యని యనుచు, “చాకలీ! మీదొరవారికిఁ దగినవాఁడ”వని చాకలి నభినందించిరి. అంత నాచాకలి వాఁడు, “మాదొరవారి యింటి కుక్క పెద్దపులి నెదిరించ గల”దని యేమేమొ చెప్పబోవ యాచమనాయకుఁడాతని వారించి లోనికిఁబొమ్మనెను.

యాచమనాయకుఁడు కొంత సేపు వచ్చినవారితో సంభాషించెను. వారు రాణిగారిచర్యలను నాయనితో నివేదించిరి. రాణిగారికి సంతానము లేదు. రాయలువృద్ధుఁడు. రేపోమాపో రాజ్యము దాయాదుల హస్తగతము కాగలదు. రాణికి నిద్ర పట్టుటలేదు. సంతానమునకై యామె వ్రతములు సల్పినది. నోములు నోచినది. నిత్యము బ్రాహ్మణులకు దానములే ప్రతి దేవాలయమునందును రాణిగారికోరిక యీడేరుటకు పూజలు మంత్రహోమములు జరిగినవి. బ్రాహ్మణు లుపవాసములుండి రాణిగారి కాత్మీయులైరి. ఈ విప్రులలో ముఖ్యుఁడు జగ్గరాయఁడుగారి పురోహితుఁడు విశ్వనాథచయనులు. అతని భార్య రాణీబాయమ్మగారి చిన్ననాఁటి చెలికత్తె. రాణీబాయమ్మ పుత్ర సంతానమునకై విశ్వప్రయత్నము సల్పెను. కాని యామె ప్రయత్నములు సఫలముగాలేదు. ఇట్టి విశేషము లేవేవో ముచ్చటించి యాచమనాయకుని వీడ్కొని వచ్చిన సామంతులు వెడలిపోయిరి.

# ద్వితీయాశ్వాసము

~~~~~

చంద్రగిరికోటలో నాఁడు సత్యనారాయణవ్రతము. రాయలు రాణీబాయమ్మగారు పుత్రసంతానమును నర్థించి, వ్రతమునారంభించిరి. కోటలో మంగళ తూర్యములు సన్నాయి మున్నగు ధ్వనులు మిన్నుముట్టినవి. ఎచ్చటచూచిన బ్రాహ్మణులే. ముత్తైదువులే. రాణిగారు ముత్తైదువులందఱకు చీనిచీనాంబరములు, పసుపు కుంకుమలు బహూకరించిరి. బ్రాహ్మణుల కగ్రహారములు సంభావనలు మృష్టాన్నములు లభించెను. వ్రతము నిర్విఘ్నముగా జరిగెను. సాయంకాలమున రాయలు కొలువుదీర్చెను. దండనాథులు, మంత్రులు, సామంతులు, మహామండలేశ్వరులు వచ్చిరి. రాయలు రత్నఖచిత స్వర్ణ సింహాసనమున నాసీనుఁడయ్యెను. శ్రీరంగ రాయలు పీతాంబర ధారియై పంచకళ్యాణిగుఱ్ఱము నధిరోహించి వచ్చి పితృవ్యుఁ డైన రాయలకునమస్కరించెను. రాయలాతనికౌఁగిలించుకొని తనప్రక్కనున్న స్వర్ణ పీఠికపైఁ గూర్చుండ నియోగించెను. వందిమాగధులు రాయల బిరుదావళులు పఠించిరి. కవులు కవితాస్తులతో నాశీర్వదించిరి. వేశ్యల నృత్యగానాభినయ ములఁ బిమ్మట రాయలు కొలువు చాలించి యంతఃపురము నకుఁ బోయెను.
~~~~~

రాణిబాయమ్మకప్పుడేరాయలు శ్రీరంగరాయలయెడ జూపినయాదరమును జగ్గరాయ లందించెను. రాయ లంతఃపుర మును జేరగనే రాణిచెలికత్తెలువచ్చి బాయమ్మగారి యాగ మనమును నివేదించిరి. రాయలెదురేగి తన యభ్యంతరగృహ మునకు రాణిని స్వయముగా స్వాగతమిచ్చి తీసికొనిపెళ్ళెను. కుశల సంభాషణానంతరము రాణి రాయలతో "కాబోవు రాయల శ్రీరంగ రాయలన్న మాట"యని ప్రశ్నించెను. 'నేఁ బ్రతికి యుండఁగా నీకా ప్రశ్న యెందుల' కని రాయలు సంభాషణ తప్పింపఁజూచెను. కాని రాణి తిరిగి యా ప్రశ్ననే గ్రుచ్చి గ్రుచ్చియడుగ"మనకుఁబుత్రసంతానమున్న యెడలనీ ప్రశ్న యే యుదయించెడిగాదు. నా కేమియుఁ దోచుటలేదు. నీ ప్రశ్న నాకిప్పుడేయేనాఁడో సంప్రాప్తించు మరణశయ్యను దలపించు చున్న"దని చెప్పెను. రాణిమారుచెప్పలేక చివాలునలేచి పెడలిపోయెను. కొంతసేపయిన తరువాత నొకదాసి యేతెంచి రాణిగారు శ్రీరంగయాత్రకు పెడల సంకల్పించెననితన్నావిష యమును రాయలవారికి నివేదింపఁబంపెనని విన్నవించెను. రాయలుగంభీరస్వరముతో "రాణివారియాత్ర నాకసమ్మత" మని దాసితో నిష్కర్షగఁ జెప్పెను.

రాణిబాయమ్మ శ్రీరంగయాత్రకై ప్రయత్నములనది వఱకే ముగించుకొనెను. రాయల నిరాకృతి కామె మిక్కిలి కుమిలిపోయెను. లోకమున నింతకంటె నామె కవమానము

లేదని తలపోసి విశ్వనాథచయనులుగారి భార్యను దీసికొని రమ్మని దాసిని బంపెను. రాణి తన పరివారమునకు శ్రీరంగ యాత్రను విరమించు కొంటినని వార్తనంపెను. రాణి రాయల వారికడ కేగుట కొంతకాలము మానివేసెను.

విశ్వనాథచయనులుగారి భార్య వచ్చినది. ఆమెకు రాణి యెదురేగి స్వాగతమిచ్చి తీసికొనివచ్చి తన యభ్యంతర గృహమునకుఁ దోడ్కొనిపోయి యామెకు పసుపు కుంకుమ రత్నాంబరముల నొసంగి గౌరవించెను. చయనులుగారిభార్య యప్పుడు గర్భవతి. ఆమె రాణితో "నిర్భాగ్యులగుమాబోంట్లకు భగవంతుఁడు సంతాన మనుగ్రహించు"నని చెప్పెను. ఆమెకు గంపెడు పిల్లలు. రాణికి పిల్లలులేరు. రాణి విషాద విహ్వాల యయ్యెను. రాణి నోదార్చుచు నా యిల్లాలొక యుపాయమును నుపదేశించెను. ఆ పన్నాగము పారినచో రాణి యభీప్సిత మీడేరును. నాఁటినుండి రాణి గర్భవతియైనట్లు నటించుట చయనులుగారి భార్య ప్రసవింపఁగనే యాబిడ్డ యంతఃపురమును జేరును. రాణి బాలింతరాలగును. ఆయుక్తి విని రాణి యపరిమితానందమును బొంది ముత్యాలహారమును దీసి యామె కుపహారముగ నొసంగెను. చయనులుగారి భార్య యంతఃపురమును వీడి రాణివారిని వీడ్కొని పోయెను.

రాణిబాయమ్మగారు గర్భవతియైనదను వార్త చంద్రగిరికోటయెల్ల ప్రాకి పోయెను. రాణిగారి యాదేశమును విశ్వ

నాథచయనులు రాయలవారి కీవార్తవినిపించెను. రాయలు సంతోషచిహ్నముగ నా బ్రాహ్మణునకు రత్నాంబరములను గర్పూర తాంబూలమును నొసంగి సత్కరించెను. రాణి గర్భవతి భూమిక నతినిపుణతో నిర్వహింపసాగెను. ఆమె యుదర మభివృద్ధియయ్యెను. అన్నము హితవుదప్పెను. వైద్యులెన్ని మందు లిచ్చినను వేవిళులు తగ్గలేదు. రాణివారికి వికారము హెచ్చినది. దేవాలయముల కంగరంగ భోగములకు మాన్యములు లభించినవి. భగవంతుఁడు రాణిపైఁజూపిన యవ్యాజ కృప ప్రజలకాశ్చర్యము గలిగించినది. ఒకనాఁడాకస్మికముగ నర్ధరాత్రి రాణివారికి సుఖప్రసవమై పుత్రుఁడు కల్గెను. చంద్ర గిరి కోటగోడపై శతఘ్నులు నిద్రాముద్రితులైయున్న పౌరుల మేల్కొలిపి రాజకుమారుని జననము నెఱింగించినవి. మఱునాఁడు రాజపుత్రోత్సవము. ముదుసలి రాయలు కొలువు దీర్చెను. యథాప్రకారము సామంతమంత్రి దండనాథు లందఱు కూడిరి. రాయలందఱకు యథోచితముగ సత్కరించెను. పుత్రోత్సవమున మరణదండనకుఁ బాత్రులైన దోషుల కాశిక్షను రద్దుచేయుచు రాయలు శాసనమును బ్రయో గించెను. నూటయెనుబది దివ్యస్థలముల కంగరంగ భోగములకు స్వర్ణరాసులు, వేద వేదాంగ పారంగతులైన యుత్తమ బ్రాహ్మణుల కగ్రహారములను రాయలు స్వయముగా నొసంగెను. చిక్కరాయలను నామధేయ మా రాజపుత్రున కొసంగెను.

రాణిబాయమ్మ యానందమునకుమేర లేదు. పుత్రజనన మునాఁటినుండి యంతఃపురమున వెల్లివిరిసిన యుత్సాహము వర్ణనాతీతము. ఆ బిడ్డఁడు బంగారు తూఁగుటుయ్యాలలో హంసతూలికా తల్పములలో, రత్నదీపాంకుర ప్రభలలో దిన దిన ప్రవర్ధమాను డగుచుండెను. కాని రాణి బాయమ్మగారి కపటనాటకముచంద్రగిరికోటలో నెల్ల రెఱింగిన దే. ఆ చిదంబర రహస్యమును గాపాడుటకై యంతఃపురమున నిత్యము పేరంటముల ముత్తైదువులనెల్ల రాణి యతిప్రేమతో సత్కరించు చుండెను. రాణీబాయమ్మగా రాపుత్రుని గారాబముగఁ బెంచుకొను చుండెను. పాపాయి నవ్వులకు నువ్వుటుండలు, బంగారునువ్వుటుండలు ముత్తైదువులకుఁ బంచిపెట్టెను. అట్లే బోర్ల పడిన వెండిబొబ్బట్లు, పలుకులకు బంగరు చిలుకలు, గడపదాటిన గారెలు, అడుగుల కపరంజియరెసెలు ముచ్చట్లు మురిపెములే. పుత్రుఁడుదయించిన పిమ్మట రాణిగారి దిన చర్య, జీవితవృత్తము ఇదియే.

రాజపుత్రుని జన్మదినోత్సవము వచ్చినది. ఆనాఁడు బ్రహ్మాండముగ రాణిగారొక యూరేగింపు నేర్పాటుచేయ సంకల్పించెను. మందుగుండు సామానులు, వింత వింత టపాకాయలు, నవ్వాయి చువ్వలు, కోలాటములు, భజనబృందములు, మేళతాళములు, సమస్తవాద్యములు నా యూరే గింపులోఁ బాల్గొనుటకు సంసిద్ధమయ్యెను. రాణీబాయమ్మ

యుత్సాహముతో శ్రీ వేంకటపతి రాయలవారిని గూడ నామహోత్సవము నలంకరింప వేడుకొనెను. కాని రాయలు సమ్మతింపలేదు. రాణి ప్రణయకోపము నభినయించినది రాయలింక రాణికోపాభినయనములకుఁ గరుగుట లేదు. ఇదివరకు రాయల కిట్టియుత్సవములలో పాల్గొనుటకు శక్తిలేకున్నను రక్తియుండెడిది. ఇప్పుడురాయలశక్తియు,రక్తియు నుడిగెను. రాయ లసలట్టి యుత్సవమే తన కసమ్మత మనియు, జన్మదినోత్సవము నంతఃపురమందే జరుపమని యాదేశించెను. రాణి బాయమ్మ రాయలవారి నెంతయో దీనముగఁ బ్రతిమాలి కొనెను. కాని రాయలు శిలావిగ్రహమువలె మౌనముదాల్చి కదలక మెదలక యుండెను. రాణి చిన్న బోయి వెడలిపోయెను. జన్మదినోత్సవ మంతఃపురిలోననే జరిగినది. రాణిబాయమ్మ పలుమారులు కుమారు నూరేగించుటకు విందులకు తీసికొ పోవుట కనుజ్ఞ వేడుకొనెను. కాని రాయలు సమ్మతింపలేదు.

రాణి బాయమ్మ బిడ్డ నతిప్రేమతో నల్లారుముద్దు బెంచుచుండెను. అతనికి పదనాఱవ యేఁడువచ్చినది. శ్రీవేంకటపతిరాయలు మిక్కిలి ముదుసలి యయ్యెను. రాణి తండ్రి యైన జగ్గరాయలు, నతనిసోదరుఁడు చినయోబలరాయఁడు చంద్రగిరియాస్థానమున ప్రాభవమును సంపాదించుకొనిరి. రాజు కొలువుదీర్చినపుడెల్ల సామంతులు దండనాథులు మ్రొక్కు బడి చెల్లించుకొనునట్లు కప్పములఁ జెల్లించుచుండిరి. రాయలు

రాజ్యవ్యవహారముల నంత బట్టించుకొనుట మానుకొనెను. రాయల సన్నిధి కప్పుడప్పుడు చిక్కరాయలు వచ్చుచుండెడివాఁడు. రాయలుచిక్క రాయల మన్నించి పంపుచుండెడివాఁడు. యుక్తవయస్కుఁడైన చిక్కరాయలకు వేంకటపతిరాయల బావమఱదియైన యోబలరాయని పుత్రికనిచ్చి వివాహము సల్పుటకు రాణిబాయమ్మసర్వము సిద్ధముసల్పినది. ఆకన్యక రాయలకు మేనగోడలే గనుక నీ రాజసంబంధము ముడిపెట్టి చిక్కరాయలకు రాణి సింహాసనమును భద్రమొనర్పఁ దల పోసెను. ముసలిరాయలింక నేవ్యవహారములందు జోక్యము కల్పించుకొనుట మానుకొనెను. రాయలవారి దినచర్య భగవ ద్విషయకాలక్షేపములు నిరంతరము పురాణ పారాయణములు, దైవనామ సంకీర్తనములు, ఆస్థానగాయకులు, పండితులు రాయలవారి యభ్యంతర గృహమున నిరంతరము నివసించు చుండిరి. రాణిబాయమ్మ జగ్గరాయల యాధ్వర్యమున చిక్క రాయల వివాహ మతి వైభవముగ జరిగినది. ఆ వివాహమున రాయల యౌదాసీన్యమునన్యథాభావించుటకు వీలుగాకుండెను. రాయల ముసలితనము భగవచ్చింత లౌకిక విషయ విముఖత్వము ప్రజలకందఱకు ప్రస్ఫుటకారణములే. రాణిబాయమ్మ వారిని రాయలవైఖరి యంతగ నొప్పింపలేదు. రాయలు చేయఁగలిగినది లేదు-కాటికి కాళ్ళుచాచిన ముసలిరేని నెవ్వ రును న స్తమించు సూర్యుని దిలకింపనట్లు సరకుగొనుట లేదు.

కొంతకాలమునకు వేంకటపతిరాయలకు జబ్బుచేసినది. రాజవైద్యులు నిత్యము సేవించుచుండిరి. రాణి బాయమ్మ యంతఃపుర పరిచారిక లతనికి మిక్కిలి యుపచరించుచుండిరి. రాయల యనారోగ్యము తీవ్రరూపము దాల్చినది. దవ్వులనుండి సామంతులు దండనాథులు తమ మేలికకు దుదివందనములర్పించు కొనుటకు రాజధానికిఁ దరలి వచ్చిరి. జగ్గరాయలు, తిమ్మానాయకుఁడు సేనాపతి దండనాథులు మున్నగువారు నిత్యము రాయలఁ బరివేష్టించికొల్చుచుండిరి. చిక్కరాయలుగూడ నచటనే యుండెను. కాని రాయలాతని జూచియుఁ జూడనట్లుండెను. యాచమనాయకుఁడు ప్రభువును జూడవచ్చెను. రాయలవారాతని తనపర్యంకమునఁగూర్చుండ బెట్టుకొనెను. యాచమనాయకుఁ డామన్నన కెంతయో సంతోషించి నిత్యము నుదయాస్తమయములందు రాయలసన్నిధి కరుదెంచుచుండెను. శ్రీరంగరాయలు పినతండ్రి యనారోగ్యమునువినియంతఃపురమునుజేరెను. అతఁడు రాయలసాన్నిధ్య మందే నిలిచి పరిచర్య సలుపుచుండెను. ఒకనాఁడు రాజవైద్యులు రాయల యభ్యంతర గృహాంగణమందు వెలవె బోయి నిల్చిరి. అందఱు రాయలస్థితినిగూర్చి ప్రశ్నించిరి. రాయలకు నాడి దిగిపోవుచున్నది. అందఱు రాయల గృహాయందుఁ జేరిరి. రాయలు శ్రీరంగరాయలవైపు దృష్టి విల్పెను. రంగరాయలు పితృవ్యుని పాదసమీపమునఁగ నీమృ

టితో నిలిచెను. రాయలాతనివైపు తనచేతినిసాచెను. అక్కడ నున్నవారందఱు సంభ్రమాశ్చర్య వివశులైరి. రాయలు శ్రీరంగరాయలకుఁ దన చేతియుంగరమును దీసికొన సన్న జేసెను. కాని శ్రీరంగరాయలు వెక్కి వెక్కి యేడ్వసాగెను. అతఁడు కదలలేకపోయెను. రాజముద్రికను బరిగ్రహించుట కాతనికిఁ గాలుసేతులు కదలలేదు. వేంకటపతిరాయలెట్లో మోపికఁదెచ్చుకొని శయ్యపైనుండి లేవఁబోయెను. యాచమ నాయకుఁడు జగ్గరాయలు ముందునకు వచ్చి రాయలకు దోడ్పరి. శ్రీరంగరాయలు రాయలకౌఁగిలిలోఁ జేరెను. వేంకటపతిరాయలు తన యంగుళీయకమును దీసి యాతని వ్రేలికిఁబెట్టెను. తనమెడలోని ముత్యాలహారముల నాతనికంఠ మునవైచెను. చెవిని వ్రేలాడు రత్నకుండలముల దీసి యతని కొసఁగెను. పరిచారకులబిల్చి రాజలాంఛనములను తనరత్నాంబరముల నాతనికివ్వ ననుజ్ఞ నిచ్చెను. ఫణిహారి తెచ్చిన తనఖడ్గ మాతనికిచ్చెను. సామంతులందఱు వినుచుండ మెల్లగ గొంతు విప్పి "పండిపోయిన నాకు మరణభీతిలేదు. కాని మిమ్మందఱ వీడపోవలసివచ్చినదని మాత్రము విచారించుచున్నా" నని రాయలు పలికెను. అందఱు మౌనము వహించిరి. కొందఱు దండనాథులకన్నులనీరు తిరిగెను.

రాయలు మరల మెల్లగ "శ్రీరంగరాయలిక మీకు మహారాజు. రాజవంశ మర్యాదను దేశగౌరవమును నిల్పుడు. నాతుదిసందేశమిదే" యనెను.

దండనాథులు సామంతులు లేచి నిల్చి వేంకటపతి రాయలకు శ్రీరంగరాయలకు ప్రణామములాచరించిరి. వంది మాగధులు శ్రీరంగరాయలను మహారాజుగ రాయలబిరుదా వళులతోఁ బఠించి ప్రకటించిరి. జగ్గరాయలు తిమ్మనాయ కుఁడు నొకరి మొగములు నొకరు సాభిప్రాయముగఁ దిలికించు కొనిరి. ఓబలరాయఁడువంచినశిరస్సునెత్తలేదు. చిక్కరాయలు మెల్లమెల్ల దండనాథుల వెనుకకుఁబోయి తలదాచుకొనెను. సామంతులు చిట్టచివరకు శ్రీవేంకటపతిరాయలు ప్రదర్శించిన స్థైర్యమునకు చాకచాక్యమునకు నాశ్చర్యచకితులగుచుండిరి. వేంకటపతిరాయల కాయాస మెక్కువయ్యెను. రాయలు “తండ్రీ! శ్రీరంగా ? యని శ్రీరంగరాయల చేతినిఁబట్టి యాచమనాయకుని వైపునకుఁదిరిగెను. యాచమనాయకుఁడు రాయలఁజేరి వంగి నమస్కరించెను. రాయ లాతని చేతిని స్పృశించి యేమియో చెప్పబోయెనుగాని చెప్పలేకపోయెను. కాని రాయలహృదయము యాచమనాయకునకు నచ్చటి వారలకందఱునకును సువ్యక్తమయ్యెను. రాయలు తిరిగి శ్రీరంగ రాయలువైపునకుఁదిరిగెను. ‘శ్రీరంగ రంగా’యనుచు రాయలు కనులుమూసెను. ఆ కనులు తిరిగి విడివడ లేదు.

చంద్రగిరికోట దుఃఖమగ్నమయ్యెను. అంతఃపురో ద్యానవనమునఁ బెద్ద చితిపేర్చిరి. అమాత్యులు దండనా

ధులు సామంతులు పురోహితులు రాజబంధువులు పౌరు లెల్ల నచట గుమిగూడియుండిరి. రాజమర్యాదలతో మంత్ర ఘోషతో రాయల కళేబరమును చితికెక్కించిరి. పన్నీరు, కస్తూరి, పునుగు, జవ్వాజి, చందనదారువుల చితిపైనుంచిరి. అగరుధూప సుగంధిలమైన జ్వాలలు రగుల్కొనుచుండ బ్రాహ్మణులు నివాపమంత్రముల బఠించుచుండిరి. వేంకటపతి రాయలకుఁ దుదివందన ఘోషములను శతఘ్నులు మ్రోసినవి. అంతఃపురమునుండి పరిచారికాగణముతో రాయలపట్ట మహిషులు, భార్యలు బయల్వెడలిరి. వారు మిక్కిలి దుఃఖించుచు దీనభయానక బీభత్సమూర్తులై వచ్చుచుండిరి. వారివెంట మంత్రోచ్చాటన సల్పుచున్న బ్రాహ్మణులు, మిన్నంటు వాద్యఘోషముల నెలుగెత్తి విలపించుచున్న బంధుస్త్రీలు దాసదాసీజనము క్రిక్కిరిసియుండిరి. రాయల భార్యలు సుమారు రెండువందలమంది చితికి ప్రదక్షిణము గావించిరి. బ్రాహ్మణులకు దక్షిణలిచ్చిరి. తమ యాభరణముల నాప్తుల కొసంగిరి. రాణిబాయమ్మ జగ్గరాయలకడ కేగి పాదప్రణామమును గావించెను. జగ్గరాయలు పుత్రికను కౌఁగిలించుకొని విలపించెను. రాణి చిక్కరాయలను కౌఁగిలించుకొని తన యాభరణముల నొసంగెను. చిక్కరాయలు కన్నీటితో బాయమ్మ పాదములకు వంగి నమస్కరించెను. ఆమెయాతని నోదార్చి పోయి మృతభర్తపాదములకు నమస్కరించెను.

ఆమె, తక్కిన రాణులు శిరోజములను విప్పుకొని తైలాభిషేక మొనర్చుకొనిరి. వారి చేలాంచలముల నుండి శిరోజములనుండి తైలము స్రవించుచుండెను. భేరిపటహ కాహళ తూర్యరావములు మిన్నంటినవి. అందఱు రాణులును చితికిఁబ్రదక్షిణ మొనరించి తైలసిక్తాంబరములతోఁ జితిపైదూఁకి యా యగ్ని జ్వాలలో నాత్మాహుతి గావించుకొనుచుండిరి. బ్రాహ్మణులు పాతి వ్రత్య మాహాత్మ్యము నుగ్గడించు శ్లోకములఁ బఠించుచుండిరి. సహగమన మొనరించు పతివ్రతలకు వివృతద్వారములతో స్వర్గలోకమెట్లు స్వాగతమిచ్చునో తెల్పు గేయములనుగాయ కులు పాడుచుండిరి. భేరీనినాదము తూర్యకాహళనినాదములు దిక్కుల మారుమ్రోగినవి. కోమల మనస్కుల కొందఱా దృశ్యమును జూడజాలక మూర్ఛపోయిరి. పతితోఁజితిమీఁద ప్రాణముల నాహుతులు వ్రేల్చెడి పతివ్రతామతల్లులఁ గన్న భరతవర్షమును గొందఱు స్తుతించుకొనిరి. అచ్చటఁ జేరిన వారు క్రమక్రమముగఁ దమ నెలవులకుఁ బోసాగిరి. మలిసంజ చీకటులు చంద్రగిరికోట నావరించెను. అందఱునుతోటనుండి నిష్క్రమించిరి. చిమ్మచీకట్లలోఁ వెలుగుచున్న యాచితి వెలుతురా రేయెల్ల దిక్కులలోఁ బ్రతిఫలించుచుండెను.

# తృతీయాశ్వాసము.

~~~~~

శ్రీరంగరాయలు సింహాసన మధిష్ఠించెను. రాణి బాయమ్మ కుహనాపుత్రుఁడు రాజ ప్రాసాదమును వీడి జగ్గరాయల గృహమును జేరుకొనెను. సామంతులు, దండనాథులు, మహామండలేశ్వరులు మున్నగు వారందఱు పట్టాభిషేక మహోత్సవమున కేతెంచిరి. రంగరాయ లందఱ యథోచిత ముగ మన్నించెను. కొందఱు దండనాథులు రంగరాయల యేలుబడికి సమ్మతింపక చంద్రగిరికోట విడిచిపెట్టి వెడలి పోయిరి. క్రమక్రమముగ రాజోద్యోగులు ప్రజలు మన్నీఁడులు రంగరాయల కడ కేతెంచి రాజభక్తి విశ్వాసములఁ బ్రకటించి పోవుచుండిరి.

శ్రీరంగరాయలు కొలువుదీర్చ సామంతుల రాజోద్యోగుల నందఱ నాహ్వానించెను. ఆ నాఁడందఱు కొలువు కూటమునకు వచ్చి ప్రభువున కంజలు లర్పించి కప్పముల నుడు గరలను సమర్పించిరి. కాని యోబలరాయఁడు, జగ్గరాయలు, తిమ్మనాయకుఁడు, మాచరాయఁడు కొలువునకు రాలేదు. వారలకు శ్రీరంగరాయలు సింహాసన మధిష్ఠించుట గిట్టదు. బాయమ్మ పుత్రుని రాయల నొనర్ప నాయకచతుష్టయము సంకల్పించుకొని కాళహస్తీశ్వరుని సాన్నిధ్యమున శపథము చేసికొనిరి.
~~~~~

ఇంతలో వారికొక క్రొత్తయవకాశము లభించెను. శ్రీరంగరాయలసేనాపతితోఁ బ్రధానితో నారపరాయలతో విరోధము తెచ్చుకొనెను. సేనాపతి యధీనమందున్న రెండు దుర్గములను రాయలు తనపుత్రుల కిచ్చుట కుద్యమించెను. ప్రధాని వేంకటపతిరాయలవారి బొక్కసమునుండి లక్ష బంగరునాణెము లపహరించెననియు, వానిని సమర్పింపు మనియు, నిర్బంధించెను. నారపరాయలు చెల్లెలు వేంకటపతి రాయల భార్య, ఆమె సోదరుఁడైన నారపరాయలకమూల్యా భరణములను రత్నరాసుల నొసంగెను. ఆధనమును శ్రీరంగ రాయలు తిరిగి బొక్కసమునకుఁ జేర్చుమనియాజ్ఞాపించెను. ఆముువ్వురు రాజాజ్ఞలను బరిపాలింప మూఁడుదినములువ్యవధి కోరుకొనిరి. రాయలు సమ్మతించెను. కాని వీరిముువ్వురు జగ్గరాయలతోఁ జేరి కుట్రపన్న సాగిరి. ఎట్లయిన శ్రీరంగ రాయలను గూలద్రోసి బాయమ్మ పుత్త్రుఁడైన చిక్కరాయల సింహాసనమున నిలుప సంకల్పించిరి.

జగ్గరాయలు, మాచరాయఁడు, తిమ్మానాయఁడు శ్రీరంగ రాయలకుఁ దాము రాయలకు యథాపూర్వము కప్పముచెల్లించి రాజభక్తితో గొలుచుటకు సిద్ధముగానున్నట్లు వర్తమాన మంపించిరి. రంగరాయలుసంతోషించి వారి నాహ్వానించెను. జగ్గరాయలు కోటవెలుపలఁ దనసేనలనిల్పి, నిగ్గుదేలిన యైదు వేల కాల్బలముతోఁ గోటఁబ్రవేశించెను. చంద్రగిరికోటకు

రెండు ప్రాకారములు గలవు. రెండు ప్రాకారములయొద్ద రెండు వేలభటులను నిల్పెను. అట్లే తిమ్మనాయఁడు, మాచరాయఁ డును గోటఁ బ్రవేశించిరి. సేనాపతి పశ్చిమభాగమునను న్న రెండు బురుజుల నాక్రమించెను. ఇంతలోఁ బెద్దగందర గోళము హాహారవములు రేగుటచే 'మోసము' నెఱిఁగి రాయలుదుర్గ ద్వారముల బంధింప నాజ్ఞాపించెను. కాని మాచరాయఁడు ద్వారముల భేదించి రాజప్రాసాదమును ముట్టడించెను. శ్రీరంగ రాయలునిస్సహాయుఁడై నిలిచిపోయెను. రంగరాయలు రాజ ప్రాసాదమునందే బందీకృతుఁడైపోయెను. మాచరాయఁడు రాజప్రాసాదమును జేరుకొనెను. రంగరాయలకు మాచరాయ నికి జరిగిన సంభాషణమును భటులందఱు ఆలకించుచుండిరి.

రంగరాయఁడు:-మాచరాయా! నీకు రాజద్రోహముతగునా!

మాచరాయఁడు:—రాజద్రోహమేమున్నది? శ్రీ వేంకటపతి రాయలపుత్రుఁడుండ వేఱొకరు రాయలెట్లు కాగలరు ?

రంగ:—మాచరాయా! ఇది నీ వంతశ్శుద్ధిగ ననెడిమాటలా? శ్రీ వేంకటపతి రాయలవారే స్వయముగ నాకు సింహాసన మర్పింపలేదా? నేను గోరుకోలేదుకదా! నీవు వీరుఁడవు. ఇది క్షాత్రధర్మముగాదు.

మాచ:—రాజనీతిసూక్ష్మములు బహుభంగులు—మీ ప్రాణ హాని మాసంకల్పముగాదు. వేంకటపతి రాయల పుత్రుఁడైన చిక్కరాయలు సింహాసన మధిష్ఠిం-

చును. దీనికి మీరు సమ్మతించిన మీ ప్రాణమునకు మీకుటుంబ రక్షణకు నా యభయహస్త మిదే!

శ్రీరంగరాయలు చేయునదిలేక మాచరాయని నిర్దేశ మున కొడఁబడెను. శ్రీరంగరాయల భార్య, పుత్రులు, పుత్రి కలు నాంతరంగిక పరివారముతో నచ్చటికి వచ్చిరి. రాజ ప్రాసాదమంతయునిశ్శబ్దముగనుండెను. వందిమాగధులు మెల్లగ జారిపోయిరి. పరిచారకులు, ఫణిహారులు, వేత్రహస్తులు, నంగ రక్షకులు తెల్లబోయి ప్రక్కకొదిగి నిలుచుండిరి. మాచరా యని సైనికులెల్లరు బారులుతీర్చి నిల్చియుండిరి. ఆ భటుల మధ్యనుండి మాచరాయని వెంట శ్రీరంగరాయలు తలవంచి సకుటుంబముగ మందమందముగఁదరలిపోవుచుండెను. భటులు రాయలకుఁగైవారములు సలుపలేదు. రాయలు తలఁ ద్రిప్పి యైన నెవ్వరిఁబరికింపలేదు. మాచరాయఁడు శ్రీరంగరాయలను సకుటుంబముగ నొక ప్రాసాదమునఁ బంధించి భటులను గాపుంచి మరలిపోయెను.

జగ్గరాయలు తిమ్మానాయఁడు సేనాపతినారపరాయఁడు రాయల ప్రాసాదమును జేరి మాచరాయని రాకకు నిరీక్షించు చుండిరి. మాచరాయఁడు కనిపింపఁగనే ప్రత్యుత్థానము సలిపి యతని నభినందించిరి. మాచరాయఁడు దోషివలె చిన్నబోయి ఖిన్నుఁడైయుండెను. అతఁడు లేనినవ్వును దెచ్చుకొనెను. శ్మశానమున విరిసిన వెన్నెలవలె నాసవ్వుమాచరాయనిముఖ

మున బీభత్సరేఖల నింపెను. జగ్గరాయలు మాచరాయని సంభాషణమునకు దింపెను.

జగ్గరాయలు :—మాచరాయా! మునుముందు రాజప్రాసాద మును నీవే జేరఁగలిగితివి. విజయలక్ష్మి ప్రప్రథమ మున నిన్ను వరించినది.

సేనాపతి :—మాచ రాయల చాకచక్యము వేంకటపతిరాయలే గుర్తింపఁగలిగెను.

తిమ్మనాయకుఁడు :—మాచరాయా! నీవు గనుక శ్రీరంగ రాయల యెదుట నిలువఁ గలిగితివి.

మాచరాయఁడు:—ఏమో? నేను నిజముగా శ్రీరంగరాయల యెదుట నిలువలేకపోయినాను.

జగ్గరాయఁడు :—అదేమి ?

మాచ :—ఏమున్నది? శ్రీరంగరాయ లానాఁడు 'వేంకటపతి రాయలవా రవ్యాజముగ నన్ను యువరాజుగ నియ మించినప్పుడు నీవులేవా?' యని సూటిగ ప్రశ్నిం చెను. అతని పెదవులడుగలేని ప్రశ్నలతని వాడి కన్నులు నన్నుగ్రుచ్చి గ్రుచ్చి యడిగినవి.

జగ్గరాయఁడు :-మాచరాయా ! నీవు వీరుఁడవు మాత్రమే కాదు. కృష్ణరాయలవలెఁ గవివిగూడ.

మాచ:—కాదు! జగ్గరాయా! ఆ శకము ముగిసినది. వేంకట పతి రాయలవారిపేరు నాకు పెట్టెత్తించినది.

చల్లని వేళ దలఁచుకోవలెను. శ్రీవారి కృపయేగదా నన్నింతవాని నొనర్చినది.

జగ్గ:—బాగున్నది. ఆ రంగరాయల విషయము నాకు వదలి పెట్టుము. నేను జూచుకొనెదను.

మాచ:—సరే! కాని యొకవిషయము. శ్రీవేంకటపతి రాయ లవా రవ్యాజముగ నంగుళీయకమును శ్రీరంగ రాయల వ్రేలికి దొడగిన దృశ్యమిప్పటికి నాకన్నుల గట్టుచున్నది. అప్పుడు వెనుకాడిన శ్రీరంగరాయలను శ్రీవేంకటపతిరాయల సన్నిధి నుంచినది నేనే! ఎట్లయిన శ్రీరంగరాయల ప్రాణ ములఁ గాపాడ నభయమిచ్చినాను. అతఁడు చిక్కరాయల ప్రభుత్వమునకు సమ్మతించెను.

జగ్గ:—మాచరాయా! నీదెంత మెత్తని గుండెయోయి ! మాకుఁగూడ శ్రీరంగరాయలపై ప్రత్యేక ద్వేష మేమిలేదు. శ్రీరంగరాయలశిరోజమునైన స్పృశింపను. అతఁడు కేవలము మనకెదురుదారి పట్టెను. అందుచే నింతజరుగవలసి వచ్చినది.

మాచ :—ఏదైన శ్రీరంగరాయలకుటుంబమును నీ కప్పగించు చున్నాను.నీయిచ్చవచ్చినట్లుచూడుము.నామాట మఱువకుము. అతనికి ప్రాణభంగము కలుగకుండ నభయమిచ్చినాను.

జగ్గ:—మాచరాయా! ఖడ్గసాక్షిగానిదిగో ప్రమాణముస్వీకరించుచున్నాను. శ్రీరంగరాయల కేహాని రానివ్వక కాపాడెదను.

మాచరాయఁడు సంతోషించెను. సేనాపతి శ్రీరంగ రాయలు బందీకృతుఁడు. 'ఈజీవచ్ఛవమేమి చేయగల'దని నారపరాయలతోననెను. "నిజమే-ఒక్కొక్కప్పుడు మనుష్యు లకు మరణించిన తర్వాత ప్రభావమధికమగును. శ్రీరంగ రాయలు మృతజీవి యగుటకంటె జీవత్సమాధి చెందుటయే మంచి" దని నారపరాయఁడు పల్కెను.

అందఱు నవ్వుకొనిరి.

—

# చతుర్థాశ్వాసము

~~~~~

చంద్రగిరి కోటలో జగ్గరాయలు చిక్కరాయలకుఁ బట్టాభిషేకము సల్పెను. సేనాపతి తిమ్మనాయఁడు దండ నాథులను సామంతులను దమపక్షమునకుఁ ద్రిప్పుకొనిరి. వందిమాగధులు, చిక్కరాయల బిరుదావళుల నుగ్గడించిరి. మన్నీఁడులు నాయకులు క్రొత్తరాయలకుఁ గప్పము చెల్లించి యుడుగరలర్పించిరి. కోటలో నంతఃపురములో స్థితిగతులు యథాపూర్వము మారిపోయినవి. సూర్యుఁడెప్పటివలె నుదయించి యస్తమించుచుండెను. అందఱు తమతమ పనులలో నిమగ్నులగుచుండిరి.

కాని యీవింతవిప్లవము కొందఱు ప్రజలలో స్వామి భక్తిగల రాజసేవకులలోఁ గల్లోలము రేపినది. పురప్రముఖులు లేవేవో సాకులు చెప్పి చిక్కరాయల కొలువుకూటమునకు వెళ్ళలేదు. అంతవఱకు కొలువులకు రానివారిలో దళవాయి యాచమనాయకుఁ డగ్రగణ్యుడు. జగ్గరాయలీ విషయము గూర్చి మాచరాయనితో సేనాపతి ప్రభృతులతో ముచ్చ టించెను. వారు విశ్వనాథచయనులను యాచమనాయకుని యొద్దకు రాయబారిగఁ బంపిరి.

యాచమనాయకుఁడు గృహారామమునం దాసీనుఁడై యుండెను. పౌరులు, దండనాథులు, భటులు కొందఱా
~~~~~

బరి వేష్టించియుండిరి. చుట్టునున్న వారలు విప్లవమునుగూర్చి శ్రీరంగరాయలనుగూర్చి ముచ్చటించుచుండిరి. విశ్వనాథ చయనులు వచ్చినట్లు భటు డొకఁడు యాచమనాయకునకు విన్నవించెను. యాచమనాయకుని యాజ్ఞచొప్పున విశ్వనాథ చయనుల భటుఁడు తీసికొనివచ్చెను. యాచమనాయకుఁడు చయనులకాసనమిచ్చి గౌరవించెను. చయనులొకశ్లోకముతో నాతని నాశీర్వదించెను. 'ఊరకరారు మహాత్ములు - తమ రాకకుఁ గారణమేమి? విశేషములేమైనఁ గలవా' యని యాచమనాయకుఁడు ప్రశ్నించెను. "తమతో నాంతరంగిక విషయములువిన్న విం పవలసియున్న"దనిచయనులునుడివెను.

"వీరందఱు మాయాప్తపరివారము. మీరు శంకవీడి చెప్పఁదలచినది చెప్పవచ్చు"నని నాయఁడుపల్కెను. వారి సంభాషణంతయు నచ్చటివారుగూడ వినుచుండిరి.

విశ్వా:—తాము కొలువునకు వచ్చుటలేదు. శ్రీజగ్గరాయలు చాల నొచ్చుకొనుచున్నారు.

యాచ:—కొలువెచ్చటరాయలే లేనప్పుడు? అడుగుటకుజగ్గ రాయఁడెవఁడు ?

యాచమనాయకునికన్ను లెఱ్ఱవడెను. కంఠము కంపించినది. చయనులు మారుపలుకలేదు.

యాచ:—అయ్యా! నేను జగ్గరాయల కడుగులకు మడుగు లొగ్గుటకై భూమిమీఁదఁ బుట్టలేదు-మీ రెచ్చట నుండి వచ్చిరి ?

విశ్వా:—శ్రీ చిక్కరాయల ప్రభువులవారు నన్నుఁ దమకడ కంపిరి.

యాచ:—ఎవరా చిక్కరాయలు? ఎవరి కాతఁడు ప్రభువు? చిక్కరాయల తండ్రి యెవరో; తల్లి యెవరో? ఎవరి కెఱుక?

విశ్వా:—ఆగ్రహింపకుఁడు. జగ్గరాయలు తిమ్మనాయఁడు రాయలవారు తమతో మైత్రి నెరపుటకు సిద్ధముగా నున్నారు. ఒక్కసారి తామచ్చటికి వచ్చెదరు లేదా జగ్గరాయలఁ దమయొద్దరు రమ్మనెదరు కనుగొన నన్ను నియోగించినారు. మీ మీఁద నెంతయో యాశ పెట్టుకొనియున్నారు.

యాచ:—ఈతోలుబొమ్మలాటలోదరువుపాడుటకుయాచనాయకుఁడెన్నఁడు సమ్మతింపఁడు. శ్రీవేంకటపతి రాయలవారి మరణశయ్య! రాయలు తుదిన నాదక్షిణహస్తమును స్పృశించిరి. రాజనేత్రములు చెప్పిన సందేశము నాహృదయములో నేటికి ఫలించుచున్నది. నేను కోటలోనికి రాఁజాలను. జగ్గరాయలకునన్నుఁ గలుసుకోవలెననియున్నది బాగున్నది! అయిన యుద్ధభూమిలోఁ గలిసికొనెదమని చెప్పుడు. యాచమనాయకుని యుద్ధమున

జంపి జగ్గరాయలుగాని మఱి యేదాసీపుత్రుఁడైనను రాయల రాజ్యము నేలుకొన వచ్చును. యాచమనాయకుని బొందెలోఁ బ్రాణములున్నంత వరకు శ్రీరంగరాయలవారే ప్రభువు !

యాచమనాయకుఁడు తుదివాక్యము పలికి చివాలున లేచి యింటిలోనికిఁ బోయెను. విశ్వనాథచయనులు కొంత తడవట నడయాడి మరలిపోయెను.

జగ్గరాయలు యాచమనాయకుని వైఖరి విని మిక్కిలి కలఁత జెందెను. యాచమనాయకుఁడన్న రాయలరాజ్యమునఁ బ్రజలలో విశేషగౌరవము. అంతమాత్రమేగాదు. ఆతఁడు శతాధిక యుద్ధయోధుఁడు. అతనికి నిరువదివేల కాల్బలము కలదు. కొందఱు భటులు దండనాథులపుడే యతని పక్షమును జేరియుండిరి. యాచమనాయకుని దమపక్షమునకుఁ ద్రిప్పు కొనుటకు జగ్గరాయ లనేకవిధములఁ బ్రయత్నించి విఫలుఁ డయ్యెను. యాచముఁడట్లు మొండిపట్టుదలఁ బట్టుటకుఁ గారణము జగ్గరాయలకుఁ దోచలేదు. బింకము వహించి తా మధర్మమున కొడిగట్టమని విఱ్ఱవీగిన మన్నీఁడులకు రత్న రాసులఁ బంపి లోబరచుకొనెను. శ్రీరంగరాయల యాంత రంగిక మిత్రులే నేఁడు జగ్గరాయని కనుచరులు.

ఒకనాఁడు జగ్గరాయలు తిమ్మనాయకుఁడు సేనాపతి పెద్దకొలువు నేర్పాటుచేసిరి. చిక్కరాయలు మాచరాయని

తిమ్మానాయని మహామండలేశ్వరులుగఁ జేసెను. మాచరాయని సేనాపతులకు సువర్ణరాసులు కానుకలుగా నిచ్చెను. సేనాపతికిఁ దిరిగి రెండు దుర్గముల నిచ్చెను. విప్లవములోఁ బాల్గొనిన సేనానులకు జాగీర్లనొసఁగెను. ఎవరేదికోరుకొనిన వారికది లభించుచుండెను. అట్టిచోఁ గొందఱు వ్యర్థముగ యాచమనాయని సేనలోఁ జేరుచుండుట జగ్గరాయల కర్థము కాలేదు.

యాచమనాయకుఁడు చంద్రగిరికోటను వీడి నాలుగు యోజనములలోనున్న యొక కుగ్రామమున నివాసమేర్పరచు కొనెను. అక్కడ సేనలు విడిసినవి. యాచమనాయకుని చేరి సేనాను లచ్చటికి వచ్చుచుఁ బోవుచుండిరి. చంద్రగిరినుండి యాచమనాయకుని పరిచారకవర్గమంతయు నా కుగ్రామమునకు తరలిపోయిరి. ఉతికిన బట్టలు తీసుకొనిచాకలివాఁడు యాచమ నాయకుని గ్రామమును జేరుకొనెను. యాచమనాయకుఁడు బట్టలు తెచ్చిన చాకలివానిఁజూచి "చాకలీ! నీవుగూడమాపక్షమేగదా!" యని నవ్వుచుఁబ్రశ్నించెను. చుట్టునున్న సేనానులలోఁ గొందఱు, "మీచాకలి విడిచిపెట్టలేదే"యని పలికిరి.

ఆ చాకలి నదరుబోతు. అమృతతుల్యమైనకల్లు ప్రత్యేకముగఁ జాకలి కులమునకై పుట్టింపఁబడినదని యతని విశ్వాసము. త్రికరణశుద్ధిగఁ దన నమ్మకము చొప్పున నతఁడాచరించుచుండెను. అందుచే నొడలుమరచి ప్రేలుచు నుండెడి

వాఁడు. చాలకాలమునుండి మద్యమును సేవించువాఁడగుటచే పిన్నపెద్దలని యెంచక మాటలాడుట కలవాటుపడెను. చాకలివాఁడు యాచమనాయకుని మిక్కిలిపొగడెను. యాచమనాయకుని యొక్క చాకలికున్న పౌరుషము చిక్కరాయలకు గూడ లేదని యేదేదో ప్రేలసాగెను. అచ్చట సేనానులందఱు చాలసేపాచాకలివాని మాటలచే వినోదించిరి. రాణి బాయమ్మగారివలననే యీవిపత్తుమూడినదనియు, వేంకటపతి రాయలవా రాడుదానిమాట విని రాజ్యము నీగతికిఁ దెచ్చె నని యాతని సిద్ధాంతము. ఆచాకలి 'యాచమనాయకునితో బదునారేండ్లకుఁ బూర్వమే యీవిషయమును హెచ్చరించితి' నని తన ప్రజ్ఞ చాటుకొనెను. అచ్చటి భటులు సేనానులు నవ్విరి. యాచమనాయకుడు 'నిజము - ముమ్మాటికి నిజ' మని యొప్పుకొనెను. చాకలివాఁ డుప్పొంగి కేరింతలు గొట్టుచు లోనికిఁ బోయెను. అచ్చటివారిని వీడ్కొలిపి యాచమనాయకుఁడుగూడ లోనికిఁబోయెను.

శ్రీరంగరాయలను చంద్రగిరికి సమీపమున నున్న యొక దుర్గములో బంధించిరి. దుర్గముచుట్టు సాయుధభటులు కాపుం డిరి. శ్రీరంగరాయలకుఁ గావలసిన సౌకర్యములన్నియు నిచ్చిరి. రాయల బంధువు లప్పుడప్పు డాతని సందర్శించు చుండిరి. శ్రీరంగరాయలు యాచనాయకునిధర్మపరత్వమును విని యానందపరశుఁ డయ్యెను. ఆశ్చర్యపులకితుఁడయ్యెను.

దుర్గమందు బందీకృతుఁడైన రాయలకు లోకమంతయు మోసముగనె గనుపట్టుచుండెను. యాచమనాయకుని త్యాగనిరతి యతనిఁ జేరుచున్న సేనానుల మనోభావములు శ్రీరంగ రాయల కర్థమగుటలేదు. యాచమనాయకునిహృదయమును గూర్చి యాలోచించినను నర్థముగాని రెండవవ్యక్తి శ్రీరంగ రాయలు. మొదటివ్యక్తి జగ్గరాయలు.

జగ్గరాయలుతిమ్మనాయఁడు సేనాపతిమాచరాయడు యాచమనాయకు నెట్లయినఁ దమవైపునకుఁ ద్రిప్పుట కుపాయము నాలోచించుటకుఁ గూడిరి. యాచమనాయకునికిఁ దగి నంత సైన్యములేదు. కాని యతఁడు యుద్ధమునకు సర్వసం సిద్ధుఁడు. జగ్గరాయాదుల కెంతయో సేనగలదు. కాని వారు యుద్ధమునకు సిద్ధము కాలేకుండిరి. యాచమనాయకుని ధైర్యమునకర్థమేమి? అసలాతఁడు యుద్ధమును గోరనేల? పదవి కాంక్షించుచున్నాఁడా? దానిని జగ్గరాయాదులే యేయుద్ధము నొనర్పకుండ నిచ్చుటకు సిద్ధముగ నున్నారుగదా! ఇక శ్రీరంగ రాయలయెడ భక్తి! రంగరాయలను సకుటుంబముగ గౌరవముగ నే జూచుచున్నారుగదా! అంతకంటె నిరువదియేల సైన్యముతో యాచమనాయకుఁడు సాధింపఁ దలపోసెడి దేమి? ఇట్టి ప్రశ్నల నామిత్రబృందము చర్చించిరి. చివరకు మాచ రాయలు స్వయముగా యాచముని గలిసికొనుట కుద్య మించెను.

యాచమనాయకుని గ్రామమునకు మాచరాయఁడశ్వా రూఢుఁడై యొంటరిగాఁ బోయెను. యాచమనాయకుఁడాతని సగౌరవముగ నెదుర్కొని మన్నించెను. మాచరాయనితోఁ దాను పదవిఁగాంక్షించుట లేదని రాజవంశమర్యాద, ధర్మరక్ష ణమే తన దీక్షాలక్ష్యమనియుఁ దెల్పెను. వేంకటపతిరాయల యుప్పు దిని శ్రీరంగరాయలను మాచరాయలు గుండెలేని జగ్గ రాయల కొప్పగించినందుల కాతని నిందించెను. మాచరాయఁడు శ్రీరంగరాయల ప్రాణసంరక్షణమున కభయమిచ్చితి నని యాచమనాయకునితో జెప్పెను. శ్రీవేంకటపతిరాయల మాటవిన్నప్పుడు మాచరాయని కన్నులు చెమ్మగిల్లెను. యాచమనాయకుఁ డా యభయప్రదానము కాతని నభి నందించెనును. మాచరాయఁడు శ్రీరంగరాయలు తన కొనరించిన యన్యాయమును వివరించెను. కానీ యాచముఁడది రాజద్రోహమునకుఁ దగిన కారణమని యొప్పుకొనలేదు. మాచరాయఁడు యాచమనాయకునితో నల్పసైన్యముతోఁ దమ్మెదిరించి యోడి పోవుటవలనఁ బ్రయోజనము లేదని గద్దించి పల్కెను. యాచమనాయకుఁడు గంభీరస్వరముతో "జయాపజయములతో నాకునిమిత్తములేదు. శ్రీరంగరాయలే చంద్రగిరి ప్రభువు! నాకు సేనలు తగినన్ని లేవు నిజమే ! కాని మీ సేనలు గెలువఁగలవా? గెలిచినయధర్మమునెగ్గును. అట్లైన్నటికి గాఁజాలదు. "యతోధర్మ స్తతో జయః" అని

ముమ్మారు చిమీలితలోచనుఁడై యుచ్చరించెను. యాచమ నాయకుఁడు కనులు విప్పుసరికి మాచరాయఁడచ్చట లేడు.

శ్రీరంగరాయలు దుర్గప్రాసాదమునఁ బందీకృతుఁడై కాలము గడుపుచుండెను. సూర్యోదయమునుండి సూర్యాస్త మయమువరకు నతనికి నుబుసుపోక దినములు యుగములుగా వెళ్ళఁబుచ్చుచుండెను. ఆతనికి మంగలి, తోటమాలి, చాకలి మిత్రులగుచుండిరి. ఒకనాఁటి సాయంకాలము చాకలివాఁ డుతికిన వస్త్రములను దెచ్చెను. శ్రీరంగరాయ లతని బరికించి క్రొత్తచాకలిని 'నీపెర'వని యడిగెను. చాకలి నడుముకట్టు నుండి యొకయుత్తరమును దీసి శ్రీరంగరాయలకొసఁగెను. రాయలా లేఖను బఠింపసాగెను.

శ్రీ శ్రీ శ్రీ మహారాజ రాజపరమేశ్వర వీరప్రతాప మూరురాయరగండ శ్రీరంగరాయల మహారాజులుంగారి పాదసముఖమునకు-భృత్యుఁడు యాచమ నాయకుఁడు ప్రణామము లర్పించి చేసుకొను విన్నపములు.

విధివిలాసము విచిత్రము. రాయలకుటుంబమునకు దాపురించిన విపత్తునకు విషాదముజెందనివారు లేరు. పురుష కారమున విజయము సాధింప నిశ్చయించుకొంటిమి. ఈ చాకలి విశ్వాసపాత్రుఁడు. నామాట నమ్మవలెనని మిక్కిలి ప్రార్థించుచున్నాను. రాజపుత్రులలో నెవ్వరినైన నితనివెంట నంపుడు. ఈ మాయింటిచాకలిబహునిపుణుఁడు. రాజపుత్రుని

నాకందింపఁగలఁడు. రాజపుత్రుఁడు నన్నుఁజేరిన రాజ్యమూఁగి పోవును. మన్నింపప్రార్థన.

త్వరలో తమ విముక్తినిగూడ సాధింప గలమని విశ్వాసము.

విధేయుఁడు

యాచమనాయకుడు

శ్రీరంగరాయలు లేఖను రెండుమారులు పఠించెను. చాకలివానిని సూటిగఁ గొంతసేపు పరికించెను. రాయలు ముగ్గురుపుత్రులనుబిలిచి చాకలికిజూపెను. పెద్దకుమారునకు బదుసెనిమిదివత్సరములు. రెండవకుమారునకు బంద్రెండేండ్లు. మూఁడవవానికి బదియేండ్లు. రాయలు చాకలితో "సెవరిని దీసికొని వెళ్ళెద"వనియడిగెను. చాకలివాఁడు పెద్దకుమారుని దీసికొని వెళ్ళుట యసాధ్యమనియు, మిగిలినపిల్లలనెవ్వరినైనఁ దృటిమాత్రమున నవ్వల జేర్తునని నివేదించెను. రాజు రెండవ పుత్రుని భార్యయొద్దకు తీసికొనివెళ్ళెను. తల్లి దండ్రులాతని జాకలితోనేగుమనియు యాచమనాయకునిఁ జేరుకొనుమనియు నుపదేశించిరి. చాకలిబుట్టలోఁ గూర్చొనినప్పుడు బాధనోర్చు కొనవలయుననిగట్టిగఁ జెప్పిరి. రాజపుత్తుడుమిక్కిలియుత్సాహముతోఁదాను వెళ్ళెదననియు, శత్రువులజయించి పితృఋణమును దీర్చుకొనెదననియు నొక్కిపల్కెను. రాజదంపతులు మిక్కిలి యానందించిరి. తల్లి పుత్రునిఁ గౌగలించుకొని కర్పూరతిల

కము నుంచెను. రాజపుత్త్రుఁడు తల్లిదండ్రులకు నమస్కరించి చాకలివానికడ కేగెను. చాకలివాఁడు రాజసుతుని బుట్టలోనిడి మైలవస్త్రములఁగప్పెను. సూర్యుఁడస్తగిరి చేరుకొనుచుండెను. మలిసంజ చీఁకటులు గ్రమ్ముకొనసాగెను. చాకలివాఁడుబుట్టను నెత్తిపైనిడుకొని "తొలగుఁడు తొలఁగుఁ"డనుచు నా సౌధ మును వీడి యిల్లుచేరుకొనెను. మూఁడురోజులవఱకు రాజ పుత్త్రుని తన యింటియందే చాకలి గాపాడవలసివచ్చినది. యాచమనాయకుని యింటికి మాచరాయఁడు వచ్చి వెడలి పోయిన పిమ్మటి రేయి రాజపుత్త్రుని జాకలి యాచమనాయకుని గృహమును జేర్చెను.

యాచమనాయకుని యానందమునకు మేరలేదు. అతఁడు రాజపుత్త్రుని స్వర్ణపర్యంకముపై నాసీనునిగావించెను. పీతాంబరములఁ గట్టబెట్టెను. యాచమనాయకుని యింటిలోని వారందఱు రాజపుత్త్రునిజూచి మురిసిపోయిరి. సేనాపతులు భటులువచ్చిరాజపుత్త్రునిగాంచి చాకలినభినందించి యాచమ నాయకుని నైపుణ్యమును గీర్తించుచుండిరి. చాకలి రాజ పుత్త్రుని యంగరక్షకులలో నొకఁడయ్యెను. ఈ విషయము రాజ్యమునందంతటఁ బుష్పసౌరభమువలె వ్యాపింపఁజొచ్చి నది. మఱికొందఱు దండనాథులు సేనానులువచ్చి యాచమ నాయకుని పక్షమునఁ జేరసాగిరి.

జగ్గరాయలకీవార్త తెలిసినది. అతఁడు నమ్మలేదు. కాని వెంటనే యశ్వారూఢుఁడై శ్రీరంగరాయలున్న ప్రాసాదమును జేరెను. అంతయునిజమే. శ్రీరంగరాయలు తన రెండవ పుత్త్రుఁడు రామరాయలు మూఁడు నాళ్ళనుండి కనుపించుట లేదని చెప్పెను. జగ్గరాయలకుసర్వమర్థమైనది. ఆతఁడువిషాద పరవశుఁడై మరలిపోయెను. సేనాపతిమాచరాయఁడు, తిమ్మానాయకుఁడు కలసి యతని గృహమున కేతెంచిరి. ఒకరినొక రోదార్చుకొని తరలిపోయిరి. జగ్గరాయలు ప్రజల మొగము చూడ లేకపోయెను. చాలకాలము వఱకతఁడుస్వగృహమును వీడి వాహ్యాళికిఁగూడ వెడలుట మానెను.

---

# పంచమాశ్వాసము

~~~~~~

యాచమనాయకుఁడు రాజపుత్త్రుఁడగు రామరాయలకు దన యింటియందే నివాస మేర్పరచి విశ్వాసపాత్త్రులగు సాయుధసైనికులను గాపుంచెను. రాజపుత్త్రుఁడు గృహో ద్యానమందు సాయంకాలము ప్రొద్దుపుచ్చుచుండెడి వాఁడు. ఉదయకాలము నిత్యము సైనికవిన్యాసముల నశ్వారూఢుఁడై పరిశీలించు చుండెడివాఁడు. యాచమ నాయకుని పురోహితుఁ డాతనికి రాజనీతి నుపదేశించుచుండెడివాఁడు. రామరాయలు యాచమనాయకుని గృహము జేరినపిమ్మట ముగ్గురు సేనానులు జగ్గరాయని పక్షమును వీడి తొమ్మిదివేల కాల్బలముతో యాచమనాయకుని సైన్యమును జేరిరి. యాచమనాయకుఁడు సంతోషించెను. సైనికులకందఱ కుత్సాహ మతిశయించెను.

జగ్గరాయలు విషాదాక్రాంతుఁడయ్యెను. శ్రీరంగ రాయల ప్రాసాదమును సంరక్షించుటకుఁ బ్రత్యేకముగ రెండు వేలభటుల నియమించెను. శ్రీరంగరాయల నింతవఱకు జగ్గరాయలు మిక్కిలి గౌరవముగఁ జూచుచుండెడివాఁడు. రాయలను బందీకృతుని గావించినను, రాజమర్యాదఁజూపు చుండెడివాఁడు. శ్రీరంగరాయల కెప్పుడు నమస్కరించు చుండెడివాఁడు. శ్రీరంగరాయల యెదుట జగ్గరాయలెప్పుడు గట్టిగ మాటలాడి యెఱుఁగఁడు. కారాగారమునరాజకుటుంబమునకు నెల్ల సౌకర్యముల నొనఁగూర్చెను. రాయల ప్రాణములు జగ్గ
~~~~~~

రాయలయధీనములోనున్నవి. జగ్గరాయలు మాచరాయనితో నేకీభవించి శ్రీరంగరాయలకు రాజభోగములన్నియు సమ కూర్చెను. జగ్గరాయలు శ్రీరంగరాయల నెదిరించుటకు క్షంతవ్యమైన కారణములుగలవు. కాని విశ్వాసశూన్యుఁడై శ్రీరంగ రాయలు తన రెండవ పుత్రుఁడైన రామరాయలను యాచమనాయకుని కందించెను. ఇంతవరకు శ్రీరంగరాయలు రాచ ఖైదీ. ఇప్పుడుక్రూరదారుఁడు. మోసమునకుద్యమించినరాయ లకు రాజభోగములన్నియు కారాగారమున సమకూర్చుట కింక నవసరములేదని నిశ్చయించి జగ్గరాయలు శ్రీరంగరాయలకు రాజభోగముల సమకూర్పవద్దని కారాగారాధిపతి కాజ్ఞాపించెను.

శ్రీరంగరాయలకుఁ గుటుంబమునకుఁ బూర్వసౌకర్యము లన్నియుఁబోయినవి. ఉప్పుడుబియ్యము వారి యాహారము. బచ్చలి, గోంగూర, తోటకూర, మొదలగు నాకు కూరలు గూడ వారికి సమృద్ధిగ లభింపలేదు. శ్రీరంగరాయలు తన స్థితికి ఖిన్నుఁడయ్యెను. రంగరాయల గృహిణి హృదయము చాల నొచ్చుకొనెను. ఆమె రాయలతోగాని రాయలామెతో గాని యావిషయమును ముచ్చటింపలేదు. రాజకుటుంబము మిక్కిలికష్టము లనుభవించుచుఁ గాలము గడుపుచుండెను.

యాచమనాయకుఁడు శ్రీరంగరాయల కుటుంబమునకు జరుగుచున్న యవమానమునకు మిక్కిలి క్రుద్ధుఁడయ్యెను.

ఎట్లయిన శ్రీరంగరాయలను విడిపింప సంకల్పించెను. విశ్వాస పాత్రులైన యిరువదిభటులు యాచమనాయకుని పూన్కి నెరవేర్ప శపథము పట్టిరి. యాచమనాయకుఁడు వారికిపన్నాగ మును వివరించి విశదముగా బోధించెను. పురోహితుఁడు దీవించెను. రామరాయలు కర్పూర తాంబూలము నిచ్చి, వారిని మన్నించి పంపెను. వారు రామరాయ లిచ్చిన యొక లేఖను గూడ పదిలముగఁ దీసికొనిపోయిరి. రామరాయలు వాతాయ నమునుండి వారశ్వముల నధిరోహించి పోవుటను గనుచూపు మేరవఱకుఁ జూచుచు నిల్చెను. గుఱ్ఱపుగిట్టలలోఁ శ్రుతిగలుపు కొని యాతని చిరుగుండె కొట్టుకొనుచుండెను.

యాచమనాయకునిభటులు మారు పేరులతో సేనాపతి యొద్దకుఁబోయి భక్తివిశ్వాసములు ప్రకటించి కొలువునకు గుదిరిరి. శ్రీరంగరాయలను బంధించిన ప్రాసాదము కోటలో నొకమూలనున్నది. వారికిశ్రీరాయలను సందర్శించు నవకాశము చిక్కలేదు. చిమ్మచీఁకటులు గ్రమ్ముకొన్న యొకరేయి తమ గదిలో శ్రీరంగరాయలు మేల్కొనియుండెను. రాయలకు నిద్రతగ్గిపోయెను. ఆతఁడెప్పుడేదియో యాలోచించుచుండెడివాఁడు. ఒకప్పు డేయాలోచనలేక సూన్యదృష్టితో మేల్కొని యుండుటగూడ గలదు. ఆరేయి రాయలు శయనించిన య గదిలో నొకమూలఁ జూచుచుండగ నొరంగ మేర్పడెను.

రాయలాశ్చర్య చకితుఁడయ్యెను. ఆసొరంగమునుండి కొందఱు భటులు వెలువడిరి. రాయలుదిగ్భ్రాంతిఁ జెందెను. ఆ భటులు రాయలకు సాష్టాంగ దండప్రణామము నొనర్చి రామ రాయల లేఖ నందించిరి. అందురాయల బంధవిముక్తికై వారి పన్నాగము వివరింపఁబడినది. రాయలు మిక్కిలి సంతోషించెను. రాయలాసొరంగమునుండి బయల్వెడలి రాత్రి చంద్ర గిరి దుర్గమునుభటులవేషముతో దాటిపోవచ్చును. అతఁడు గృహిణిని నిద్రలేపి, యామెకు సర్వము వివరించి చెప్పెను. రాయల పెద్దకుమారుఁడుగూడ నా పన్నాగమును మెచ్చు కొనెను. రాయల కుటుంబమును ధైర్యము విడనాడ వల దనియు, నాతఁడు తరుణము లభింపఁగనే వారిని విడిపించెద ననియుఁ జెప్పి సొరంగమునుండి దిగుడ కుద్యుక్తుఁడయ్యెను.

రాయలు మూఁడడుగులు పైచెనో లేదో వెంటనే ప్రాసాదసంరక్షకు లేగుదెంచి యాతని బంధించి, యాభటులను రెక్కలుకట్టి తీసికొనిపోయిరి. రాయలువిషాదము బొందెను. ఇంకమీఁదనిట్టి తరుణమాతనికి లభింపదు. అతఁడు ప్రజల మొగము జూచుటకు మిక్కిలి సిగ్గిలెను. ఇంద్రజాలమువంటి యాసన్నివేశమాతనికర్థముకాలేదు. యాచమనాయకుని భటు లాసొరంగమును నతినైపుణ్యముతోఁ ద్రవ్విరి. కాని సరిగ నాఁటిరాత్రి కారాగారమును సంరక్షించు భటులలో నొకఁడు ప్రమాదవశమున నాసొరంగముఁబడి మొఱ్ఱ పెట్టెను. వెంటనే

సేనాపతి భటులువచ్చి కాగడాలతోఁ బరిశోధింపఁగ సుదీర్ఘ మైన యా సొరంగము కనుపించెను. వెంటనే వారాసొరంగము చివరికరుగనప్పుడే దురదృష్టమూర్తి శ్రీరంగరాయలు దిగుచు చుండెను. శ్రీరంగరాయలు తిరిగి బందీకృతుఁడయ్యెను.

యాచమనాయకుని భటులను ప్రాసాదరక్షకులు సేనా పతియొద్దకు దీసికొనిపోయిరి. సేనాపతి వెంటనే వారికి శిర శ్ఛేదముగావించెను. ఈవృత్తాంతము జగ్గరాయలకు సేనాపతి యెఱిఁగించెను. జగ్గరాయలయింటికి మాచరాయఁడు తిమ్మా నాయకుఁడు వచ్చిరి. కర్తవ్యము వారికి గోచరింపలేదు. జగ్గ రాయలతమ్ముఁడు చిన్నయోబలరాయఁడు, అతఁడు శత్రు శేషము మిగులుచుండుట యవివేకమని వాదించెను. మాచరాయఁడు శ్రీరంగరాయలకుఁ దానమిచ్చిన యభయమును ప్రస్తావించి శ్రీరంగరాయల నింకొక దుర్గమునకు మార్చిన మంచిదని ప్రతిపాదించెను. జగ్గరాయలకు మాచరాయఁడనిన నెక్కువగౌరవము. తిమ్మానాయకునకు మాచరాయఁడు కుఱ్ఱ వాఁడని, యనుభవములేనివాఁడనిలోపలనున్న దనయభిప్రాయమును వెల్లడించు ధైర్యములేదు. ప్రజలలో మాచరాయనికిఁ గొంతకీర్తిగలదు. అతఁడు తనసీమలోఁదటా కములఁ ద్రవ్వించి, సత్రములను గట్టించి, బ్రాహ్మణుల కగ్ర హారములిచ్చి దేవాలయములకు మాన్యములిచ్చి పేరుసంపా దించెను. జగ్గరాయలకు శ్రీరంగరాయల ప్రవర్తన మిక్కి

గర్వముగఁ దోచెను. "పేటొక దుర్గమునకు శ్రీరంగరాయ లను మార్చినంతమాత్రమున నాతనికది తగిన శిక్షయగునా" యని జగ్గరాయలు ప్రశ్నించెను. మాచరాయలు "మనమింత కంటె నేమిచేయగల"మని తిరిగి ప్రశ్నించెను. జగ్గరాయలు మారుమాటాడ లేకపోయెను. శ్రీరంగరాయలను కాళహస్తి ప్రాంతమున, కొండలమధ్యనున్న గిరిదుర్గములో బంధించుటకు తుదకు వారు తీర్మానించిరి. సేనాపతికిఁ దన యభి ప్రాయము నెఱింగించిరి.

శ్రీరంగరాయలను గిరిదుర్గమునకు సేనాపతిమార్చెను ఆదుర్గమును సంరక్షించుట కనేక యుద్ధములలో నారితేరిన యోబయ్యనైదువందల భటులతోనియమించిరి. అది నిర్జన స్థలము. శ్రీరంగరాయలకుఁ గనుచూపుమేరలో నెక్కడ మనుష్యసంచార చిహ్నములే కన్పించుటలేదు. రాత్రులందు దుర్గమందలి గదులలో వొగచూరెడి యాముదపు దీపములే గాని, దవ్వుల దీపకాంతులైన రాజకుటుంబమునకు గనిపిం పవు. చిమ్మచీకటులు, నక్కలకూతలు, బెబ్బులుల గాండ్రింపులు నిద్రపట్టని రాజకుటుంబమునకు మఱింత భీతావహముగ నుండెను. వారిని బలుకరించెడి వారుకూడ లేరు. దుర్గాధిపతి యోబయ్యయే యప్పుడప్పుడు వచ్చి శ్రీరంగరాయలతో మాటలాడుచుండెడివాఁడు. శ్రీరంగరాయలతండ్రి రామారా యులకడ మొదటనొక భటునిగా నోబయ్య చేరెను. శ్రీరంగ

రాయలుబాల్యుఁడుగా నున్నప్పుడోబయ్య భుజములపై నెక్కి త్రొక్కియాడుకొనెను. ఒకనాఁడు శ్రీరంగరాయలకు నోబయ్యనే యావిషయమును జ్ఞప్తికిఁ దెచ్చెను. శ్రీ రంగ రాయల కన్నుల నీరుతిరిగెను. ఆ నాఁడోబయ్య తన పాదదాసుఁడు నేఁడో! ఓబయ్య రాయలవిచారమును గ్రహించెను. ఓబయ్య అప్రయత్నముగ నొక్క వేడినిట్టూర్పు విడిచికాలమహిమ యని పల్కి లేచెను. శ్రీరంగరాయలు "కాలమునకు ద్రోహమునకంటె నెక్కువ శక్తిగలదా? యోబయ్య"యని ప్రశ్నించెను. ఓబయ్య సమాధానము చెప్పకుండ నచ్చోటువీడి వెడలి పోయెను. శ్రీరంగరాయలు దుర్గమున బందీకృతుఁడు. ఖైదీతో దుర్గాధిపతి మాటలాడకూడదు. అంతమాత్రమేగాక సాగైదుసారు లతనితో మాటలాడ నదియే తెలియక మైత్రిగ మారవచ్చును. అది రాజద్రోహము. ఓబయ్య గూడ నచట కాలక్షేపమెట్లగును? ఏమైన నింక నోబయ్య రాయలకడ కేగ రాదని నిశ్చయించు కొనెను.

శ్రీరంగరాయలు ప్రొద్దువోకకై తన పెద్ద కుమారునితో మేక-పులియాట నాడుకొనుచుండెను. సుద్దతో గళ్లు చెరిగిపోవుచున్నవి. రాజపుత్రుఁడు పోయి యోబయ్య గదిగుమ్మముననున్న యొక మేకునూడగొట్టి తెచ్చి దాని నొక బల్లపై జెరిగిపోవునట్టి గీతలగీచి యాట నారంభిం చెను. ఓబయ్యవచ్చి గుమ్మమును సులభముగఁ దెరచుటకై

స్వయముగఁ గొట్టినమేకు లెక్కవోవుటచేనచ్చటి సేవకునడిగెను. అతఁడు రాజపుత్రుఁడు వారించి ననువినక యొక పెద్ద రాతితో నూడఁగొట్టుకొనిపోయెనని చెప్పెను. ఓబయ్య శ్రీరంగరాయల గదికి వెంటనే వెడలెను. రాయలు పుత్రునితో మేక - పులి యాట నారంభించెను. మేకల్లు రాయలవి, పుల్లులు రాజ పుత్రునివి. రాజపుత్రుని యాటకట్టుటకు సిద్ధముగనుండెను. ఓబయ్య మేక పులి యాట యనిన చెవిగోసుకొనును. తాను వచ్చినపని మరచిపోయి, తాను రాజపుత్రుని పక్షము వహించి రాయల మేకలను మ్రింగెను. విజయోత్సాహముతోఁ దన్నా యాటలో నెగ్గగల వారెవ్వరు లేరని యోబయ్య పలికెను. రాయలుఁ మొదటనుండి యాడినచోఁ దానే నెగ్గెడివాఁడనని బదులు పల్కెను. ఓబయ్య సమ్మతింపలేదు. తిరిగి యాట నారంభించిరి. ఓబయ్య పులులమిక్కిలి చాకచక్యముతో నడి పించి తిరిగి రాయల మేకలఁ మ్రింగెను. రాయ లోబయ్య నైపుణ్యమును బ్రశంసించి తనమెడలోని యమూల్యమగు ముత్యాలహారము నతనికి బహూకరించెను. కాని యోబయ్య కేమియుఁదోచలేదు. అంతటి విలువగలహారమును ఖైదీయొద్ద నుండి తాను పరిగ్రహింపరాదు. తిరిగియిచ్చిన బాగుండ దేమో! కాని యతఁడు వెంటనే రాయలకా హారమును వినయముగా సమర్పించెను. ఆ సమయముననే తల్లి పనుపున నచటికి వచ్చిన యోబయ్యచిన్నకూతురు మెడలో రాయలు

హారమును వేసెను. ఆమెపట్టలేని సంతోషముతోఁ దల్లి యొద్దకు గంతులు వేసికొనుచుఁ దరలిపోయెను. ఓబయ్యచూడ నట్లా చోటునుండి వెడలిపోయెను. కాని యారాత్రి యోబయ్యకు నిద్రపట్టలేదు. తన జీవితమంతయు వెలగట్టిన నా ముత్యాలహారములో లేశమైనవిలువయుండదు. రాయలేల తనకా హార మిచ్చెను. రామరాయల యౌదార్య మాతని కిదివరకు గొంతవరకుఁ దెలిసినదే. విజయనగర రాజ వంశీయులయౌదార్యము ప్రపంచ మెఱిఁగినదే. అతని మనస్సు పరిపరి విధములఁ బోయినది. చివరకాతఁ డా హారమును రాయల కిచ్చివేయ సంకల్పించెను. ప్రక్కగదిలో ని ద్రించు చున్న తనకూతురుకడ కేగెను. ఆమె మెడలోనున్న హార మా ముదపుదీపపు వెలుగులలో మిలమిల మెరసి పోవుచుండెను. ఆమె మెడలోని హారమును దీయుటకాతనికి చేతులురాలేదు. ఓబయ్య తన గదిలోనికిఁ బోయి నిద్రించెను.

తెల్లవారినది ఓబయ్య దుర్గమును వీడి కొంచెము దూరముపోయి కాలకృత్యములను దీర్చుకొనుట యలవాటు. అతఁడు కొండప్రక్కకా ప్రాతఃకాలమున నానాఁడు గూడ వెళ్లెను. ఆనిర్జనస్థలమున నొకపొదమాటుననుండియెవ్వరో వ్యక్తి యాతనినే సమీపించెను. చూడనతఁడు యాచమనాయకుఁడే ఓబయ్య కేమితోచలేదు. అప్రయత్నముగనతని రెండు చేతుల కలసికొనెను. యాచమనాయకుని కతఁడు నమస్కరించెను

“ఓయి! నీవేనా! దుర్గాధిపతి యోబయ్య యన నెవ్వరో యనుకొంటిని. కుశలమా” యని ప్రశ్నించెను. ఓబయ్య కూపిరాడలేదు. ఉక్కిరిబిక్కిరయ్యెను. శ్రీరంగ రాయల తండ్రి రామరాయలవారికి నమ్మినబంటనియే యోబయ్యను, సేనానిగ చంద్రగిరికోటలో శ్రీ వేంకటపతి రాయలు నియమించెను. యాచమనాయకుఁడే యతనికి తన రాయల ఖడ్గమునుబహూకరించెను. ఇప్పుడా యాచమనాయ కుఁడే తన యెదుట నుండెను. చివరకెటులో గొంతువిప్పెను.

ఓబయ్య:—ఏమిట్లు దయచేసితిరి ?

యాచమనాయకుఁడు:—నీవు గ్రహింపలేదా?—జగ్గరాయల కుట్ర జరిగినపుడు చంద్రగిరి కోటలో నుంటివని వింటిని. నిజమేనా? సేనానులందఱు నిట్లు రాజ ద్రోహమున కొడిగట్టవచ్చునా ?

ఓబయ్య:—ఏనాఁటిమాట! ఎవరికేమి తెలియును? అనుకొన కుండ నంతయు జరిగినది. శ్రీరంగరాయలే సింహా సనమును త్యజించి మాచరాయలకు లొంగి పోయెను. ఓడిపోయినవాఁడు తిరిగి నెగ్గవచ్చును. తానే లొంగిపోయిన వానికేగతి ? అప్పటినుండి క్రొత్తరాయలను భక్తితో సేవించుచుంటిని.

యాచమ:—నీకు రాజభక్తిపోలేదు. మంచిదిలే. అసలు రాయలు శ్రీరంగ రాయలేగదా ! నీవిపుడుదుర్గాధి

పతివి. నీకు కావలసినది లభించును. అతనిని విడి పించుట కుపాయము సల్పుము. దుర్గమునకు నీవధినేతవుగదా! రాయలను మా కప్పగింపుము.

ఓబయ్య:—జగ్గరాయలతమ్ముఁడుచినయోబలరాయఁడిచ్చటి కొక్కయోజము ననే సైన్యముతో నున్నాఁడు.

యాచమ:—ఆవిషయము నాకు దెలియును. అతఁడు రేపు చంద్రగిరికోటకన్నగారినిఁ గలిసికొనుటకై పోవును. రేపు నీవు దుర్గద్వారమును మూసివేయుము. నాసైన్యముతో వచ్చెదను. ద్వారములు వెంటనే తెరచిన శ్రీరంగరాయలను దీసుకొనిపోవుదము.

ఓబయ్య కొంచమాలోచించి సమ్మతించెను. యాచమ నాయకుఁడు ఖడ్గము నందించెను. ఓబయ్య కత్తిఁబట్టుకొని రాయలను విడిచిపుచ్చెదనని శపథము సల్పెను. ఓబయ్యదుర్గ ద్వారములు మూసిన వెంటనే వర్తమానమంపెదనని యాచమ నాయకునితోఁ జెప్పెను. యాచమనాయకుఁడశ్వము నధిరో హించి పర్వతమార్గమును బట్టిపోయెను.

రాత్రి యోబయ్య యీ వృత్తాంతమును శ్రీరంగ రాయల కెఱింగించెను. శ్రీరంగరాయలుత్కంఠతో సూర్యోద యమును నిరీక్షించుచుండెను. ఆ రేయి రాయలకు నిద్రలేదు.

తిరిగి తెల్లవారినది. చినయోబలరాయఁడు చంద్ర గిరికిఁ దరలిపోయినట్లు భటుఁడొకఁడు వచ్చి యోబయ్యతోఁ జెప్పెను. ఓబయ్య వెంటనే తన సైనికులతోఁబోయి శ్రీరంగ రాయల గదిని కాయుచున్న చిన్న యోబలరాయనిభటులను జంపివేసి, దుర్గద్వారములను మూసి యాచమనాయకునకు వర్తమాన మంపెను. దుర్గమునకు జగ్గరాయల సేనాని యొక డేతెంచి ద్వారములు మూసియుండుట గాంచి, మోసమును వెంటనే జగ్గరాయలకు సత్వరముగ నివేదించుటకుఁ బోవు చుండెను. మార్గమధ్యమునఁజిన యోబలరాయఁడుకన్పించెను. అతనితో నీవృత్తాంతమును జెప్పెను. వెంటనే చిన యోబల రాయఁడు వెనుకకుఁ దిరిగి శ్రీరంగరాయలున్న గిరిదుర్గమును జేరెను. ఆ దుర్గద్వారములు మూసియున్నవి. కాని యోబయ్యకు తెలియని యొక రహస్యద్వార మా గిరి దుర్గమునకు వెనుకగలదు. దాని యునికి జగ్గరాయలకు నతని తమ్మునకు మాత్రమే తెలియును. యాచమనాయకుని సైన్యము గిరిదుర్గ మును జేరకముందే చినయోబలరాయఁడు రహస్యద్వార మున నాదుర్గమును సైన్యముతోఁ బ్రవేశించెను. ఓబయ్య చిక్కిపోయెను. చినయోబలరాయఁడు వెంటనేయోబయ్యను నతని యైదువందల భటులను దుర్గమందే శ్రీరంగరాయల సమక్షముననే యురిదీయించెను. అతని కోపమునకుమేర లేదు. యాచమనాయకుని సైన్యములు దుర్గమునుఁజేరునప్పటికి

ద్వారములు మూయఁబడియున్నవి. జరిగినయుదంతము వారికి దెలిసినది. దూరమునుండి జగ్గరాయల సైన్యమును జూచి యాచమనాయకుని సేనలు తిరిగిపోయినవి.

జగ్గరాయలు దుర్గమును బ్రవేశించెను. ఆతఁడా పన్నా గమునువిని దిగ్భ్రమచెందెను. తృటిమాత్రమున శ్రీరంగ రాయలు తనచేతిలోనుండి తప్పించుకొని పోవలసినది. ఇక శ్రీరంగరాయలను క్షమింపరాదని సోదరులిరువురు నిశ్చయించి కొనిరి. జగ్గరాయ లాకార్యభారమును దమ్మునిపైమోపెను.

చినయోబలరాయఁడు శ్రీరంగరాయల గదికిఁ బోయి యతని నిందింపసాగెను. ఆకుట్ర రాయలు తనకేమియు నిసు మంతయు దెలియదని తప్పించుకొనఁ జూచెను. ఇంతలో నోబయ్యచిన్నకూతురును ముత్యాలహారముతోనచటి కాతని భటుడు తీసికొనివచ్చెను. చిన్నయోబలరాయఁ డీ ముత్యాల హారముకంటె ప్రబలసాక్ష్యమేమికావలెనని రాయల నడిగెను. రాయలు బదులుపలుకలేదు. అప్పుడేమిచెప్పిన నేమి లాభము ? వెంటనే చినయోబలరాయఁడు కత్తిదూసి యా బాలిక శిరస్సును ఖండించెను. మొండెమునుండి రక్తము చిమ్మనగొట్టపుధారగాఁ బొంగి రాయలయుడుపులుతడిసెను. చినయోబలరాయఁడు శ్రీరంగరాయల 'కుటుంబమున కిదియే శిక్ష' యనియు "శత్రుశేషమును పూర్ణాహుతి సల్పుటకు నిశ్చయించి కొంటిమి"మని నిష్కర్షగాఁజెప్పెను. శ్రీరంగరాయల కోట

రాయని మాటలర్థమైనవి. అతని పలుకులలోఁ బ్రత్యక్షర మాతని నిశ్చయము నసందిగ్ధముగఁ బ్రకటించినది.

శ్రీరంగరాయలు భార్యను బిలిచెను. ఆమెకీవిషయ మెఱింగించి తన ఖడ్గమును దెమ్మనెను. ఆమె లోనికి బోయి రాయల ఖడ్గమును దెచ్చియిచ్చెను. రాయలాఖడ్గముతో నా మెశిరమును ఖండించి పెద్దకుమారుని దక్కినపిల్లలనుబిలిచి వారికి వృత్తాంత మెఱింగించెను. పెద్దకుమారుఁడు ఖడ్గమును దూసి భార్యశిరసు ఖండించి తన్నుఁ బొడుచుకొని మరణిం చెను. రాయలు శేషించిన కుమారుని దరువాతి పుత్రికను ఖండించెను. కాని తుద కాఱుసంవత్సరముల పుత్రిక మిగిలి పోయినది. ఆమె కన్నులుమూసికొని కంపించుచుండెను. రాయలామెను జంపలేక తన్ను తానుపొడుచుకొని మరణిం చెను. చినయోబలరాయఁడు చిన్నపిల్ల శిరమును ఖండించి తన భటులను దీసికొని యాదుర్గమునల్లే పాడుపెట్టి చంద్రగిరి కోటకుఁ దరలిపోయెను.

ఈఘోర హత్యాకృత్యము చినయోబలరాయని సైనికులలోఁ జాలమందికిఁ దెలియదు. చినయోబలరాయఁడు భటుల నందఱను దుర్గద్వారములఁ దెఱచి తనతో చంద్రగిరి కోటకుఁ దీసికొనిపోయెను.

---

# షష్ఠాశ్వాసము

~~~~~

గిరిదుర్గమున రేయెల్ల మృతకళేబరములు నెత్తుటిలో దోగి యుండెను. ప్రాతఃకాలమున కాళహస్తీశ్వరుని సందర్శించి పోవుచున్న తీర్థయాత్రికు లా గిరిదుర్గమును జేరిరి. ద్వారములు తెఱచియున్నవి. దుర్గరక్షకులెవ్వరు లేరు. పాడు వడిన యాదుర్గము తీర్థయాత్రికుల కాశ్చర్యమును గొలిపెను. ఆ యాత్రికబృందమందు గోవిందప్పమంత్రి కలఁడు. తంజాపురి రాజ్యమునందాతఁడు మంత్రిత్వమును నెఱపెను. అతఁడు కొందఱు భక్తులతోఁగలసి తీర్థయాత్రలు సేవించుటకై బయలు దేరెను. దక్షిణ దేశమందలి దివ్యస్థలముల న్నిటి దర్శించి యుత్తరదేశమున బద్రీనారాయణమువఱకు సేవింప వారి సంకల్పము. గోవిందప్ప మంత్రిపదవి విరమించుకొని పుష్కరము దాటినది. తంజాపురీ రాజ్యమున గోవిందప్పమంత్రి యనిన నమితగౌరవము. ఆతఁడు రాజైన యచ్యుతప్పనాయకునకు మంత్రిమాత్రమేగాదు. ఆంతరంగిక మిత్రుఁడు, యువరాజు రఘునాథ నాయకునకు గురువు.

అచ్యుతప్పనాయకుఁడు తంజాపురీ రాజ్యమును మిక్కిలి వైభవముతో నేలెను. విద్యానగర ప్రభువైన యచ్యుతదేవ రాయలు నచ్యుతప్పనాయకునితండ్రి చెవ్వప్పతోడియల్లుండ్రు. దక్షిణ భారతమందలి మధుర, తంజావూరు మున్నగు రాజ్యములు విద్యానగర సామ్రాజ్యమున సామంత రాజ్య
~~~~~

ములు. అచ్యుతప్ప నాయకునకు రాజబాంధవ్యము ప్రాముఖ్యమును గల్పించినది. విశేషము మఱియొకటిగలదు. సామంతులు విద్యానగర సామ్రాజ్యము క్షీణదశ యందున్నదని గ్రహించి క్రమక్రమముగ సర్వస్వతంత్రులు కాఁజొచ్చిరి. అచ్యుతప్పనాయకుఁడు రాజభక్తి గలిగి రాయల కండయై నిలచెను. మంత్రి గోవిందప్ప యచ్యుతప్పనాయకునకుఁ గుడి భుజము.

అచ్యుతప్పనాయుని యనంతరము తంజాపురీ సింహా సనమును రఘునాథనాయకుఁడధిష్ఠించెను. మంత్రిగోవిందప్ప కొంతకాలము మంత్రిత్వమును నెరపి తన జీవితములో నపర సంధ్యాకాలమును భగవద్భక్తితో పుణ్యతీర్థ యాత్రలతోఁ గడుప సంకల్పించుకొనెను. రఘునాథ నాయకుఁడు, గురు దేవుని మంత్రిగ నుండ నెంతయో ప్రార్థించెను. గోవిందప్ప తంజాపురియందేయుండి రాజునకు యథోచితముగ హితోప దేశ మొనరించుట కంగీకరించి మంత్రిపదవినుండి విరమించు కొనెను. నాఁటినుండి భజనలు, సమారాధనలు, సంతర్పణ ములు, వ్రతములే గోవిందప్పమంత్రిజీవితవృత్తము. అతఁడు తీర్థయాత్రికులతోఁగలసి, దివ్య దేశ సంచారమునకుఁ బయనమయ్యెను.

గోవిందప్పమంత్రి తెరచియున్న యాగిరిదుర్గద్వార ములనుజూచి, యాత్రికులఁ నాపెను. ముడతలుపడిన ఫాలమును

నెఱసిన పలుచనిశిరోజములు, తొట్రుపడు నడుగులతోనూఁ కోల నాధారము చేసికొని, దుర్గమును బ్రవేశించెను. యాత్రికు లంద ఱాతని వెనువెంటనుండిరి.

గోవిందప్ప యాత్రికులు, నెత్తుటిలో దోగియున్న యారాజకళేబరములను జూచి, వెరగు, గొంకు, తత్తరము ముప్పిరిఁ గొన విషాదపరవశులైరి. గోవిందప్ప శ్రీరంగ రాయల కుటుంబమును జగ్గరాయలొకగిరిదుర్గమున బంధించె ననివినియుండెను. అతఁడు శ్రీరంగరాయల నిదివర కెన్నియో సారులు చూచియుండెను. యాత్రికులా భీభత్సదృశ్యమును జూచి విచారింప సాగిరి. అందలి స్త్రీలు పెద్దపెట్టున రోదింప సాగిరి. కొందఱు యాత్రికులు ప్రక్కనున్న గ్రామముల కా భయానకవృత్తము నెఱింగించుటకుఁ బోయిరి. గోవిందప్ప కన్నీరు గార్చుచు విలపించెను. ఆతని సమీపమున నున్న యొకవృద్ధపరిచారకుఁడు "గోవిందప్పయ్య వారివెంట నేను శతాధికయుద్ధములలో నుంటిని. ఎన్నో భయంకర సంఘటనలఁ జూచితిని. కాని, యెన్నఁడు గోవిందప్పవారి కన్నులు చెమ్మగిలుట చూడలేదు. ప్రవృత్తిలోనున్నపుడే ధైర్యమును వీడక, వైరాగ్యమును బూనిన వెనుక మంత్రి కన్నీరు గార్చు చుండెను. ఇది యెంతఘోర మెంతఘోర" మని గద్గద కంఠముతోఁ గన్నీరు తుడుచుకొనుచుఁ బల్కెను.

ప్రజలు తండోపతండములుగ నచ్చట జేరసాగిరి. అందఱు కది జగ్గరాయల క్రౌర్యమని విదితమయ్యెను. ప్రజలందఱు జగ్గరాయల, నాతని యమయాయులను నిందింప సాగిరి. గోవిందప్ప లేచి, "ఈశ్వర చిద్విలాసము దురవగాహము. మానవులన నెంత! ఈదారుణ హత్యాకాండమున జగ్గరాయల యదృశ్యహస్తము స్పష్టముగా గోచరించుచున్నను,నింకను దెలియనిది చాలఁగల"దని వచించి యాత్రికులను గలిసికొని పయనము సాగించెను. గోవిందప్ప యాత్రికులతో దుర్గద్వార మును వీడుసరికి మూఁడు గడియలు పట్టెను. జనసమూహ మంతయుఁ గ్రిక్కిరిసియున్నది.

యాచమనాయకుఁ డీ హత్యాకృత్యమును విని విషాద రోషపరవశుఁ డయ్యెను. అతఁడు తన దండనాథులను సేన లను గూర్చుకొనసాగెను. శిబిరములన్నియు నల్లకల్లోలముగ నుండెను. దండనాథులు, సేనానులు, భటులు యాచమనాయకుని బరివేష్టించిరి. రాజపుత్రుఁడు శ్రీరామరాయ లభ్యంతర గృహమున విచారించుచుండెను. రాజపుత్రుని బరామర్శించుటకై ప్రజలు, భటులు, మూగి పోవుచుండిరి. యాచమ నాయకునకు నచ్చటి ప్రజాసమూహమునకు హత్యా వివరములు సంపూర్ణముగ దెలియవు. మాచరాయఁడు శ్రీరంగ రాయల ప్రాణములఁగాపాడ నభయము నొసంగెను. రాజ కీయములలో నభయప్రదానమున కర్థమిదియే కాబోలు !

పరిపరివిధముల యాచమనాయకుని మనస్సులో విచారభావములు రేగినవి. అతఁడు హత్యావార్త వినినంతనే మాచరాయుని కడకొక సేనాని నంపెను. ఇందు మాచరాయఁడు ధరించిన భూమికయెట్టిది? ఇది జగ్గరాయల కుతంత్రమా? ఇతరు లను దెలియదా ? ముందుకర్తవ్యమేమి? ఇవియాచమనాయకుని మనస్సును వేధించిన సమస్యలు.

ఆసమయమున యాచమనాయకుని శిబిరమునకు గోవిందప్ప యాత్రికులతో గలసి వచ్చెను. గోవిందప్పను జూడ గనే యాచమనాయకుఁడు కన్నీరు గార్చుచు లేచి నమస్కరించెను. గోవిందప్ప యతని గాఁగిలించుకొనెను. వారిద్దఱు కొంత సేపుమౌనముగాఁ గన్నీరుకార్చిరి. గోవిందప్ప యాచమ నాయకుని గలిసికొని చాలకాలమైనది. ఆ విషాద వాతా వరణము కుశలప్రశ్నలకుఁగాని, మర్యాదలకుఁగాని తరుణము గాదు. గోవిందప్ప కొంత సేపటికి మౌనమును మాని, “ఎంతఘోరము జరిగినది. ఎంతఘోర”మని యాచమనాయ కుని పరామర్శించెను. యాచమనాయకుఁడు గోవిందప్పను రాజపుత్రుని యభ్యంతర గృహములోనికి దీసికొనిపోయెను. గోవిందప్ప రామరాయల నోదార్చెను. యాచమనాయకుఁడు గవాక్షమునుండి రామరాయల నోదార్చుటకువచ్చిన, వచ్చు చున్న ప్రజాసమూహముల జూపెను. గోవిందప్ప రామ రాయల నడిపించుకొని వచ్చి యచటనున్న యొక

వేదికపై నాసీనునిగావించెను. దండనాథులు, భటులు, ప్రజలు, రాజపుత్రుని జేరి, యూరడింపసాగిరి. యాచమ నాయకుఁడు గోవిందప్పతో, "మీ కెప్పుడీవార్త చేరినది? మిమ్ముఁ జూడఁగనే నా కెచ్చటలేని శక్తివచ్చినది"దనిపలి కెను.

గోవిందప్ప తీర్థయాత్రికులతో తానుగిరిదుర్గమును జేరి నప్పటినుండి సర్వవృత్తాంతమును వివరించెను. అచ్చటి ప్రజ లందఱు మిక్కిలి యాశ్చర్యముతో వినసాగిరి. యాచమ నాయకుఁడు ద్వేగముతో, "మీరే మొట్టమొదట జూచినవా రన్న మాట! యాదృచ్ఛికముగా మీరా దారిని బోవు చున్నారా? ఎంత వింత! మీరు దేవ సందర్శనార్థముబయలు దేరినారు. దేవుఁడే మిమ్ము మాకొఱకటులఁబంపెను. మీరు మాకు గురు దేవులు. మీరు మమ్ముద్ధరించుటకే వచ్చి" రని యాచమనాయకుఁడు పల్కెను. "నేను జేయఁగల దే మున్నది? ధర్మముకొఱకు, సర్వస్వమర్పింప, దీక్షఁదాల్చిన స్వార్థత్యాగి, పవిత్రమూర్తి యాచమనాయకుని కసాధ్య మేమున్న"దని పల్కెను. ప్రజలందరు మిక్కిలి యుత్కంఠ తో గోవిందప్ప పల్కులు వినిరి. యాచమనాయకుఁడు శిరము వంచెను. గోవిందప్ప తిరిగి మందగంభీరస్వరముతో, "దేవుఁడున్న ధర్మమే జయించును. లేదా! యింక నీ ప్రపంచమే భస్మమై పోవలసివచ్చును. యతో ధర్మ స్తతో జయః! ఇది మహాభారత యుద్ధము. నాటి నుండి భారతీయుల

హృదయములలోఁ బ్రతిధ్వనించుచున్న ధర్మవాక్య" మని హెచ్చరించెను. అచ్చటి ప్రజలందఱు రామరాయయాచమ నాయకులగూర్చి జయజయ ధ్వానములు మిన్నుముట్టఘోషించిరి. అంతలో నశ్వారూఢుఁడై మాచరాయని యొద్దకేగిన సేనాని తిరిగి వచ్చి యాచమనాయకునకు నమస్కరించి నిల్చెను. యాచమ నాయకుఁడు, "మాచరాయఁడుకన్పించెనా! సర్వము దెలుపు"మని యతని నడిగెను.

ఆ సేనాని మాచరాయని గలిసికొనెను. మాచరాయని యింట నంతకుఁ బూర్వమే జగ్గరాయలు, చినయోబలరాయఁడు సేనాపతి తిమ్మానాయకుఁడు సమావేశమైరి. ఓబయ్య మోస మంతయు జగ్గరాయలు వివరించెను. చినయోబలరాయఁడు శ్రీరంగరాయల కుటుంబమంతరించిన వృత్తాంతమును వివ రించెను. సేనాపతి, తిమ్మానాయకుఁడు చినయోబలరాయని బహుభంగుల నభినందించిరి. మాచరాయఁడు శ్రీరంగ రాయల కొసంగిన యభయప్రదానమును స్మరించి, యొకింత విచారించెను. కాని జగ్గరాయలు, "శ్రీరంగరాయలు రాజ్యమును స్వచ్ఛందముగఁ ద్యజించుటకు సమ్మతించెను. మన మతని ప్రాణరక్షణ కభయమిచ్చితిమి. అతఁడు తన మాటపై నిలువక కుట్రలు పన్నెను. కుట్రలే యతని జీవిత సర్వస్వ మయ్యె. ఇంక మనము మాటతప్పినదేమున్నది? దీనికి విచా

రింప నవసరము లే"దని మాచరాయనితో వాదించెను. మాచరాయఁడు యాచమనాయకుని సేనానిని గలిసికొని "శ్రీరంగరాయలు కుట్రలుపన్ని, దాను ద్రవ్వుకొన్న గోతిలో దానే పడెను. నేను జేసిన దేమిలేదు. శ్రీరంగరాయలే తన కుటుంబమును సంహరించి యాత్మహత్యకుఁ బాల్పడెను. నేను నిర్దోషిని, యాచమనాయకుఁడు నమ్మిన సంతోషము. నమ్మ కున్న నేనువిచారించుటలే" దనిచెప్పెను. ఆవిషయములన్నియు నా సేనాని యాచమనాయకునకు రామరాయలకు నివేదించెను. అవసాన సమయమున శ్రీరంగరాయలు ప్రదర్శించిన స్థైర్యమును రాజకుటుంబము కాపాడుకొనిన యాభిజాత్య గౌరవమును విని యాచమనాయకుఁ డుప్పొంగిపోయెను. గోవిందప్పమంత్రి "రాయల వంశప్రతిష్ఠ యినుమడించిన" దని ప్రశంసించెను. అచ్చటఁ జేరినవారు సేనాని నా విషయమునే తిరిగి తిరిగి ప్రశ్నించిరి. అతఁడు చెప్పినదానినే మరల మరల జెప్పెను.

ఈఘోరకృత్యమువిని కొందఱుదండనాథులుతమతమ సైన్యములతో యాచమ నాయకుని పక్షముఁ జేరవచ్చిరి. వారట వృద్ధమంత్రి గోవిందప్పనుజూచి నమస్కరించిరి. అచ్చటఁ జేరిన భటులు, దండనాథులు, గోవిందప్పను పెనుగొండ ముట్టడినాఁడు సందర్శించియుండిరి. శ్రీ వేంకటపతి రాయలు రాజ్యమునకు

వచ్చిన తొలినాళ్ళలో గోల్కొండనవాబు పెనుగొండపై దండెత్తి వచ్చెను. అప్పటికే విద్యానగరము శిథిలమై పోయి నది. సామ్రాజ్యమున సామంతులు స్వతంత్రించుచుండిరి. కాని, తంజాపురి ప్రభుపైన యచ్యుతప్పనాయఁడు రాజభక్తి పరుఁడై కేంద్ర సామ్రాజ్య ప్రభుత్వమునకుఁ గుడిభుజమై యుండెను. శ్రీ వేంకటపతిరాయలు, నూనూఁగు మీసాలతోఁ గ్రొంగ్రొత్త యుత్సాహముతో దన కంగరక్షకుఁడై యున్న యాచమనాయకు నచ్యుతప్పనాయకు నాస్థానమునకు సైనిక సాహాయ్య మర్థించుచు నంపెను. అచ్యుతప్పనాయకుఁడు యాచమనాయకుని మిక్కిలి గౌరవించి, పెద్దసేన నిచ్చి పెను గొండ ముట్టడి భేదించుటకుఁ బంపెను. యాచమనాయకుని జీవితములో నది మరపురాని దృశ్యము. అతఁడు రాయల దళవాయి. రాయలరాజ్యమున దండనాథులు, సేనానులు ననేక భాషల మాటలాడఁ గలవారు. తెలుఁగు, కన్నడము తమిళములో సామాన్యముగ భటులందఱు మాటలాడ నేర్చెడి వారు. తంజాపురమున నచ్యుతప్పనాయకుని దళవాయి తమిళములో ప్రశ్నింప యాచమనాయకుఁడు తెలుఁగున సమాధానము చెప్పెను. ఆస్థానమందలి దండనాథులు, భటుల కొందఱునవ్విరి. అప్పటికి యాచమనాయకునకుఁ దమిళము భాషింపగల సామర్థ్యములేదు. వెంటనే యచ్యుతప్ప నాయకుఁడు “మనయువరాజు రఘునాథనాయకుఁడు తెలుఁగున

కవిత్వము చెప్పఁగలఁడు. చిరంజీవి తెలుఁగుకవి. యాచమనాయ కుఁడు తెలుఁగున నేభాషింపఁగలఁడు. అతఁడురాయల తెలుఁగు దళవాయి" యని పల్కెను. యాచమనాయకుఁడు తరువాతఁ దమిళము నభ్యసించి ధారాళముగ మాటలాడ నేర్చెను. కాని తంజావూరు నందాతఁడు "తెలుఁగుదళవాయి"యనియే పేరొక్కెను.

అప్పుడు యువరాజు రఘునాథనాయకుఁడు యాచమ నాయకునితోఁ గలసి పెనుగొండకుఁ దరలి వెళ్ళెను. రఘునాథ నాయకుఁడా పెనుగొండ ముట్టడిలోఁ జూపిన పరాక్రమమును గూర్చి దేశములోఁ గథలు గాథలు, వ్యాపించినవి. శ్రీ వేంకట పతిరాయ లాతని "బాలవీరుఁ" డని పేర్కొనెను. ఆనాఁడు తంజాపురి సేనకు గోవిందప్ప యధినేత, అతఁడు రఘునాథుఁ గంటిని రెప్పవలెఁ గాపాడుచుండువాఁడు. రఘునాథనాయకుఁడు రేయియుద్ధమున గోల్కొండ నవాబు శిబిరమును ప్రవేశించి, చీకాకు చేసిపైచెను. నవాబు ముట్టడిని వీడి గోల్కొండకుఁ దరలిపోయెను.

శ్రీవేంకటపతిరాయలు నిండుకొలువులో రఘునాథ నాయకుని రాజమర్యాదలతో గౌరవించెను. రాయల యాస్థానమున యువరాజునకుఁగూడ నట్టి గౌరవమర్యాదలు లభించియుండ లేదు. శ్రీవేంకటపతిరాయల యాస్థానకవి మల్లయ్య రఘునాథనాయకుఁడు వాల్మీకి మహాకవిపై వ్రాసిన

కొన్ని పద్యములను సభాసదులకుఁ జదివి వినిపించెను. అంతకు ముందే మల్లయ్యకవి గృహమునకుఁబోయి, రఘునాథనాయ కుఁడే స్వయముగ నతని సందర్శించెను. మల్లయ్యకవి మిక్కిలి యానందించి, రఘునాథనాయకునకుఁ దన కవిత్వమును విని పించెను. రఘునాథనాయకుని విడిదిగృహమున కేగి మల్లయ్య కవి యతని సందర్శించి యతని పద్యములు గల తాళపత్ర గ్రంథమును బహుమానముగఁ బడసెను. వేంకటపతి రాయలు వారికిఁ బదునాఱేండ్లు నిండని బాలవీరుఁడు రఘునాథనాయకుఁ డల్లిన మధురకవితాగీతులను వినిపించెను. రాయలయాజ్ఞాను సారము మల్లయ్యకవి రఘునాథుని పద్యముల నిండుకొలువులోఁ బఠించెను. రఘునాథ నాయకునకు రామాయణ మభిమాన కావ్యము. వాల్మీకి యభిమానకవి. అతఁడు వాల్మీకిని గూర్చి వ్రాసిన పద్యములను వేంకటపతి రాయలే తిరిగి చదివించి, "ఇంతవరకు రఘునాథనాయకుఁడుబాలవీరుఁడు; కాని నేడు పెద్దవీరుఁడే. ఇప్పుడు బాలకవి. రేపు పెద్దకవి కాఁగలఁ" డని ప్రశంసించెను. రాయలు మల్లయకవిని సత్కరించెను. సదస్యులు సంతోషించిరి.

కావ్యపఠనానంతరము, రాజనర్తకి, 'నీలవేణి' యభి నయ ప్రదర్శనము, ఆమె కట్టిన పట్టు పుట్టములు, ధరించిన ముత్యాలహారములు వెలగట్టిన నిరువదివేల వరహాల మించును: నుదుటఁ దీర్చిదిద్దిన కస్తూరి తిలకము, రత్నకుండల

ములు, ఫాలాంచలమందు ప్రేలాడు ముత్యాల చంద్రవంక రఘునాథనాయకు నాకర్షించెను. ఆమె రఘునాథ నాయ కుఁడు వ్రాసిన గేయములనే కిన్నెర కంఠముతో నాలపించి మనోజ్ఞముగ నభినయించెను. రఘునాథుఁ "డీ పాటలు నీ కెచ్చట లభించిన" వని మెల్లగఁ బ్రశ్నించెను.

ఆమె నునుసిగ్గు దొంతరులు చిందిపోవ "మల్లయ్య మహాకవిగారే మనోహరమైన యభినయ గేయములు శ్రీరఘు నాథులవారు రచించిరని నాకు నేర్పి"రని వచించెను. రఘు నాథుఁడు, మాఱుపల్కక తలవంచి మిన్నకుండెను. రాయలు, "రఘునాథుఁడు రసజ్ఞుఁడు భరతకళాప్రవీణుఁడు. అతని బిరుద ములు క్షణక్షణమున కతిశయించుచున్న" వని యభినందించెను.

రఘునాథనాయకుఁడు రాయలకు వందనమాచరించి యుపహారముగ నిచ్చిన ఖడ్గమును స్వీకరించెను. రాయలు గోవిందప్పమంత్రిని మిక్కిలి గౌరవించి, కర్పూర చందన తాంబూల సత్కారములతో నొక ఖడ్గము నొసంగెను. రఘు నాథనాయకుఁడు మంత్రిగోవిందప్ప తంజావూరును దమ సేనలతోఁ జేరుకొనిరి.

పూర్వము జరిగిన విషయములన్నిటి యాచమ నాయకుఁడచ్చట జేరిన దండనాథులకు మన్నీలకుఁ జెప్పెను. గోవిందప్ప మంత్రి యాచమనాయకుఁడు చెప్పక విడిచి పెట్టిన విషయము నందఱకుఁ జెప్పనారంభించెను.

రఘునాథనాయకునకు గోవిందప్పకు యాచమనాయ కుఁడు తంజావూరు వెడలుటకు ముందు గొప్పవిందు చేసెను. రఘునాథుఁడు గోవిందప్పతోఁ దరువాత నెన్నియోమారులు యాచమనాయకుని గూర్చి పొగడి చెప్పెను. ఆ విందునకు శ్రీ వేంకటపతి రాయలువారే స్వయముగ విచ్చేసిరి. యాచమనాయకుఁడు, రఘునాథనాయకునకు గోవిందప్పకు తంజాపురిసేనలకు, నొక యోజనము తోడుగవచ్చి, వీడ్కోలు నిచ్చి, తిరిగి పెనుగొండఁ జేరుకొనెను. యువకుఁడైన రఘు నాథుని యాచమనాయకుని మీసములాకర్షించినవి. “శ్రీరంగముకడ నున్న కావేరి వంపుల లోని సొంపులు యాచమ నాయకుని మీసములందు గన్పించు” నని రఘునాథుఁడు గోవిందప్పతోఁజెప్పెను. అప్పటినుండియు రఘునాథుఁడుతన మీసముల యాచమనాయకుని మీసములవలెఁ ద్రిప్పి దువ్వెను. గోవిందప్ప యీవిషయముల గద్గద స్వరముతో జెప్ప, నక్కడివారు పులకించిపోయిరి.

రాజపుత్రుడు రామరాయలులేచి వృద్ధమంత్రి గోవిందప్పను గాఁగిలించుకొనెను. “రాజవంశమున కీ చిరుమొగ్గ మిగిలినది. యాచమనాయకుఁడు భగవత్ప్రేరిత వీరుడు. కారణజన్ముఁడైన నాయకుఁడు సర్వము నిర్వహింపఁగలడు. ముందు కర్తవ్య మాలోచింపవలె” నని పల్కెను. రాజపుత్రుఁడు తి

వేదికపై నాసీనుఁడయ్యెను. యాచమనాయకుఁడు కర్తవ్యమును గూర్చియే యాలోచించుచుండెను. అతనియొద్ద ముప్పదివేల సేనగలదు అంతటి రాజవంశమున శ్రీరామరాయలొక్క డే మిగిలెను. రాజపుత్రుని మిక్కిలి జాగరూకతతో సంరక్షింప వలెను. ఇఁక యుద్ధము తప్పదు.

జగ్గరాయల పక్షమున నపార సేన గలదు. దక్షిణ దేశ మున తంజావూరు నాయకుఁడు రఘునాథుఁడు, మధురరాజు వీరప్పనాయకుఁడు పెద్దరాజులు. తంజావూరు మధుర రాజ్యములకు వంశక్రమానుగతమైన శత్రుత్వము గలదు. ఎట్లైన యాచమనాయకుఁడు రఘునాథనాయకుని సాహాయ్యము నర్థింప నిశ్చయించుకొనెను. అతఁడువృద్ధమంత్రిగోవిందప్పకు దన ప్రార్థన నివేదించెను. గోవిందప్ప, "రఘునాథనాయ కుఁడు తప్పక ధర్మపక్షమునకే సాహాయ్య మొనర్పఁ గలఁడు. నేనేస్వయముగఁదిరిగి తంజావూరునకు వెడలి రాయబారమున నెరపెద"నని యుత్సాహముతోఁ బలికెను. యాచమనాయకుఁడు లేచి కత్తి నెత్తి గోవిందప్పమంత్రికి నమస్కరించి నిలిచెను. శ్రీరామరాయలు ఖడ్గమును దీసి గోవిందప్పకు గర్పూర తాంబూల పురస్సరముగ బహూకరించెను. గోవిందప్ప "అస్త్రసన్యాసము చేసి, తిరిగి యీవృద్ధాప్యమునఁ గత్తి బట్టుచున్నాను. 'ధర్మోజయితి'" యని ప్రమాణమును స్వీకరిం చెను. యాచమనాయకుఁడు, గోవిందప్పకు ధర్మసంరక్షణమును

బదరీయాత్రాపుణ్యము సిద్ధించునని చెప్పెను. ఆనాఁటిరాత్రియే యాచమ నాయకుని, రాజపుత్రుని, వీడ్కొని గోవిందప్ప మంత్రి తంజావూరునకు మరలి పోయెను. యాత్రికులు తీర్థ యాత్రను విరమించుకొని వృద్ధ మంత్రి వెంటఁ దిరిగిపోయిరి. యాచమ నాయకుని యాశ్విక భటులు కొందఱు వారివెంటఁ దోడుగ వెడలిరి.

# సప్తమాశ్వాసము

~~~~~

చిక్కరాయలు, తిమ్మానాయకుఁడు, మాచరాయఁడు, చిక్కరాయల మామగారైన వేంకటపతిరాయల బావమఱది యోబలరాయఁడు, సేనాపతి, జగ్గరాయలు, నతని సోదరుఁడు చినయోబలరాయఁడు చంద్రగిరి కోటలో సమావేశమైరి. రాజ్యమంతయుఁ గల్లోలమైనది. చాలమంది మన్నీలు, సేనానులు యాచమనాయకుని సేనలోఁ జేరుచుండిరి. యాచమ నాయకుఁడు, జగ్గరాయల కొకభటునిచే, "రాజవంశమంతయు నిర్మూలము గావించితిరి. కాని, శ్రీరంగరాయల పుత్రుఁడు రామరాయలు మిగిలియున్నాఁడు యుద్ధభూమిలో యాచమ నాయకుని, రాజపుత్రుని సంహరించి, శత్రుపక్షమును నిశ్శేష మొనర్చి. రాజ్యము నేలుకొనుఁ" డని వర్తమాన మంపెను. ఇంక యుద్ధము తప్పదు. జగ్గరాయల సోదరుఁడు గిరిదుర్గమున శ్రీరంగరాయాదుల మృత కళేబరముల నట్లు విడిచివచ్చుటచే నపకీర్తియెక్కువైనదని, తిమ్మానాయకుఁడు విమర్శించెను. చినయోబలరాయఁడు, జరిగిన యత్యద్భుత మైన మోసమును వివరించి యాసమయమునఁ, దానేమి చేయవలసినది తనకే తోచలేదనియు, దాపున యాచమ నాయకుని సేనలు విడిసిన వనియు సమాధానము చెప్పెను. చినయోబలరాయఁడే యా మృతకళేబరములఁ
~~~~~

దన సైనికులు గూడఁ జూడనిచ్చగింపలేదు. ఆ బీభత్స దృశ్యము సైనికులలో విప్లవము రేకెత్తింపవచ్చును. అతఁడు మతిపోయి సేనలతో హుటాహుటిఁ జంద్రగిరి కోటఁ జేరెను. జగ్గరాయలు 'గత జల సేతు బంధనము మంచిదిగాదు. ఇప్పుడు మన మైకమత్యముతో శత్రువుల నెదిరింపవలె' నని ప్రతిపాదించెను.

వృద్ధమంత్రిగోవిందప్ప యాచమనాయకుని గలిసికొన్న వృత్తాంతమును వేగులువచ్చి, వారికి నివేదించిరి. రఘునాథ నాయకుఁడు యాచమనాయకునితోఁ గలియఁగలఁడు. మధుర రాజ్యము నేలుచున్న ముత్తువీరప్పనాయకుఁడు రఘునాథ నాయకునకు శత్రువు. కావున జగ్గరాయలు, ముత్తువీరప్ప నాయకుని సాహాయ్య మర్థించుట కర్తవ్యమని ప్రతిపాదించెను. అందఱు సమ్మతించిరి.

ముత్తువీరప్పనాయకుఁడు వేంకటపతిరాయలవారి కాలము నుండియు, స్వతంత్రుఁడగుటకు దరుణమునకై ప్రయత్నించు చుండెను. శ్రీ వేంకటపతిరాయల కాతఁడు సకాలమున నెన్నఁడు కప్పము చెల్లింపలేదు. ఒకసారి శ్రీ వేంకటపతిరాయలు మధురపై స్వయముగ దండయాత్ర సలిపెను. అప్పుడు రఘునాథరాయలతండ్రి యచ్యుతప్పనాయకుఁడు వేంకటపతి రాయలపక్షము వహించెను.

వీరప్పనాయకుఁడు ప్రతిసంవత్సరమును విద్యానగర సామ్రాజ్యప్రభువైన రాయలకు నాఱులక్షల వరహాల కప్పము

చెల్లించుచుండెడివాఁడు. అతని క్రింద ననేక సామంతరాజులు గలరు. తిరువాన్కూరు నాయకుఁడు సామంతులలోనొకఁడు. వీరప్పనాయకుఁడు లక్షసైనికుల నొక్కసారి కూర్పఁగలఁడు. అతనియాశ్విక దళములు గజయూథములు పేరుకెక్కినవి. వేంకటపతిరాయల మరణానంతర మతఁడు తనసేనల నభివృద్ధి పఱుచు చుండెను.

జగ్గరాయలే వీరప్పనాయకుని గలసికొనుటకు మధుర కేగవలెనని యతని సహచరులందఱు నిశ్చయించిరి.ముందుగ విశ్వనాథచయనులను మధురకు రాయబారిగఁ బంపిరి. మైసూరులో నొడయారుమహారాజు పరిపాలించుచుండెను. అతఁడు సింహాసనము నధిష్ఠించి యింకను దశాబ్దినిండలేదు. అతఁడే పక్షమునకు మొగ్గునో తెలియదు. అతనిని శ్రీ వేంకటపతి రాయలే సింహాసనమునిల్పెను. కావున నాతఁడు యాచమ నాయకుని పక్షమునకు మొగ్గవచ్చును. కాని వీరప్పనాయకు నెదిరించుట కాతఁడు సాహసింపఁజాలఁడు. వీరప్పనాయకుఁడు తలచుకొనిన నాతని రాజ్యమొకగడియలో నస్తమించును. విశ్వనాథచయనులు మైసూరునకుఁబోయి యామహారాజును గూడ సాహాయ్యమర్థింప నాదేశించిరి.

విశ్వనాథచయనులు మధుర చేరెను. అతనిని వీరప్ప నాయకుఁడు మిక్కిలి గౌరవించెను. మధుర రాజ్య స్వాతం

త్ర్యము సంగీకరించుచో జగ్గరాయల పక్షమునఁ జేరుటకాతఁడు సమ్మతించెను. విశ్వనాథచయనులు, జగ్గరాయాదు లందులకు సమ్మతించెదరని చెప్పెను. వీరప్పనాయకునకు, వృద్ధ మంత్రి గోవిందప్ప యాచమనాయకుని లేఖతోఁదంజావూరు చేరిన విషయము తెలిసినది. ఈతరుణమున నాజన్మవైరియైన రఘునాథనాయకునిపైఁ బగదీర్చుకొన వచ్చుననినాతఁ డుప్పొంగిపోయెను. విశ్వనాథచయనుల నాతఁడు పీతాంబర ములతోఁ గర్పూర తాంబూల చందన సత్కారములతో గౌరవించి పంపెను.

విశ్వనాథచయను లచ్చటినుండి మైసూరుచేరి మహా రాజును సందర్శించెను. మైసూరు మహారాజు తానే పక్షమునువహింపఁజాలననియుఁదాటస్థ్యము వహించెద ననియు జెప్పెను. అచ్చటినుండివిశ్వనాథచయనులు చంద్రగిరికిబయలు దేరి మార్గమధ్యమున జగ్గరాయలఁ గలసికొని సర్వము విన్న వించెను. జగ్గరాయలు, సోదరుడైన చినయోబలరాయనితోఁ గలసి, వీరప్పనాయకుని గలిసికొనుటకు మధురకు బయనించెను.

వీరప్పనాయఁకుడు సర్వస్వతంత్రుఁడగుట కెన్నియో సంవత్సరములనుండి కలలు గనుచుండెను. తొల్లి కేంద్ర సామ్రాజ్యమునకుఁ గప్పము చెల్లించుట మానివేసినప్పుడు వేంకటపతిరాయలే దండెత్తి వచ్చి నాతని నోడించుట

యాతఁడెన్నఁడు మరువలేదు. ఆనాఁడు జగ్గరాయాదులు రాయలకుఁదోడ్పై యాతనిమీఁదికి దండెత్తివచ్చిరి. కాని యా జగ్గరాయలే యిప్పుడతని యొద్దకు సాహాయ్య మర్థించివచ్చు చున్నాఁడు. కాలమట్లు గలిసిరావలెను. మధుర రాజ్యమును స్థాపించిన విశ్వనాథనాయకునికంటె వీరప్పనాయకుఁడధికుఁ డని కీర్తి సంపాదింపవలెనని యాతని యభిలాష.

విశ్వనాథనాయకుని పరాక్రమ ప్రాభవమునుగూర్చి గేయములు గాథలు యక్షగానములు, లోకములో వ్యాపించినవి. విశ్వనాథనాయకునితండ్రి నాగమ నాయకుఁడు. ఆతఁడు శ్రీకృష్ణ దేవరాయలకు నమ్మినబంటు. నాగమనాయకుని తనయుఁడైన విశ్వనాథనాయకుని శ్రీకృష్ణదేవరాయలుతాంబూల వాహకునిగ స్వీకరించెను. అతఁడు పదునాఱేండ్ల వయస్సున శ్రీకృష్ణ దేవరాయలతోఁ గలిసి రాయచూరు యుద్ధమునఁ బోరాడెను ఆ యుద్ధమునందు, శ్రీకృష్ణ దేవరాయలు సేనలు శత్రువులదాకి పోరాడి, పోరాడి యోడిపోయి, వెనుకంజ వేయఁజొచ్చినవి. శ్రీకృష్ణ దేవరాయలు ముందునకు వచ్చి చెదరిపోవుచున్న సేనల నెల్ల సమకూర్చి తానే మునుముందు నిల్చి విశ్వనాథనాయకునకుఁ దనయుంగరమిచ్చి, తాను మర ణించినచో రాణులకు సహగమనము సల్పుట కా ముద్రిక నొసంగుమని యాదేశించి, “యశోవా మృత్యుర్వా” యని మహాపరాక్రమ భీకరమూర్తియై దుర్గద్వారములపై లంఘిం

చెను. ద్వారములు పగిలిపోయినవి. విజయలక్ష్మి విద్యానగర సేనల వరించినది. శ్రీకృష్ణ దేవరాయ లాపత్కాలమున స్వీక రించిన యాంతరంగిక భటుఁడు మధుర రాజ్య సంస్థాపకుఁడైన విశ్వనాథనాయకుఁడు.

మధుర రాజ్యస్థాపననుగూర్చి యద్భుత కథలుగలవు. శ్రీకృష్ణ దేవరాయలు రాజ్యమునకు వచ్చినప్పుడు దక్షిణమున నెన్నియో చిన్నచిన్న రాజ్యములు గలవు. ఒక చోళరాజు వీరశేఖరుఁడు పాండ్యదేశముపై దండెత్తి పాండ్యరాజుచంద్ర శేఖరుని సింహాసనచ్యుతుని గావించెను. చంద్రశేఖరుఁడు శ్రీకృష్ణరాయలతోఁ సాహాయ్య మొనర్ప మొఱ పెట్టుకొనెను. రాయలు కరుణించి తన దండనాథుఁడైన నాగమనాయకుని దక్షిణమునకుఁ బోయి వీర శేఖరుని జయించి యచ్చటి స్థితి గతుల సరిదిద్ది చంద్రశేఖరునకు దిరిగి రాజ్య మర్పింపుమని పంపించెను. నాగమనాయకుఁడు వీరశేఖరుని జయించి అతని రాజ్యమును సామ్రాజ్యములోఁ గలిపెను. కానీ, పాండ్య ప్రభువులైన చంద్రశేఖరునకుఁ దిరిగి యతను సింహాసనము నర్పింపలేదు. చంద్రశేఖరుఁడు రాయలతోఁ నీవిషయమును నివేదించుకొనెను. నాగమనాయకుఁడు చంద్రశేఖరుడుదుర్బలుఁ డనియు నసమర్థుఁడనియు సింహాసనమునకుఁ దగఁడనియు లేఖాముఖమున రాయలకు విన్నవించెను. రాయల యాజ్ఞను నాగమనాయకుఁడు మన్నింపలేదు. అంతియే

గాక రాయలకే రాజనీతి బోధింప సమకట్టెను. శ్రీకృష్ణ దేవరాయలాగ్రహావేశ పరవశుఁడయ్యెను. నిండుకొలువులో "దురభిమాన పూరితుఁడైన నాగమనాయకుని నిర్జించి తెచ్చు వారెవ"రని రాయలుఁ బ్రశ్నించెను. అంతవరకు నాగముఁడు రాయలకు విశ్వాసపాత్రుఁడు; ముసలిబంటు. ఎవ్వరు నాత నిపై దండెత్తి పోవుటకు సాహసింపరైరి. నిట్టూర్పులైన లేని యా నిశ్శబ్ద సభా మధ్యమునుండి నాగమనాయకుని పుత్రుఁ డైన విశ్వనాథనాయకుఁడే లేచి నిల్చి "ప్రభువులు శ్రీకృష్ణ రాయలయాజ్ఞనేదైన నిర్వహించెద"వని ధీర గంభీర స్వరమునఁ బలికెను. రాయలు సంతోషించి, కర్పూర తాంబూలము, ఖడ్గము, సేనల నిచ్చి యతనికి దక్షిణ దండయాత్ర కాజ్ఞనిచ్చెను.

విశ్వనాథ నాయకుఁడు సేనలతోఁ బోయి నాగమ నాయకునోడించి యాతని బంధీకృతుని జేసి, కృష్ణరాయల సమక్షమునకుఁ దెచ్చెను. రాయలు సంతోషించి విశ్వనాథ నాయకు నభీష్టవరముఁ గోరుకొమ్మనెను. అతఁడు, తండ్రి యైన నాగమనాయకుని బంధ విముక్తిని జేయ రాయల ప్రార్థించెను. ఉదార హృదయుఁడైన రాయలు వీరుఁడైన విశ్వనాథుని ప్రార్థనము మన్నించెను. విశ్వనాథనాయకుఁడు రాయలకుఁ గుడిభుజమై ననేక యుద్ధములలోఁ గీర్తి సంపా దించెను. రాయలతని పరాక్రమమునకు మెచ్చి యతని

మధుర రాజ్యమునకు రాజప్రతినిధిగ నియమించెను. అప్పటి నుండియు విద్యానగర చక్రవర్తులకుఁ గప్పము చెల్లించుచు విశ్వనాథనాయకుని వంశీయులు మధుర రాజ్యము నేలుకొను చుండిరి. క్రమక్రమముగ తంజావూరు, మైసూరు మున్నగు రాజ్యములు ప్రాముఖ్యమును సంపాదించినవి. తంజావూరు నాయకుఁడైన చెవ్వప్పకుఁ దోడి యల్లుడైన యచ్యుతదేవ రాయలు ప్రత్యేకాభిమానమును జూపెను. ఈ కథలన్నియు వీరప్పనాయకుఁడు వినినప్పుడు తాను విశ్వనాథనాయకుని మించి స్వతంత్ర సామ్రాజ్యమును స్థాపింపఁ దలఁపోయు చుండెను. మధుర రాజ్యమునకున్న సంపద, సేనలు, చంద్రగిరి ప్రభుపైన రాయలకే యిప్పుడు లేవు.

జగ్గరాయలు, చిక్కరాయలు, తిమ్మానాయకుఁడు మున్నగువారు శరణార్థులై మధురకుఁజేరుట వారికిఁ దా నా శ్రయదాత యగుట వీరప్పనాయకుఁడు పులకాంకుర ప్రకరములతో నుప్పొంగిపోయి నాలోచింప సాగెను. ఇఁక వీరప్ప నాయకుఁడే దక్షిణ దేశముల కేకైక ప్రభుపై యేలుబడి సాగింపవచ్చును. రఘునాథనాయకుని యాచమనాయకుని జయించి చిక్కరాయల సింహాసనమందు నిలిపి "రాయ సామ్రాజ్య సంస్థాపనాచార్య" బిరుదమును సంపాదింప నేవేవో పగటి కలలతో వీరప్పనాయకుఁడు మిక్కిలి యాత్మానంద మనుభవించుచుండెను. ఇంతలో ప్రతీహారులు

వచ్చి జగ్గరాయలు మధురానగరమును సమీపించు చుండెనని తెల్పిరి.

వీరప్పనాయకుఁడు జగ్గరాయల కెదు రేగిమధురానగర దుర్గద్వారముల ఘనమైన స్వాగతమిచ్చెను. మత్తేభ యూథములతో నాశ్విక దళములతో మేళ తాళములతో వేశ్యాబృంద ములతో గొప్ప యూరేగింపుతో జగ్గరాయల మధురానగర మునకుఁ దోడ్కొని తెచ్చెను. జగ్గరాయలు, వీరప్పనాయకుని యాదరమునకు మిక్కిలి సంతోషించి యాతని సాహాయ్య మర్థించెను. వీరప్పనాయకుఁడునిండు కొలువులో జగ్గరాయ లతోఁగ త్తి గలిపి తోడ్పడ నంగీకరించెను. జగ్గరాయలు మధురలో మూఁడు దినములుండెను. అతఁడు మీనాక్షీ దేవాలయమును సందర్శించి దేవికిఁబూజ లర్పించెను. మూడవ దినమున మధురకు చింజీరాజ్యమును బరిపాలించు నాయక రాజు, తిరునల్వేలి రాజ్యమునుబరిపాలించురాజు పాండ్యప్రభు వులు, తిరువాన్కూరు నేలుచున్న నాయకుఁడు విచ్చేసిరి. వారందఱు జగ్గరాయల పక్షమునఁ దమ సేనలతోఁ బోరాడు టకు సమ్మతించిరి. జగ్గరాయలు తమ సేనాసమూహము లకు వీరప్పనాయకుని ప్రధాన సేనాపతిగ వరించెను. వీరప్ప నాయకుఁడు జగ్గరాయల గౌరవింప బెద్దవిందు సల్పెను. ఆ విందునందు గింగి, తిరువాన్కూరు, పాండ్యరాజు లందఱు పాల్గొనిరి. ఆసమయముననే పోర్చుగీసు రాయబార వచ్చి,

వించులో పాళ్లోని వీరప్పనాయకుని సమక్షమున జగ్గరాయ లకుఁ దోడ్పడ సమ్మతించెను.

తిరువాన్కూరు, పాండ్య, చింజి ప్రభువులందఱు తమ తమ సేనలు నాయత్త పఱచుకొనుటకై తమ ప్రదేశముల కేగిరి. వారందఱు తమసేనలతో మధురలోఁగలియుటకునిర్ణయించు కొనిరి. జగ్గరాయలు మధురనుండి చంద్రగిరికి బయలు దేరెను. వీరప్పనాయకుఁడు జగ్గరాయలకు ఘనమైన వీడ్కోలునిచ్చి, యొక యోజనమువరకు సాగనంపెను. జగ్గరాయలు చంద్రగిరి చేరెను.

తిమ్మానాయకుఁడు, మాచరాయఁడు, సేనాపతిమున్నగు వారు చంద్రగిరిలో యుద్ధ సన్నాహములో నుండిరి. చంద్రగిరి కోటయం దెచ్చటచూచిన మత్తేభ యూథములే, జవనాశ్వబృందములే, సేనాపతులే. చిక్కరాయలు శిబిక నెక్కి యొకనాఁడు సేనల నన్నిటఁ బరిశీలించెను. తంజావూరు ప్రభువు రఘునాథనాయకుఁ డొక్కడే యాచమనాయకునకు సాహాయ్యముఁ జేయ నంగీకరించినవారిలోఁ బేర్కొన దగినరాజు. ఆతఁడును, యాచమనాయకుఁడును గలియకుండ గనే యుద్ధము సల్పుట మంచిది. లేదా, యంతకుఁబూర్వమే జగ్గరాయాదులు వీరప్పనాయకుని సేనలఁ గలియవలెను. యాచమనాయకునకు సుమారు ముప్పదివేల సేనలు మాత్ర ముండుననిజగ్గరాయలు లెక్కగట్టెను. జగ్గరాయాదులకు

కాల్బల మొక్కటే డెబ్బదివేలకు మించియున్నది. యాచమ నాయకుఁ డింత పెద్దసేన నెదిరింప జాలఁడనియు, నెదించిన నోటమిఁ జెందుననియుఁ దలపోసిరి. ఇంతలో వేగులు యాచమ నాయకుఁడుసేనలతోఁ గదలెనని వార్త దెచ్చిరి. జగ్గరాయాదులు తమ సేనలతో బయలు దేరిరి. యాచమనాయకుఁడు దక్షిణమునకుఁ బోయి రఘునాథ నాయకుని సేనలఁ గలియుటకుముందే యుద్ధమునకు దిగుట మంచిదని జగ్గరాయాదు లూహించిరి.

జగ్గరాయలు, తిమ్మానాయకుఁడు, మాచరాయఁడు, సేనాపతి, యోబలరాయఁడు తమతమ సేనలతోఁ చంద్రగిరి కోట వెలువడి ముందునకు సాగిరి. చిక్కరాయలు, జగ్గరాయలు, చినయోబలరాయఁడు నొక శ్రేణిలోనుండిరి. ముందు తిమ్మానాయకుఁడు మాచరాయఁడు తమ సేనలతో నుండిరి. దక్షిణపార్శ్వమున నోబలరాయఁడు సేనలఁగాంచెను. వెనుక భాగమున సేనాపతి దండువిడిసెను. చిక్కరాయలతో రాజ స్కంధావార మేబది యేనుగుల మధ్య భద్రముగ నుండెను. ఈ మహాసైన్యమునకుఁ బురోభాగమున గజయూథములు, గుఱ్ఱపు దళములు, శతఘ్నులు, శకటములు నడచుచుండెను. మధ్యాహ్న సమయమునఁ గను జూపుమేరలో యాచమనాయ కుని సైన్యము గోచరించెను.

యాచమనాయకుఁడు పదివేల సేనతో రాజపుత్త్రుఁ డైన శ్రీరామరాయల నొక యర్ధయోజన దూరమున నిలిపి,

జగ్గరాయలును జిక్కరాయలునున్న శ్రేణిని భీకరముగఁ బది వేల సేనతోఁదాకెను. పదివేలమంది భటులు, పురోభాగమున నున్న తిమ్మానాయకుని మాచరాయని, జగ్గరాయలనుండి చీలదీసి భయంకరముగఁ బోరాడి నిల్చిరి. ముందుగ నంత సాహసముతో నల్ప సేనతోఁ దమ మహాసైన్యముపైఁ బడు యాచమనాయకుఁడు సాహసించునని జగ్గరాయలు కలనైన దలపోయలేదు. కాని యాచమనాయకుఁడు సైన్యముతో ధర్మతత్పరతతో జిగీషతో మహావీరుఁడై మీఁదఁబడెను. ఘోరయుద్ధము జరిగినది. యాచమనాయకుఁడు తానే మునుముందు నిలిచి మహోత్సాహముతో సేనల నడపెను. జగ్గ రాయల సేనలు చెదరిపోసాగెను. రాజలాంఛనములు, రత్న పేటికలుగల స్కంధావారమునఁ జిక్కరాయలు దూరమున నుండి యుద్ధమును దిలకించుచుండెను. జగ్గరాయ లా స్కంధా వారమును జేగుసరికి యాచమనాయకుఁడక్కడఁ దరుము కొని వచ్చెను. జగ్గరాయలు చిక్కరాయలతోఁ గలిసి, వడిగల గుఱ్ఱములనెక్కి యాంతరంగిక భటులతోఁ గలిసి, సమీపారణ్యములకుఁ బలాయనముసాగించెను. రత్న పేటికలు, రాజలాంఛనములు, మణిహారములు, సువర్ణరాసులు, యాచమ నాయకునకు లభించినవి. యాచమనాయకుఁడు రత్నాంబరములను రాజలాంఛనములను, ముత్యాల హారములను శ్రీరామరాయలకు సమర్పించి నాటి సాయంకాలమున నాస్కంధా

వారమున నతని విజయనగరసామ్రాజ్యచక్రవర్తిగఁ బ్రకటించెను. వంది మాగధులు రాజ బిరుదావళుల నుగ్గడించి రామరాయల ప్రశంసించిరి. శ్రీరామరాయలు యాచమ నాయకుని గాఁగిలించుకొని రత్నఖచిత స్వర్ణఖడ్గమాతనికి బహూకరించి 'రాయదళవాయిగ' నతని బేర్కొని ప్రకటించెను.

జగ్గరాయ ప్రభృతులు చెదరిపోయిన సేనలసమ కూర్చుకొని యరణ్యమున సమావేశమైరి. అత్యధికసంఖ్యాక మైన తమ సేనల యాచమనాయకుఁడు చీకాకు సేసి జయ మును సంపాదింపగల్గుట వారి కాశ్చర్య మొదవించెను. వారి యోటమికి గారణము నాలోచింపసాగిరి. ఐకమత్యము లేకపోవుట, పురోభాగమున నున్న తిమ్మా నాయకుఁడు మాచరాయఁడు చీలిపోవుట, తలవని తలంపుగ యాచమనాయకుని సేనలు తలపడుట. చావునకుఁ దెగించిన ప్రళయ భీకరమూర్తి యాచమనాయకుని పరా క్రమములని వారు నిశ్చయించుకొనిరి. కాని, యామోటమి తాత్కాలికమే. వారిసేనలలోఁ జాల భాగము యుద్ధమే సలుపలేదు. యుక్తిచే దైవికముగ యాచమనాయకుఁడు జగ్గరాయల శిబిరమును జేరఁగలిగెను. కావున జగ్గరాయాదులు దక్షిణమునకుఁ బోయి వీరప్పనాయకుని, మధురలో గలిసికొన నెంచిరి. అచ్చటఁ దిరువాన్కూరు, గింగి, పాండ్య ప్రభువుల సేనలుగూడ నుండును. ఆ మహాసేనావాహినికి

దక్షిణ భారతమంతయు దానోహ మనక తప్పదు. ఇది వారి తంత్రాలోచన. ఆ సేనలు మధురాపురీ మార్గమున దరలినవి.

యాచమనాయకునకు సంపూర్ణ విజయము సిద్ధింప లేదని తెలియును. అతఁడు చంద్రగిరికోటను విజయోత్సాహముతోఁ బ్రవేశింపవచ్చును. అచ్చట శ్రీరామ రాయలకుఁ బట్టముగట్టవచ్చును. కానివీరప్పనాయఁకుడు, జగ్గరాయ ప్రభృతులు తిరిగివచ్చి ముట్టడించిన నేమికావలెను? కర్తవ్యమును గూర్చి, యాచమనాయకుఁడు రంగరాయల శిబిరమునఁ దన యనుయాయులతో నాలోచింపసాగెను. ఆసమయమున రఘు నాథనాయకుని దండనాథుఁడు వచ్చి, యాతఁడు సేనలతో గుంభకోణమునకు యాచమనాయకునకు, రాయలకు స్వాగత మివ్వ నెదురేగి వచ్చుచుండెనని విన్నవించెను. యాచమ నాయకుఁడు సేనలతోఁ గుంభకోణమునకుఁ దరలిపోసాగెను. మార్గమధ్యమున యాచమనాయకుఁడచ్చట సేనలతో విడిసినను నాయాపల్లెలఁ బెత్తందారులు, పటేలు కరణములు మిక్కిలి గౌరవించి యతనికి, సేనలకు నాతిథ్యమిచ్చిరి.

---

# అష్టమాశ్వాసము

~~~~~~

రఘునాథనాయకుఁడు తన సేనలతోఁ గుంభకోణ మున యాచమనాయక శ్రీరామరాయల యాగమనమును నిరీక్షించుచుండెను. అతఁడు రాజపుత్రునకు యాచమ నాయకునకు స్వాగత మిచ్చుటకు విపుల సన్నాహముల నొనర్చెను. రఘునాథ నాయకుఁడు కుంభకోణమునకు సేనలతోవిచ్చేయుట కవాంతరకారణము మఱియొకటి గలదు. ముందుగ జగ్గ రాయలు సేనలతో మధురానగరమున వీరప్పనాయకునిగలిసి కొనవచ్చును. అచ్చటఁ బ్రచండ సైన్యము చేరియున్నవి. వారు యాచమనాయకుని సేనలను మార్గమధ్యముననే యెదు ర్కొని, రఘునాథుని సేనలను జేరకుండగఁ జీలదీసి యోడించుటకుఁ బ్రయత్నింపవచ్చును. యుద్ధతంత్ర వ్యూహనిష్ణాతుఁ డైన రఘునాథనాయకుఁడు తంజావూరునందు ప్రమత్తుఁడై యుండక యచ్చట గోవిందప్పమంత్రిని నిలిపి తాను సేనా సమూహములతోఁ గుంభకోణమును జేరెను.

దీర్ఘదర్శియైన రఘునాథుఁ డనుకొనినట్లే జరిగినది. వీరప్పనాయకుఁడు జగ్గరాయల యోటమి వినితిరు వాన్కూరు నాయకుని సేనలతో నతనికి సాహాయ్య మొనరింప ముందు బంపెను. అతఁడు జగ్గరాయల సైన్యమును జేరి దక్షిణమునకు వచ్చుచున్న యాచమనాయకుని సేనలపైఁబడ వారు యాచమ
~~~~~~

నాయకుఁడు తెగించి పోరాడి నశించునని తలపోసిరి. కాని, యాచమనాయకుఁడు శ్రీరామరాయలను నిరువదివేల సైన్యముతో ముందుగఁ బంపివేసి, తాను బదివేలభటులతో జగ్గరాయలతోఁ దిరువాన్కూరు నాయకునితో బోరాడఁ దలపడెను. జగ్గరాయల సేనలకు యాచమనాయకునిపేరు సింహస్వప్నమై పోయెను. అశ్వారూఢుఁడై యాచమనాయకుఁడు కాగడఁ గేలఁగీలించి, తనభటుల నుత్సాహ పూరితులఁ జేయుచు విజృంభించుట జూచి జగ్గరాయసేనలు చెల్లాచెదరై పారి పోవుట కుపక్రమించెను. యాచమనాయకుఁడు భటులను వెను కకుఁ ద్రిప్పుకొని, రామరాయల సేనలఁ జేరుకొనెను. జగ్గ రాయలు చేయునది లేక తిరువాన్కూరు నాయకునితోఁ గూడి మధురానగరమును జేరుకొనెను.

వీరప్పనాయకుఁడు, జగ్గరాయల సేనలకు నెదురేగి స్వాగతమిచ్చెను. మాచరాయఁడు తిమ్మానాయకుఁడు సేనాపతి యోబలరాయఁడు వీరప్పనాయకుని మహాసేనా సమూహములఁ జూచి ధైర్యము తెచ్చుకొనిరి. మధురానగరమంతయు భటులతో నిండిపోయెను. వేగైనదీ విశాల సైకతము లందు సేనలు శిబిరములను నిర్మించుకొనెను. ప్రాతఃకాలమున మీనాక్షీ దేవాలయ గోపురముల నెక్కి చూచిన వేగైనదీ తీరము లందెచ్చట చూచినను, స్నానము సల్పుభటులు, మత్తేభములు, గుఱ్ఱములు, శిబిరములు, సేనాపతుల శిబికలు, శకట

ములపై నెత్తింపఁబడు శతఘ్నులే కన్పించుచుండెను. రాత్రు లందు మధురవాసులు సైనికుల కోలాహలముచే నిద్రించుటకు వీలు గాకుండెను. మధుర సామంతులైన మన్నీల సేనలు కలియవచ్చుచుండెను. వీరప్పనాయకుఁడు కోటలో నొక పెద్దవిందుచేసెను. చిక్కరాయలు, రాణి బాయమ్మపుత్రుఁ డనియు, నతఁడే రాయల సింహాసనమునకు సరియైన వారసుఁ డనియు, యాచమనాయకుఁడును, స్వార్థపరుఁ డైన రఘునాథ నాయకుఁడునుగలసి శ్రీరంగరాయలపుత్రుఁడైన రామరాయ లకుఁ బట్టముగట్టి తామే రాజ్యము నేలుకోవలెనని చూచు చున్నారని ప్రకటించెను. అయిన శ్రీవేంకటపతిరాయలవారే తన పుత్రునకు గాకుండఁ సింహాసనమును శ్రీరంగరాయల కేల యిచ్చెనను సూక్ష్మప్రశ్న విన్నవారి కుదయింపక పోలేదు. కాని, యందఱకుఁ దోచిన ప్రశ్నలు వేయుటకు వీలులేదు గదా! వీరప్పనాయకుఁడే యీప్రశ్నకు వింత సమాధానమును జెప్పెను. "శ్రీవేంకటపతిరాయలవారికి మరణశయ్యపై మతి పోయినది. కొన్ని విఘడియలలోఁ బ్రాణము వదలుచున్న రాయల వా రేమిచేసిన ననాలోచితముగ జేసినదే యని చెప్పకతప్పదు. చిక్కరాయలు, రాయలకు ముసలితనమందు జన్మించెను. చాలకాలమువఱకు రాయలకు సంతానము లేదు. మరణకాలమున రాయల కాభావమే. నిలిచియుండి చిక్కరాయలమాట మరచియుండవచ్చును. శ్రీరంగరాయ

లెదురుగఁ గనిపించెను. అతనికి ముద్రిక నందించెను. అదియే సరిగాక పోవుచోఁ జిక్కరాయలకు శ్రీ వేంకటపతిరాయలవారే నామకరణ మహోత్సవము జరిపి యువరాజ మర్యాదల నన్నియు సమకూర్చుట మెట్లు పొసఁగును!! వీరప్పనాయకుని వాక్చాతుర్యమునకు జగ్గరాయలు ఘురిసిపోయెను. సభలో నొకమూల నెవ్వఁడో దగ్గెను. సభయంతయు నిశ్శబ్ద మయ్యెను. వేంకటపతిరాయలు రాణి బాయమ్మ ప్రీతికొఱకై చిక్కరాయలఁ బుత్త్రునిగ నంగీకరించె ననియు, మరణశయ్యపైఁ గుహ నాపుత్త్రుని విడిచి యన్నగారి కొడుకైన శ్రీరంగరాయలకుఁ గిరీట మిచ్చెనని యెవ్వరు బలుక సాహసింపలేదు. దండనా థులు, సేనాపతులు, మంత్రులు శ్రీచిక్కరాయలవారే రాయల సింహాసన మధిష్ఠింప నర్హుఁడనిరి.

చిక్కరాయల కొక యున్నతమైన స్వర్ణసింహాసన మమర్చఁబడెను. తుల్యమైన వేరొక సింహాసనమును వీరప్ప నాయకుఁడధిష్ఠించెను. జగ్గరాయలు, మాచరాయఁడు, తిమ్మా నాయకుఁడు, సేనాపతి, ఓబలరాయఁడు, చినఓబలరాయఁడు, తిరువాన్కూరు చింజి పాండ్యప్రభువులు యథోచితాసనముల నాసీనులై యుండిరి. సామంతులు చిక్కరాయల కానాఁడు కప్పములఁ గట్టి యుడుగరల సమర్పింప నేర్పాటు సల్ప బడెను. కాని, కొందఱు దొరలు చిక్కరాయలకు వందన మాచరించుటకు విముఖులు గావచ్చునని, జగ్గరాయలకు

వీరప్పనాయకుఁడు నచ్చఁజెప్పెను. కావున నుపాయాంతరముఁ గల్పింపఁబడెను. సామంతులు మన్నీలు, కానుకలు, కప్పములు తెచ్చి వీరప్పనాయకునకు సమర్పించిరి. వీరప్పనాయకుఁడు చిక్కరాయలకు వానిని జివరకు సమర్పించెను. సామంతులకు దొరలకు, భటులకు సన్నాహముల సత్వరము ముగించుకొని యుద్ధమునకు సంసిద్ధులై యుండవలెనని వీరప్పనాయకుఁడు హెచ్చరించెను. వీరప్పనాయకుఁడు విందు ముగిసిన తర్వాత జగ్గరాయలను దీసికొని తన ప్రాసాదమును జేరెను.

యాచమనాయకుఁడు రామరాయలతోఁ గుంభకోణ మును జేరెను. రఘునాథనాయకుఁడు వేయి మదపుటేనుగులు, పదివేల గుఱ్ఱపుదళము, నేబదివేల కాల్బలముతో నెదురేగి రామరాయలకు యాచమనాయకునకు స్వాగతమిచ్చెను. రఘు నాథనాయకునితో రామరాయలు "శ్రీరఘునాథనాయకుల వారిగూర్చి యాచమ నాయకులు మాతోనెన్ని యోమారులు ప్రస్తావించె"నని గౌరవపూర్వకముగ బలికి యతని యవ్యాజ సాహాయ్యమునకుఁ గృతజ్ఞతఁదెల్పెను. "శ్రీయాచమనాయకుల వా రెందులకు మీపక్ష మవలంబించెనో యందులకే మేముగూడ శ్రీవారిపక్షమును జేరితి" మని రఘునాథనాయకుఁడుపల్కెను. యాచమనాయకుఁడు రఘునాథనాయకుఁడు గలిసికొని చాలకాలమైనది. "మనము కలిసికొని యుగములు గడచినట్లున్నది. ఈమధ్య కాలమునఁ బ్రపంచమే మారిపోయిన"

దని యాచమనాయకుఁడు రఘునాథునితోఁ బూర్వపరిచయ మును స్మరించుచుఁబల్కెను. "నిజమే! ప్రపంచమురూరినది. మారుచున్నది. మారిపోగలదు. కాని ధర్మము, సనాతనము, నిత్యము, శ్రీయాచమనాయకుని గుండెలో స్పందించు చున్న ధర్మదీక్షయే నాకుగూడ ధర్మరక్షా సందేశమందించిన"దని రఘునాథుఁడు యాచమనాయకుని ప్రశంసించుచుఁబల్కెను. ఉభయ సేనలలోనుత్సాహముపొంగి, భేరీనినాదములు, శంఖా రావములు మత్తేభ బృంహితములు, జవనాశ్వహేషారవ ములు మిన్నుముట్టెను. రామరాయల నొక యేనుగుపై ముత్యాలయంబారీతోఁ గుంభకోణపురవీథుల నూరేగించిరి. రఘునాథనాయకుఁ డశ్వారూఢుఁడై యా యూరేగింపు మును ముందు సాగెను. యాచమనాయకుఁడు రఘునాథుని వెను వెంట మఱియొక గుఱ్ఱముపై సాగివెడలెను. ప్రజలుయాచమ నాయకుని రామరాయలను జూచుటకు సమీప గ్రామ గ్రామాంతరములనుండి తిరునాళ్ళకు వచ్చినట్లు మూఁగిరి. జగ్గ రాయల సేనలోనుండి విడివడి దండనాథులు కొందఱు వచ్చి యాచమనాయకుని సేనలోఁ జేరిరి.

కుంభకోణమునుండి రఘునాథనాయకుఁడు యాచమ నాయకుని రామరాయలను సేనలతోఁ దంజావూరునకు దీసి కొనిపోయెను. తంజాపురీ దుర్గద్వారమందు మంత్రి గోవిందప్ప

వారల కెదురువచ్చి స్వాగతమిచ్చెను. రామరాయల ముత్యాలపల్లకిలోఁ గోటయందలి రఘునాథనాయకుని ప్రాసాదమును జేర్చిరి. శతశతఘ్ని ఘోషములు శ్రీరామరాయలకు స్వాగత సూక్తములు పలికినవి. బ్రాహ్మణులు వేదమంత్రో చ్చారణ పూర్వకముగ నాశీర్వదించిరి. యాచమనాయకున కతిథి గృహము విడిదిగ నేర్పరుపఁబడెను.

యాచమనాయకుఁ డిదివరలోఁ జూచినప్పటికంటెఁ దంజావూరు మారిపోయెను. రఘునాథనాయకుఁ డాపురము నెంతో రమణీయ మొనర్చెను. ఉద్యాన వనములు, తటాకములు, దేవాలయములు, శిల్పములు, హర్మ్యపంక్తులుఁ గ్రొత్త వెన్నియో కన్పించెను. కోటలో 'సరస్వతీమహా' లను పుస్త కాలయము పేర్కొనఁదగినది. అందలి తాళపత్ర గ్రంథముల సంఖ్యాకములు. తెలుఁగు, సంస్కృతము, తమిళము కన్న డము, మహారాష్ట్రము, ప్రాకృతము మున్నగు దేశభాషా గ్రంథములన్నియు సరస్వతి మహాలునందుఁ గలవు. దక్షిణ భారతమునందలి దేశ దేశములనుండి విద్వాంసు లచ్చటి పుస్తకములఁ బరిశీలించుటకు వచ్చుచుండిరి. సరస్వతిమహాలు పండితులకుఁ బుణ్య తీర్థయాత్రా స్థలము. దక్షిణాపథమునకు వాఙ్మయరాజధాని. రఘునాథనాయకుఁ డచ్చటికి వచ్చెడి పండితుల కందఱకు నుచిత భోజన వసతులఁ గల్పించెను. వారి కొఱకై ప్రత్యేకముగ నొక సత్రమును నిర్మించెను. సరస్వతి

మహాలును జూడనిచో నానాటి విద్యార్థులకు విద్యాభ్యాసము సంపూర్తి గా కుండెను. ఆ పుస్తకాలయమున లేని ప్రాచీన గ్రంథమును దెచ్చియిచ్చిన విద్వాంసునకొక యగ్రహారము చొప్పున రఘునాథుఁడు బహూకరించుచుండెడివాఁడు. ఆవిధముగ నౌత్తరాహులుగూడ కొన్ని ప్రాచీన సంస్కృత గ్రంథములఁ దెచ్చియిచ్చి తంజాపురీ రాజ్యమున నగ్రహారముల సంపాదించుకొని స్థిరనివాస మేర్పరచుకొనిరి.

రఘునాథనాయకుఁడు కవి. అతని యాస్థానమున ననేక మహాకవులు విలసిల్లిరి. "అభినవభోజరాజ బిరుదాంకితుఁడు" రఘునాథుఁడు. అతని యాస్థానమునఁ దమిళ కర్ణాటాంధ్ర సంస్కృత పండిత కవులుండెడివారు. చేమకూర వేంకటకవి రఘునాథుని యాస్థానాంధ్రకవి. అతఁడు కవిమాత్ర మేగాదు గంటము నెంత సుకుమారముగ నడిపి కావ్యములల్లునో కత్తినంత కఠోరముగఁద్రిప్పి, శత్రువులఁజీల్చి చెండాడఁగలఁడు. గంటము పట్టినకవి; కత్తిపట్టిన కాలుఁడని యతనినిఁ గూర్చి రఘునాథుఁడే చెప్పెను. అతని తమ్ముఁడు తంజావూరు దళ వాయి. పుత్రులందఱు దండనాథులు 'సకలకళాప్రవీణుఁడైన రఘునాథ భూపాలదత్త హస్తముక్తాకటక విరాజమాన వేంకటకవిరాజప్రణీతము'లని తన కృతుల నభివర్ణించుకొను చుండెడి వాఁడు. చేమకూర లక్ష్మణామాత్యుఁడు, వేంకటకవి తండ్రి పేరెన్నికగన్న దండనాథుఁడు అతఁడచ్యుతప్పనాయ

కునితోఁగలిసి యనేక యుద్ధములందు విజయపరంపరల సాధించెను. రఘు నాథనాయకుఁడతనిని దనహర్మ్యమునకు బిలిపించి రామరాయలకు యాచమ నాయకునకుఁ బరిచయము గల్పించెను. వేంకటకవి యాచమనాయకుని జంద్రగిరిలో నొకమారు దర్శించెను. తిరుపతికి మొక్కుబడి చెల్లించుకొనుటకు వెడలి వేంకటకవి యచ్చటినుండి మల్లయ్య మహాకవిని జూచుటకు జంద్రగిరి జేరెను. మల్లయ్యకవిని వైశాఖపూజా మహోత్సవమునఁ దనసత్కారముల నందుకొన ప్రార్థించుటకై యాచమ నాయకు డాతని గృహమునకు వచ్చెను. వేంకటకవి కా దృశ్యము కన్నులఁ గట్టెను. యాచమనాయకుఁడు వెడలిన తరువాత మల్లయ్యమహాకవి యాతనిగూర్చి పలికిన పలుకులు వేంకటకవి శ్రుతిపథమునఁ బ్రతిధ్వనించుచు స్మృతిపథమున నిల్చియున్నవి. "మన జీవితములలో నద్భుత చరిత్రముల మహాకావ్యములుగ నల్లుటకుఁ బ్రయత్నించె దము. యాచమనాయకుని నిత్యజీవితచరిత్రమే యొక మహా కావ్య"మని మల్లయ్యకవి యానాఁడే వచించెను. 'రవి కాంచనిచోఁ గవికాంచును. మల్లయ్యయాచమనాయకుని భవిష్యజ్జీవిత కథనమును జెప్పఁగలిగెను. పూవుపుట్టగనే పరిమళించును. యాచమ నాయకుని ధర్మవీరతను జాటెడి కథ లనేకములు చంద్రగిరినివాసు లిదివరకే చెప్పు కొనెడివారు. వేంకటకవి యాచమనాయకునినున్మీలితనేత్రుఁడై పరికించెను.

ముఖ్యులైన దండనాథులు, మన్త్రులు, సేనాపతులు కొంద ఱే తెంచిరి. వారల నందఱు రఘునాథుఁడు రామరాయల కెఱింగించెను. రఘునాథుఁడు వారినందఱిఁ దోడ్కొని రామ రాయలకు యాచమనాయకునకుఁ గోటఁజూపించుటకు బయల్వెడలెను.

రామరాయలు, యాచమనాయకుఁడు కోటనంతయుఁ బరికించిరి; బురుజులు, విశాలమైన గోడలు, శతఘ్ని కేంద్రములు, గడియారశాల, మున్నగునవన్నియు దిలకించిరి. సర్వస్వతి మహాలును నర్తనశాలయుఁ జూచిరి. రఘునాథుఁడు భరతవిద్యా నిపుణుఁడు, అతఁడు కట్టించిన యుజ్వల రంగస్థల మానాఁడు విశ్వవిఖ్యాతి నార్జించెను. అందు మూఁడువేల మేలివీణలు, వేలకొలఁది మృదంగములు, కిన్నెరలు, తాంబురాలు మున్నగు జంత్ర వాద్యములుండెడివి. ఆ నర్తనశాలా భిత్తికలపై స్వర్ణ రంజితమైన మనోజ్ఞ చిత్ర లేఖనములు గలవు. ఆ మహావైభవమును దిలకించి యాచమనాయకుఁడు “విజయనగర సామ్రాజ్య ప్రాభవము, రామరాయల వారి కంటె ముందుగనే తంజావూరునకు వలస వచ్చినది. రఘునాథ రాయలకు వీరత్వము, ధర్మదీక్ష, కళోపాసన శ్రీకృష్ణరాయల స్మరణకుఁ దెచ్చుచున్న”దనెను. వేంకటకవి యెదుటి గోడపై నున్న శ్రీకృష్ణరాయల ‘ఉదయగిరి దండయాత్ర’ చిత్ర లేఖనమును జూపెను.

కృష్ణరాయ లుదయగిరి దుర్గముపై దండెత్తెను. ఆ దుర్గ మభేద్యమైనదని ప్రసిద్ధికెక్కెను. గజపతి రుద్రమ దేవచక్రవర్తి పితృవ్యుఁ డుదయగిరి పాలకుఁడు. కృష్ణరాయ లా దుర్గమును భేదించి, తత్పాలకుని శిరమును దన్నిగాని, స్నానము సలుపకుండ శపథము పట్టి యుదయ గిరిని స్వయముగఁ దాకెను. దుర్గాధిపతి ద్వారములఁ దెరచి రాయల శరణుఁ జొచ్చెను. శరణని వచ్చిన రాజు తలదన్ను టెట్లు? కృష్ణరాయలాతని కిరీటమును దన పాదపీఠికపై బెట్టించి దానిని దన్ని తన ప్రతిజ్ఞఁ గాపాడుకొనెను. రాయలు కిరీటమును దన్నుచున్న చిత్రలేఖన మా కుడ్యమున మనోజ్ఞముగ చిత్రింపఁబడి యుండెను. యాచమనాయకుఁడు, గద్గద కంఠముతో “విద్యానగర సామ్రాజ్యమున కీనాఁడెట్టి గతి పట్టినది. ఇంకను రఘునాథనాయకుని వంటి వారచ్చటచ్చట మరువలేక గోడలపైఁ జిత్రములు చెక్కించు కొనినా”రని విషాదపరవశుఁడై పలికెను. రఘునాథనాయకుఁడు, మెల్లగ గంఠమెత్తి “అస్తమించె సూర్యుఁడు. లోకమున కిక వెలుఁగు నిచ్చెడి వారెవరని ప్రశ్నించెను. ఓపినంతవర కున్నానని ప్రమిద మిణుకు మిణుకు కాంతులతో బదులు పలికెను. జగచ్చక్రముఁ ద్రిప్పుట కెవరోరాజు లుద్భవించుచుందురు. కాని నక్షత్రములు నక్షత్రములే. మిణుగురు పుర్వులు మిణుగురు పుర్వులే”యని వచించెను. యాచమనాయకుఁడు “రఘు

నాథనాయకుని నేను జిన్నతనమందుఁ బదునాఱేండ్ల బాలునిగ జూచితిని. ఎందుచేతనో యానాఁడు శ్రీకృష్ణరాయలపేరే స్మరణకు వచ్చినది. ఇప్పుడీకోటను జూచుచున్నను శ్రీకృష్ణరాయలే స్మరణకు వచ్చె"నని రఘునాథుని ప్రశంసించెను.

సాయంకాలమునఁ గోటలో రఘునాథ నాయకుఁడు గొప్పవిందుచేసెను. ఆ విందులో రామరాయల నత్యున్నత సింహాసనమున నాసీనుని గావించెను. సామంతులు మన్నీలు. రామరాయలకుఁ గప్పములు కానుకలు సమర్పించిరి. దండ నాథులు, సేనాపతులు శత్రువుల నోడింపఁ బ్రతిజ్ఞఁ గైకొనిరి. రాత్రినర్తనశాలలోఁ బ్రదర్శనములు, అందువేంకటకవి వ్రాసిన శ్రీరంగరాయ నిర్యాణమును యక్షగానమును జక్కుల వా రాడిరి. చినయోబలరాయని కఠోరవాక్కు లు, శ్రీరంగరాయల యాత్మహత్య సదస్యులను విషాద పరవశులను జేసెను. కంటనీరు పెట్టని భటుఁడొక్కఁడునులేఁడు. కొందఱు భటులు కత్తులుదూసి రంగభూమిపై లంఘించిరి. దండనాథులు కొందఱు వారి నుపశమింపఁజేయుట కెంతయో ప్రశమించిరి. ఆ యక్షగానమును రాజ్యము నందంతట వీథినాటకముగఁ బ్రదర్శింప రఘునాథనాయకుఁ డాజక్కులవారి కాజ్ఞాపించి వారికి ధనరాసులను బహూకరించెను. ఆ విషాదగాథనే మఱునాఁడు బుఱ్ఱకథగ జంగములు పాడి వినిపించిరి. వారినిగూడరాజ్యము నందంతట ప్రచారమునకై పంపెను.

రఘునాథనాయకుఁడు మఱునాఁడు కొలువుదీర్చెను. వందిమాగధులు శ్రీరామరాయల, విద్యానగర రాజబిరుదా వళుల నుగ్గడించి ప్రశంసించిరి. రఘునాథుని కొలువుమిక్కిలి రమణీయముగ నుండెను. కుందనపుఁ బసిడికుళ్ళాయి బగలపై జీకట్ల నిగనిగలు జౌకళించు చుండెను. రత్నఖచిత స్వర్ణసింహాసనమున ముత్యాల ఛత్రము కెంపులు వజ్రాలు పట్టుబుట్టములు నానిండుకొలువునఁ గన్నులపండువు సేయుచుండెను. దొరలు, సామంతులు, మన్నీలు కైంకర్యములు సల్పుచుండిరి. వారలకు రఘునాథనాయకుఁడు, రామరాయల యాగమన ప్రయోజనమును యాచమనాయకుని ధర్మరతో దీక్షను వివరిం చెను. 'చిన్నతనములోఁ శ్రీకృష్ణదేవరాయలు నాస్వప్న సామ్రాజ్య చక్రవర్తి. చంద్రగిరి కోటలోఁ, గడచిపోయిన యాశకమునకు జెందిన వీరుఁడెవ్వఁడైన గన్పించునాయని యన్వేషించితిని. యాచమనాయకుఁడొక్కఁడే నా హృదయమున కాయుజ్వలయుగమునకు జీవత్ప్రతినిధియని తట్టెను. అప్పుడా మహావీరుని మీసములు నన్నాకర్షించిన'వని రఘునాథుఁ డుపన్యసించుచుండ వృద్ధమంత్రి గోవిందప్ప యర్థవంతముగ దగ్గెను. రాజవాక్కులలో విరామమేర్పడెను. వృద్ధులైన సదస్యులకది యర్థమైనది. రఘునాథుఁడు చిఱునవ్వుతో "నేఁడు యాచమనాయకుని నేత్రద్యుతులు నన్నాకర్షించినవి. ఆ కనుగొల్కుల వెల్గు ధర్మతేజోస్రవంతి, పరాక్రమవాహిని

త్యాగప్రవాహము, సంగమించిన పవిత్ర ప్రయోగమే"యని సింహాసనమున నాసీనుడయ్యెను. సభ్యులందఱుత్సాహోద్రేక పూరితులైరి. యాచమనాయకుఁడు నిండుకొలువులో రఘునాథుని ధర్మదీక్షను దంజావూరు సేనల పరాక్రమము నుగ్గ డించి విజయము సాధింపఁ బ్రబోధించెను. రఘునాథుఁ డందర యుద్ధసన్నాహములలో నిమగ్నులై యుండ నాజ్ఞా పించి పేరెన్నికఁగన్న వీరుల యథోచితముగ సత్కరించెను.

ఆనాఁడు రాజనర్తకి మధురవాణి యభినయము సల్పెను. ఆమె కవయిత్రిఁ గాయని, రఘునాథ నాయకుని గేయముల నామె యభినయించెను. మధురకవితా మార్దవమునకు వన్నె పెట్టెడి యామె కిన్నెర కంఠము శ్రోతలను వేరొకలోకమును జేర్చెను. ఆ హస్తవిన్యాసములు, శింజినీ మంజుల శింజితములు, కంకణకింకిణీ కలనిక్వణములతో శ్రుతి గల్పిన యామె భ్రూలతా విక్షేపమునకు, చిన్నారి మిటారి వాలుచూపులు రసజ్ఞుల నానందసాగరమున దారి తప్పిన యున్మత్త పథికులఁ జేసెను. రఘునాథుడామెకు ముత్యాలహారము నొసంగి సత్కరించెను. సభ్యు 'లెంతకాలమునకు మధుర వాణి లాస్యమును జూడగల్గితి'మని యానందించిరి. ఆమెరాజా నుగ్రహమునకుఁ బాత్రమైన తరువాత నభినయ ప్రదర్శనము లందు పరాఙ్ముఖి యయ్యెను. ఆమెకొక మహాహర్మ్య పంక్తి కలదు. ఆమె దాసీబృందము రెండువేలకు మించియుండెను.

ఆమె యాదాయము రెండులక్షల వరహాలు. ఆ నాఁడామె యభినయమును శ్రీరామరాయల యాగమన గౌరవార్థము రఘునాథనాయకుఁ డేర్పరచెను. యాచమ నాయకుఁడు “కొన్ని సంవత్సరములనుండి యెఱుఁగని సంతోష విశ్రాంతి నానాఁడు బొందితి”నని రఘునాథునకుఁ గృతజ్ఞతఁ దెలిపెను.

రఘునాథనాయకుఁడు కొలువు చాలించి శ్రీరామ రాయలను యాచమ నాయకుని దన ప్రాసాదమునకుఁ దీసికొని పోయెను. ముఖ్యదండనాథులు వేంకటకవి యారాత్రి రాజ ప్రాసాదోపరిభాగమునఁ జంద్రకాంత శిలావేదికపైఁ గూడిరి. రఘునాథనాయకుఁడు యాచమనాయకుఁడు కర్తవ్యమును గూర్చి వ్యూహములను గూర్చి వారితోసంప్రదించిరి. తుదకు సేనలతో వీరప్పనాయకునిపై దండెత్త నిశ్చయించుకొనిరి. ఇదివర కెన్నియో మారులు వీరప్పనాయకుఁడు తంజా వూరు సేనలచే నోడింపబడియుండెను. అప్పుడు విజయనగర సేనలు సామంతు లందఱుఁ గూడి యుండిరి. కాని యిపుడు వీరప్పనాయకునితో జగ్గరాయాదులే గాక సామంతులు కొందఱుచేరిరి. అయినను యాచమనాయకునివంటి పేరెన్నిక గన్న మహావీరులు జిగీషతో ధర్మరక్షణకు దీక్షవహించిరి. కావున సత్వరమే దండయాత్ర నారంభింపఁ దీర్మానించిరి. రఘునాథుఁడు దండనాథుల నభినందించి వీడ్కొలిపెను. అతఁడు, రంగరాయలు, యాచమనాయకుఁడు, వేంకటకవితో

గలసి అభ్యంతరగృహమున శయనించుటకు మేడమెట్లు దిగ సాగెను. "పౌరులందఱు నిద్రించుచున్నారు. ఇంతటిచక్కటి యామని వెన్నెలలో గుండెలేని గ్రుడ్డి లోకమెట్లు నిద్రించు చున్నదో" అని రఘునాథుఁడు వేంకటకవితో బల్కెను. వేంకటకవి "వసంతుఁడు మ్రాకులు చిగుర్ప రసోప గుంభిత వాసనలు వెలార్పగ మెచ్చక చంద్రుఁడు మిన్నునఁ బ్రసన్నతయు సౌకుమార్యముఁ గనబడ ఊాల్ గరగంగఁ జేసెను. ఏగతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చ రేగదా" యనెను. రఘునాథుఁడు ముత్యాల హారమునుదీసి కవికంఠము నలంకరింపఁజేసెను. వారు రఘునాథనాయకుని గదిలో హంస తూలికాతల్పముల శయనించిరి. వారికి మెలమెల నిద్రపట్టెను. జ్యోత్స్నా సౌందర్యములు చలువ వెలుఁగు వాకలై భూ నభోంతరాళముల వెల్లివిరిసెను. పురమంతయు నిద్రించుచుండెను. రేయి నిద్రాదేవి సామ్రాజ్యము. విశ్వశిల్పి నిద్రను సృజించి యెల్లజీవులచెంత సౌఖ్య మొనగూర్చెను. క్షణికవిష యములకై విపణివీథులఁ బ్రాకులాడు వెర్రిజను లెవ్వరచ్చట నిప్పుడులేరు. తెరువరులు వీథులలో మార్గాయాసమును మరచి నిద్రించిరి. విగత భర్తృకలుజీవితభారమును మరచి గాఢ విశ్రాంతిఁజెందిరి. కారాగారమున బందీకృతులు శృంఖలాభారమును సరకుగొనక కనుమూసిరి.

నిద్రాదేవి సుకుమార హస్తస్పర్శ మెంత సుందర సౌఖ్యసుషమా మాధుర్యతరంగితము!

---

# నవమాశ్వాసము

~~~~~

యాచమనాయకుఁడు శ్రీరంగమున కేగి కస్తూరిరంగని సేవించి పూజ సలుప వలెనని రఘునాథనాయకునితో నివేదించెను. రఘునాథనాయకుఁడు తన సేనల నన్నిటి నప్పటికే యుద్ధమునకు సంసిద్ధ మొనర్చి యుంచెను. అయినను, వీరప్ప నాయకుని వ్యూహములు తెలిసికోకుండఁగ రాజధానిని వీడుట మంచిదాయను సందేహము గల్గి గోవిందప్ప మంత్రిని, గోటను రామరాయలను సంరక్షింప నియమించి యాచమ నాయకునితో సైన్యములతో శ్రీరంగ మార్గమును బట్టెను.

రఘునాథుని సేనలు మార్గమధ్యమున శిబిరములను నిర్మించుకొని విడసినవి. రఘునాథుఁడు యాచమనాయకుఁడు ప్రచ్ఛన్నవేషధారులై శ్రీరంగేశ్వరుని దర్శింప పాదచారులై యేగిరి. అచ్చటఁ గావేరి రెండుపాయలుగఁ జీలి తిరిగి కలసినది. ఉభయ కావేరి మధ్యస్థలమున వెలసిన దివ్యస్థలము శ్రీరంగము. నూటయెనిమిది దేవాలయములుగలవు. శ్రీరంగేశ్వరునకు సప్తప్రాకార విలసితమైన యాలయము గలదు. శ్రీరఘునాథనాయకుని తండ్రి యచ్యుతప్పనాయకుఁడు శ్రీరంగేశ్వరుని భక్తుఁడు. అతఁడు కళ్యాణమంటపమును, బంగరు విమానమును, ధ్వజస్తంభము నెత్తించి, శ్రీరంగనికి మణి ఖచిత స్వర్ణ కిరీటమును సమర్పించెను. శ్రీరంగనాయకులు
~~~~~

తంజాపురీ నాయకుల యిలువేలుపు, రఘునాథుని తండ్రి కట్టించిన విమాన మంటపాదులను కిరీటమును రహస్యముగ యాచమనాయకునకుఁ జూపించెను. యాచమనాయకుఁడు భక్తిపరవశుఁడై శ్రీరంగనికి నిమీలిత నేత్రుఁడై సాష్టాంగ దండ ప్రమాణము లాచరించెను. అతఁడు, రఘునాథనాయకుఁడు తీర్థప్రసాదము స్వీకరించి చిలుకల మంటపమునకు వచ్చిరి. చిలుకలు "రంగ రంగ రంగా కస్తూరిరంగా కావేటిరంగ రంగ" యనుచు గలకల రుతముల రంగధాముని నామ పారాయణ జేయసాగినవి. యాచమనాయకుఁడు చిలుకలకుఁ బొంగలి వేయుచు వినోదించు చుండెను.

ఇంతలో రఘునాథుని దండనాథుఁడు వచ్చి వీరప్ప నాయకుని సేనలు మధురనుండి కదలుట కారంభించినట్లు వేగులవలనఁ దెలిసినదని యెరింగించెను. యాచమనాయకుఁడు రఘునాథనాయకుఁడు జకచకఁ బ్రాకారములు గడచి యశ్వారూఢులై దూరమున విడిసియున్న సేనలఁ గలిసికొనుటకు వేగముగఁ దరలిపోయిరి. శ్రీరంగమునకుఁ బ్రక్కనున్న తిరుచిరాపల్లి మధురనాయకుని రాజ్యసీమలోని ముఖ్యసేనా కేంద్రములలో నొకటి. రఘునాథ యాచమనాయకు లిరువురు శ్రీరంగేశునే స్మరించుచు దూరమున విడిసిన సేనల జేరుకొని భగవంతునికి వందనము లర్పించిరి. వారు సేనల కదల్చుకొని తంజావూరును జేరఁబోయిరి.

వీరప్పనాయకుఁడు మధురలో యుద్ధసన్నాహములను ముగించుకొని దండయాత్ర కుపక్రమించెను. ఆ మహాసేన మూఁడు ముఖ్యవ్యూహము లయ్యెను. పురోభాగమున సామంత దండనాథులు మధ్యభాగమున జిక్కరాయలను గాయుచు జగ్గరాయలు తిమ్మానాయకుఁడు మున్నగువారు; పశ్చాద్భాగమున వీరప్పనాయకుఁడు సేనలతో నుండునట్లు నిశ్చయించుకొనిరి. ఏనుగులు, గుఱ్ఱములు, లొట్టిపిట్టలు, శతఘ్ని శకటములు, భటులు, వారివెనుక కమ్మరులు, వడ్రంగులు, మున్నగు పనివాండ్రు దండు వెడలునప్పుడు సేనా వాహిని మధురానగరమునుండి రెండు యోజనములు విడివిగ నుండెను. దండనాథుల ముంగలిసేన తంజాపురి దుర్గమును ముందరి భాగమునుండి ముట్టడింప వలెను. వెనుకనుండి వీరప్ప నాయకుఁడు దండెత్తును. జగ్గరాయాదులు చిక్కరాయలఁ గావేరీతీరమున సంరక్షించుచుండి, తగిన తరుణమునఁ దంజావూరు ముట్టడిలోఁ జేరవచ్చును. లేదా వీరప్ప ప్రభృతులు జగ్గరాయాదులఁ గలసికోగలరు. ఇది వారి యుద్ధవ్యూహము.

సామంత దండనాథుల సైన్యములలోఁ దుండీర మండలేశ్వరుఁడు పాండ్యరాజు పేర్కొనఁదగిన వారు. వారిద్దఱు వ్యూహప్రణాళిక ననుసరించి తంజావూరు కోటను ముట్ట డించిరి. గోవిందప్ప కోటబురుజులపై శతఘ్నుల నెత్తించి రఘునాథనాయకుని రాకకై నిరీక్షించుచుండెను. పాండ్య

తుండీర రాజుల కోటలోని దండనాథులెవ్వరు ప్రతిఘటింపక బోవుటఁగాంచి రఘునాథనాయకుఁడు దుర్గద్వారములమూసి దాగియుండెనని తలపోసి శతఘ్నిరావములతోఁ దంజాపురి దుర్గమును దాకిరి. అంతలోఁ వెనుకనుండి సేనఁతో రఘు నాథనాయకుఁడు ప్రత్యక్షమయ్యెను. రఘునాథునిగాంచి కోటబురుజులపైనుండి గోవిందప్పమంత్రి శతఘ్ని గోళముల వర్షింపసాగెను. ముందు గోవిందప్ప వెనుక రఘునాథుఁడు తుండీర పాండ్యప్రభువుల సేనలు పీనుగుపెంటలై కూలెను. చావఁగ మిగిలిన భటులు హాహాకారములతోఁ దప్పించు కొనుటకు సందులేక చెల్లాచెదరై రఘునాథనాయకునకుఁ జిక్కిరి. పాండ్యరాజు పారిపోయెను. రఘునాథుఁడు గుఱ్ఱము నెక్కి తుండీరమండలేశ్వరుని శిబిరముపై విజృంభించి యతని సేనల జీల్చి చెండాడసాగెను. తుండేరరాజు ప్రాణభీతిచే మరణించిన యొక యేనుఁగు దంతము మాటున డాగెను. ఒక సైనికుడదిఁ గ్రహించి యతనిని రఘునాథనాయకునకు బట్టియిచ్చెను. అతఁడు కరుణించి "వెన్నిచ్చి భీరులై పారి పోయినవానిని, ప్రాణభీతిచే దాగినవానిని సంహరింపము. ఇఁకనైన బుద్ధిగలిగి మెలఁగు"మని తుండీరరాజునకు హితవు గఱపి, కావేరీతీరమున నతని విడిచిపెట్టగ దండనాథుని కాజ్ఞా పించి కోటలోనికి విజయోత్సాహముతోఁ బ్రవేశించెను.

పారిపోయిన పాండ్యరాజు వీరప్పనాయకునకు జరిగిన వృత్తాంతమును విన్నవించెను. అతఁడు సేనలతోఁదుండీర ప్రభు

వునకుఁ దోడ్పడవచ్చెను. కాని యాచమనాయకుఁడామార్గము ననే పేచియుండి యొక రాత్రిపేళ వచ్చుచున్న వీరప్పనాయకుని సేనలపైఁబడి చీకాకుఁ జేసిపైచెను. ఆకస్మికముగ మీద బడిన యాచమనాయకుని ధాటి కాగలేక వీరప్పనాయకుని సేనలు చెల్లాచెదరైపోయెను. యాచమనాయకుఁడు సేనలతోఁ దంజావూరు కోట నారాత్రియే చేరెను. వీరప్పనాయకుఁడు చెదరిపోయిన సేనలఁగూడఁ దీసికొని జగ్గరాయాదుల కలిసికొనుట కారేయి పయినింపసాగెను. కావేరీ తీరమును జేరుసరికి వారికొక వింతదృశ్య మగుపించెను. తోకచివర మందుచున్న తాటియాకులు తైలాంబరములతో నొకగాడిద బెదరి పెట్టిగంతులు పైచుచుఁ బారిపోవుచుండెను. ఆగాడిదపై రెక్కలువిరిచి కట్టఁబడిన మనుష్యుఁడుండెను. వీరప్పనాయకుని దండనాథులాదృశ్యమును జూచి, పొట్టచెక్కలగునట్లు నవ్వసాగిరి. వీరప్పనాయకుని యాజ్ఞానుసారము భటులాగాడిదను బట్టి తెచ్చిరి. ఆ గాడిదపై నున్న పురుషుఁడు తుండీర మండలేశ్వరుఁడే. వీరప్పనాయకుఁడతని కట్లు విప్పించి శీతలో పచారములు చేయించెను. అతఁడు మెల్లగఁ దేరుకొని జరిగిన యుదంతమును వివరముగ వీరప్పనాయకునకు నివేదించెను. వీరప్పనాయకుఁడు, “అయిన నీ గాడిద బుద్ధియేమి? రఘునాథుఁ డుదారుఁడనుకొంటిమి!?” యని విచారించెను. తుండీర రాజు “ఈవిషయము రఘునాథునకుఁదెలియదు. జేతికి జిక్కిన

నన్నతఁడువిడిచి పెట్టుమని యాజ్ఞాపించెను. భటులువిడిచిపుచ్చు టకై నన్నుఁదీసుకొని వచ్చుచుండఁగ నెవరోకవియఁట! వేంకట కవియఁట! అతఁడెదురుపడి యీ యుపాయమునుఁజెప్పి గాడిద తోకకుఁ గట్టుట కాతని యుత్తరీయమును బహుమాన మొసగెను. ఆ భటులు కేరింతములుగొట్టి నన్ను రాత్రి యగువర కొక చెట్టునకుఁగట్టి తరువాత నీవిధముగఁ జేసిరి. వారి పొగరు బోతుదనమునకు మన్ను మిన్నులు చాలుటలేదు. ఆ భటులలో నొకఁడు చిత్రకారుఁడట! కోటను జేరి యీచిత్రమును నర్తనశాలాకుడ్యములపైఁ జిత్రించెదనని యుప్పొంగిపోయెను. ఇది వారి వింతధోరణి" యని మందస్వరమునఁ దన యాత్మ కథ వివరించెను.

వీరప్పనాయకుఁడు తుండీరరాజును దీసికొని జగ్గరాయలను గలిసికొనెను. వారందఱు రేయెల్ల మంతనములు సలిపి బయలు దేరిన వేళ మంచిదిగాదని నిశ్చయించుకొనిరి. రఘు నాథనాయకు నోడించుటకు నుపాయము నన్వేషింప సాగిరి. రాజధాని మధురాపురి దూరమైపోయెను. యుద్ధము తంజావూరు సమీపముననే జరిగెను. రఘునాథునకు స్థానబలము. ఈసారి తంజావూరును ప్రచండముగ ముట్టడించుటకు వారు తీర్మానించుకొనిరి. ఆ సమయమున దూరమున నున్న మధుర పైనే యాచమనాయకుఁడు. విజృంభింప వచ్చును. అందుచే

వీరప్ప యుద్ధతంత్ర కారణములచే రాజధానిని మధురనుండి తిరుచిరాపల్లికి మార్చుటకు నిశ్చయించెను. అందఱు సమ్మతించిరి. యతని వ్యూహాభినివేశమును ప్రస్తుతించిరి. వీరప్ప నాయకుఁడు జగ్గరాయాదులను సేనలతోఁ దిరుచిరాపల్లికిఁ బంపి తాను మధురాపురిచేరి రాజధానిని మార్చుటకు విపుల సన్నాహముల నొనర్చుచుండెను. మధురనుండి సేనలు గజయూథములు శకటములు రేయిబవలు తిరుచిరాపల్లి జేరినవి. రాజపరివారము రాజధానిలోని ప్రముఖ వర్తక బృందము వేశ్యాంగనలు తిరుచిరాపల్లికి దమ యావాసముల మార్చిరి. మహాసేనావాహినితో వీరప్పనాయకుఁడు తిరుచిరాపల్లి కోటను బ్రవేశించెను. జగ్గరాయాదులందఱు కలిసి తిరిగి యుద్ధప్రయత్నము లారంభించిరి.

తంజావూరునందు రఘునాథనాయకుఁడు యాచమ నాయకుఁడు భవిష్యత్కార్యక్రమము నాలోచింపసాగిరి. అప్రయత్నముగ లభించిన తొలిగెలుపు వారిసేనల కపరిమితోత్సాహము గల్పించెను. రఘునాథనాయకుఁడు యాచమ నాయకుఁడు రామరాయలు నర్తనశాలకు వినోదార్థమేగిరి. అచ్చట నొక గాడిదపైనున్న తుండీర ప్రభువు చిత్రమువారి కగుపించెను. రఘునాథుఁ డా చిత్రమునుగూర్చి ప్రశ్నింప వేంకటకవి 'గార్దభవాహనుని' వృత్తాంతమునుబద్యరూపమున వినిపించి సదస్యుల రంజింపఁ జేసెను. మధురానగరమునుండి

రాజధానిని తిరుచునాపల్లికి మార్చిన సంగతియు వీరప్పనాయ కుని సమరసన్నాహములను వేగులు రఘునాథనాయకునకు నివేదించిరి. అతఁడు, యాచమనాయకుఁడు, రామరాయలు నర్తనశాల వీడి దండనాథుల సమావేశపరచిరి. “ఈసారి ప్రత్యక్ష యుద్ధమున నంతిమ నిర్ణయమును సాధింపవలె” నని రఘునాథనాయకుఁడు ప్రబోధించెను. “ఈసారివిజయమోవీర స్వర్గమో! తేలిపోవలె”నని యాచమనాయకుఁడు గర్జించెను. భటులు శంఖములు పూరించిరి. భేరీకాహళ నినాదములు మిన్నుముట్టెను ఆనాఁటిరేయి రఘునాథనాయకుఁడు యాచమ నాయకుఁడు దండనాథులతో వ్యూహనిర్మాణములనుగూర్చి ప్రస్తావించిరి.

ప్రాతఃకాలముననే తంజావూరుకోటనుండి సేనలుదండ యాత్ర కుపక్రమించినవి. భేరీనినాదములు దిక్కులుపిక్కటిల్లి భూనభోంతరాళములు ప్రతిధ్వనించెను. రఘునాథనాయకు డుత్తమవిప్రులకు శ్రీరాయలపేరుమీఁద నగ్రహారముల దాన మొసంగెను. విప్రులు వేదమంత్రములతోఁ రాయలకు రఘు నాథునకు సేనలకు విజయ పరంపరలు లభింప నాశీర్వదించిరి. అశ్వముల హేషారవములతో మత్తేభయూథముల బృంహిత నినాదములతో రుద్రవీణా నినాదములతో సేనలు కదలినవి. కొంత దూరమేగుసరికి దవ్వుదవ్వుల వీరప్పనాయ కుని సేనలు కన్పించినవి.

ఉభయసేనలు సింహనాదములతో శంఖారావము లతో భేరికాహళ నిస్వనములతో హాహాకారములు చెలఁగ, రెండుసముద్రములు ఢీకొనునట్లు, చరిత్రలోఁ జిరస్మరణీయ మైన తోపూరు గ్రామప్రదేశమున దాకినవి. భీకర సంగ్రా మము చెలరేగెను. రెండు సేనలును భయంకరముగఁ బోరాడ సాగెను. తోపూరు రణక్షేత్రమున నానాఁడు కూడిన భటు లసంఖ్యాకులు. వీరప్పనాయకుని సైన్య మాఱులక్షలనుమించి యున్నది. రఘునాథుని సైన్యము నాలుగులక్షలకు మించెను. మధ్యాహ్నా మగుసరికి యుద్ధభూమియం దెచ్చటఁ జూచిన పీనుఁగులే ! వికలాంగుల దీనారవములే! తెగిపోయిన మొండెములు, చచ్చిపోయిన యేనుగులు, గుఱ్ఱములు, విరిగిపోయిన శకటములు, గుట్టలు గుట్టలుగఁ బడియుండెను. యాచమనాయకుఁడు విజృంభించి జగ్గరాయలున్న శ్రేణి భేదించి సింహానాదముసల్పి శంఖమునొత్తెను. అతని సేన లుత్సాహావేశముతో జగ్గరాయల సేనలఁ జీల్చి చెండాడెను. అతనికి సాహాయ్య మొనర్ప నతని తమ్ముఁడు చినయోబలరాయఁడు వీరప్ప నాయకుఁడు చేరిరి. కాని, విజయోత్సాహముతో విజృంభించిన యాచమనాయకుని సేనలకుఁ జిక్కి జగ్గరాయలు మరణించెను. సోదరుని మృతకళేబరమును జూచి చినయోబల రాయఁడు యుద్ధక్షేత్రమును వీడి పారిపోయెను. అతని ననుసరింప జూచిన చిక్కరాయలను రఘునాథ నాయకుని దండ

నాథుఁడు సంహరించి యాతని శిరమును జగ్గరాయల శిరమును బల్లెములకు గ్రుచ్చి మదపుటేనుగు ఫాలభాగమునఁ గట్టి వీరప్పనాయకుని సేనలోనికి వదలెను. ఆ సేనలు చెదరి పోసాగెను. రఘునాథనాయకుఁడు శతఘ్ని శకటముల నొడికముగఁ ద్రిప్పి మధుర సేనలపై నగ్నివర్షము కురిపించెను. అశ్వారూఢులై రఘునాథనాయకుఁడు యాచమనాయకుఁడు వీరప్పనాయకుని సేనల దరిమి తరిమి గొట్టిరి. తిమ్మానాయ కుఁడు పారిపోయెను. మాచరాయఁడు యుద్ధమున మరణించెను. వీరప్పనాయకుఁడు మిగిలిన సామంత దండనాథులతోఁ యుద్ధ భూమినుండి నిష్క్రమించి తిరుచురాపల్లికోటఁ జేరెను.

రఘునాథనాయకుఁడు యాచమనాయకునితో విజయోత్సాహముతో శ్రీరామరాయలముందిడికొని, సేనలతోఁగదలి రాత్రియగుసరికి గావేరీతీరమునుజేరి విశ్రమించుటకు స్కంధా వారములు నిర్మించిరి. రఘునాథనాయకుఁడు యాచమ నాయకుఁడు తక్కినవీరులును రక్తసిక్తములైన తమ ఖడ్గములను గావేరి తోయములఁ గడిగిరి. ఆ రేయెల్ల యాచమనాయకుఁడు క్షతగాత్రులకు వికలాంగులకు వైద్యులతోఁ గలిసి యుపచారములు సల్పెను. శ్రీరామరాయలు, రఘునాథనాయకుఁడు భటులనందఱఁ 'గలిసికొని కుశల భాషణముల న నందించిరి. వేంకటకవి, "నేలయీనినయట్లు నిలిచిన పైరు బంచబంగాళమై పాఱదరిమి"న రఘునాథునిగూర్చి య

రేయి నిద్రింపక 'సమరనిశ్శంక రఘునాథ సాహసాంక' యను మకుటమున సీసమాలికల నల్ల నారంభించెను.

తెల్లవారెను. బాలభానుని యరుణ కిరణములతో మిలమిలలాడి పోవుచున్న కావేరీ సలిలములలో భటులు గ్రుంకులిడిరి. మత్తేభములను, గుఱ్ఱములను, లొట్టిపిట్టలను నదిలో దింపి కడుగసాగిరి. శ్రీరామరాయలు, శ్రీరఘునాథుఁడు, యాచమ నాయకుఁడు స్నానమొనరించి పీతాంబరముల ధరించి యాశ్విక దళమునకు ముందు నిలిచిరి. మహాసేనా సమూహ మంతయుఁ గదలి తంజావూరునకు పయనించెను. తంజాపురీదుర్గ ద్వారముల మంత్రి గోవిందప్ప వారి కెదురువచ్చి స్వాగత మిచ్చెను. కోటబురుజులపై శతఘ్నిరావములు విజయవార్తను ఘూషించినవి. తంజాపురి రాజవీథులనూరేగి సేనలతో వారు రాజప్రాసాదమును జేరిరి.

రాజప్రాసాదమున కొలువుకూటమున శ్రీరామరాయలు రఘునాథనాయకుఁడు మణిస్థగిత కాంచనవేదికల నధిష్ఠించిరి. యాచమనాయకుఁడు, వృద్ధమంత్రి గోవిందప్ప, యుచితాసనముల నధిష్ఠించిరి. వందిమాగధులు రఘునాథనాయకుని రామ రాయలను, వంశక్రమాగత బిరుదావళులు పఠించి ప్రశంసించిరి. గోవిందప్ప నిలిచి రఘునాథనాయకుని రామరాయలను యాచమనాయకుని దండనాథులను భటులను ప్రశంసించి యభినందించెను. యాచమనాయకుఁడునిల్చి రఘునాథ

నాయకుని సాహాయ్యమునకు శ్రీరామరాయల పక్షమున గృతజ్ఞతనుదెల్పెను. మంత్రిగోవిందప్పను బేర్కొని, వృద్ధ మంత్రి "యప్రతిహత సంకల్పుఁడు, గోవిందప్ప మంత్రి యాశీస్సులు కష్ట సముద్రమున రామరాయల పక్షమునకు ధ్రువతారాకారరోచిషు లైనవని పల్కెను. రఘునాథనాయకుని పరాక్రమాచంద్రార్కముగఁ జరిత్రలో నిలిచిపోవు" నని గంభీరస్వరమునఁబలికెను. రఘునాథనాయకుఁడు యుద్ధములో బరాక్రమమును ప్రదర్శించినవీరుల బహూకరించిన పిమ్మట కొలువు చాలించెను.

మఱునాడేరామరాయలు యాచమనాయకుఁడు రఘు నాథనాయకునితోఁ గలిసి చంద్రగిరికిఁ బ్రయాణముసాగించిరి. మార్గమధ్యమున విడిచిన చోటులందెల్ల ప్రజలువారికి స్వాగత మిచ్చిరి. యాచమనాయకుని గ్రొత్తరాయలైన శ్రీరామ రాయలను చూచుటకుఁ దండోపతండములుగఁ బ్రజలు గుమికూడుచుండిరి. చంద్రగిరిపౌరులు దుర్గద్వారములను దెరచి, శ్రీరామరాయలకు యాచమనాయకునకు రఘునాథ నాయకునకు నెదురువచ్చి కర్పూరనీరాజనములతో ఘనమైన స్వాగతమిచ్చిరి. రామరాయలు కోట విడిచి పారిపోయిన వారలు నిశ్శంకముగ దిరిగి రావచ్చుననియు, స్వచ్ఛందముగ బశ్చాత్తాపమునఁ దన్నుజేరినఁ బూర్వశత్రువులనైన క్షమింఁచెద ననియుఁ బ్రకటించెను.

రఘునాథనాయకునకును రాజప్రాసాదమునందే విడిది యేర్పాటు గావింపఁబడెను. యాచమనాయకుఁడు స్వగృహమును జేరుకొనెను. అతఁడు శ్రీరామరాయల పట్టాభిషేకమునకు సకలసన్నాహములను సల్పుటలో నిమగ్నుఁడై యుండెను. దూరసీమలనుండి ప్రజలు పట్టాభిషేకమునకు దరలివచ్చు చుండిరి. చంద్రగిరికోట యుజ్వలముగ నలంకరింపఁబడెను.

పట్టాభిషేక ముహూర్తమునకు మూఁడు దినములు ముందుగనే రాజపురోహితుఁడు ప్రాసాదమునుజేరెను. అతనికి సహకరింప విప్రపండితు లనేకులు విచ్చేసిరి. తెల్లవారిన ముహూర్తము. గంగా, యమునా, గోదావరి, కృష్ణా, తుంగభద్రా, కావేరీ, మహానదీ ప్రభృతి పుణ్యనదులనుండి జలములను వేదపండితులు దెచ్చిరి.

సూర్యోదయ మగుచుండఁగనే కొలువుగూటమంతయు గిక్కిరిసి పోయినది. సామంత దండనాథులు రాజోద్యోగులు యథోచిత స్థానముల స్వీకరించిరి. ఉజ్వల రత్న ఖచిత స్వర్ణాసనమున రఘునాథనాయకుఁడు, నతని పార్శ్వమున యాచమ నాయకుఁడు నాసీనులై యుండిరి. అందఱు యాచమనాయకుని వైపునకే తదేకధ్యానముతోఁ జూడసాగిరి. ముహూర్తసమయమున విప్రులు వేదమంత్రఘోషతో శ్రీరామరాయల సింహాసనమందు నిల్పిరి. జయజయధ్వానములు మిన్నుముట్టెను. శత ఘ్నులు చంద్రగిరికోటపై రామరాయల పట్టాభిషేక మహో

త్సవమును భూనభోంతరాళములు ప్రతిధ్వనింపఁ బ్రకటించినవి. రాజ పురోహితుఁడు పుణ్యనదీ తోయముల శ్రీరామరాయుల నభిషేకించి, కిరీటము నెత్తెను. శ్రీరామరాయలు కిరీటమును పురోహితుని హస్తములనుండిగ్రహించి శిరస్సుపై నిడుకొనెను.

వందిమాగధులు విద్యానగరసామ్రాజ్య చక్రవర్తుల వంశక్రమానుగతమైన ప్రాచీన బిరుదనామముల నుగ్గడించి శ్రీరామరాయలను స్తుతించిరి. కొలువు కూటమంతయు యాచమనాయకుని దిక్కుచూచెను. యాచమనాయకుఁడు శిరస్సు వంచుకొని యుండెను. ఆ ముహూర్తము యాచమ నాయకుని జీవితమున నమృతగడియలు. ఆ సమయమును సువర్ణాక్షరములతోఁ జరిత్రకారులు చిత్రించెదరు. పట్టాభి షేకమహోత్సవమున ప్రధానవ్యక్తి శ్రీరామరాయలు. సదా స్థూలదృష్టిలో యాచమనాయకుఁడే తేజోమూర్తిగ వెల్గెను.

శ్రీరామరాయలు రఘునాథనాయకునకు రత్నఖచిత కాంచనఖడ్గమును మత్తేభయూథములను బహూకరించి యతని దక్షిణసామ్రాజ్యభార ధౌరేయుఁడని, ప్రస్తుతించెను. కవులను, గాయకులను, సర్వసామంత దండనాథుల నతఁడు యథో చితముగ సత్కరించెను.

శ్రీరామరాయలు సింహాసనమును దిగి, యాచమనాయకుని వేదికయొద్దకు వచ్చినిలిచెను. సభ్యులందఱు నిశ్శబ్దముగ

దిలకించుచుండిరి. యాచమనాయకుఁడు కృతార్థుఁడు. రామ రాయలు, యాచమనాయకునితో 'మాటలు మాకృతజ్ఞతను జెప్పఁజాలవు. మౌనమె హృదయమును వ్యక్తముచేయఁగలుఁగు నేమో!'యని గద్గదకంఠముతో వచించి యతనికి మణిస్థగిత స్వర్ణ ఖడ్గమును బహూకరించెను.

పట్టాభిషేక మహోత్సవానంతరము రఘునాథనాయకుఁడు, దండనాథులు ప్రజలు తమతమసీమలకుఁ దరలిపోయిరి.

యాచమనాయకుఁడు తిరుపతిక్షేత్రమును దర్శించి, రామరాయలు తనకుఁ గానుకగ నిచ్చిన స్వర్ణ ఖడ్గమును శ్రీ వేంకటేశ్వరస్వామి పాదముల నిమీలిత నేత్రుఁడై సమర్పించెను.